PRAJASAKTI Regd.No. 15795/68 సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక :157 | విజయవాడ, శనివారం 7 జనవరి 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Saturday 7 January 2023 | Rs

ప్రయివేటుకు భారీగా మాంగనీస్

- భారీ ఎత్తున కట్టబెట్టేందుకు రంగం సిద్ధం
- పర్యావరణ పరిరక్షణ గాలికి
- ఆందోళనలో ప్రజానీకం

లోపలి పేజీలో..

'గ్రంథాలయాలు, విద్య, ప్రజాసంస్కృతి'పై రేపు సదస్సు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : 'గ్రంథాలయాలు, విద్య, ప్రజా సంస్కృతి' అంశంపై ప్రజా వికాస వేదిక ఆధ్వర్యంలో ఈ నెల ఆదివారం నిర్వహించనున్నట్లు ప్రజా వికాస వేదిక బాధ్యులు రావి శారద, డి రమేష్ పట్నాయక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంబి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిచే ఈ సదస్సుకు గ్రంథాలయాల నిర్వాహకులు, రచయితలు, కవులు, విద్యా, సాంస్కృతిక రంగాల ప్రముఖులు, ప్రచురణకర్తలు, ప్రజాస్వామ్య ప్రియులు, మేధావులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉదయం జరిగే సెషన్‌లో 'విద్య, గ్రంథాలయోద్యమం' అనే అంశంపై ప్రొఫెసర్ రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, 'ప్రజా సంస్కృతి, పునర్వికాసం' అంశంపై తెలకపల్లి రవి, 'మూఢ విశ్వాసాలు-విజ్ఞాన శాస్త్రం'పై ప్రొఫెసర్ ఎ రామచంద్రయ్య ప్రసంగిస్తారని తెలిపారు. మధ్యాహ్నం జరిగే సెషన్‌లో 'భారతదేశంలో బహుళత్వం-జాతీయ సమైక్యత'పై ఎంవిఎస్ శర్మ, 'లౌకికవాదం-నేటి సవాళ్లు' అంశంపై ప్రొఫెసర్ ఎన్ అంజయ్య, 'ప్రజాస్వామ్యం, రాజకీయాలు, రాజ్యాంగం' అంశంపై పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తారని పేర్కొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ధర్మాన, వేదికపై ఉన్నతాధికారులు

సచివాలయాలు ఇక రిజిస్ట్రార్ కార్యాలయాలు

- రెవిన్యూ అధికారుల ప్రాంతీయ సదస్సులో మంత్రి ధర్మాన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సచివాలయాలు రానున్న రోజుల్లో రిజిస్ట్రార్ కార్యాలయాలుగా కూడా వ్యవహరిస్తాయని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాద రావు అన్నారు. విజయవాడ బందరు రోడ్డులోని లెమన్ ట్రీ పార్క్ హోటల్‌లో కోస్తాంధ్రకు చెందిన 9 జిల్లాల రెవెన్యూ అధికారులతో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రాంతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

ప్రతి గ్రామ, వార్డు సచివాలయాన్ని ఈ దిశలో తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలని చెప్పారు. సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. . ఇతర రాష్ట్రాల్లో అసైన్డ్ భూములపై అధ్యయనం చేసేందుకు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓ ప్రత్యేక కమిటీని వేశారని, కమిటీ నివేధిక సమర్పించిన అనంతరం దానిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. భూముల రీసర్వే ద్వారా ఇంటి స్థలాలు, 22(ఎ) నిషేధిత భూములు, చుక్కల భూముల సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు రక్ష పథకం, ఇళ్ల పట్టాలపంపిణీ, 22(ఎ) కేసులు, చుక్కల భూములు, సాధాభైనామా, ఆర్ఓఆర్, ఆర్ఓఎఫ్ఆర్, నాలా ఆక్రమణల క్రమబద్ధీకరణ, అనాధీన భూములు, ఇ- పంట, అంశాలపై దృష్టి సారించాలని చెప్పారు. పేద, బడుగు , బలహీన వర్గాల వారికి సొంత ఇంటి కలను నెరవేరుస్తున్నామని, 32 లక్షలమంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందించామని,భూముల సేకరణకు రూ. 12 వేల కోట్లకు పైగా నిధులు చెల్లించామన్నారు. ఇటువంటి మహత్తరమైన కార్యక్రమంలో పాలుపంచుకున్న రెవెన్యూ యంత్రాంగాన్ని తాము అభినందిస్తున్నామని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు.. సదస్సులో సిసిఎల్ఎ జి.సాయి ప్రసాద్, రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజత్ భార్గవ్, సిసిఎల్ఎ అదనపు కార్యదర్శి ఇంతియాజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కమిషనరు,ఐజిరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చీకటి జీఓపై 10న రాష్ట్రవ్యాప్త నిరసనలు : సిఐటియు 2

సమైక్య పోరు తోనే సమానత్వం

ఐద్వా అఖిల భారత మహా సభలో వక్తల పిలుపు | **స్ఫూర్తిదాయకంగా ప్రారంభం** | **మతోన్మాదులను గద్దె దింపాలి : బృందాకరత్**

మల్లుస్వరాజ్యం ప్రాంగణం (తిరువనంతపురం) నుంచి ప్రజాశక్తి ప్రతినిధి

సమైక్యపోరుతోనే సమానత్వ సాధన సాధ్యమవుతుందని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పిలుపునిచ్చింది. ఆ సంఘ 13వ జాతీయ మసహసభ తిరువనంతపురంలోని మల్లు స్వరాజ్యం ప్రాంగణంలోని ఎంసి జోసఫీ నగర్‌లో శుక్రవారం ఉత్సాహపూరిత వాతావరణంలో స్ఫూర్తిదాయకంగా ప్రారంభమైంది. దేశం నలుమూలల నుండి తరలివచ్చిన మహిళాసంఘం ప్రతినిధులు, అభిమానులతో సభాప్రాంగణంలో సందడి నెలకొంది. ఉదయం 9.30 గంటలకు ఆ సంఘం అధ్యక్షులు మాలినీ భట్టాచార్య మల్లు స్వరాజ్యం ప్రాంగణంలో ఐద్వా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా జిందాబాద్, ఐద్వా లాంగ్‌లివ్ అన్న నినాదాలు మార్మోగాయి. అనంతరం కేరళ కళామండలి డీమ్డ్ యూనివర్సిటీ ఛాన్సలర్, ప్రముఖ నృత్యకారిణి మల్లికా సారాబాయి జాతీయ మహాసభను లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగించిన వక్తలు ఐక్య పోరాటాల ఆవశ్యకతను వివరించారు. మహిళల అణచివేతకు కారణమవుతున్న మనువాదాన్ని ఓడించడానికి మరింత ఉధృతంగా ఐక్యపోరాటాలను నిర్వహించాలని అన్నారు. ప్రారంభోపన్యాసం చేసిన ఐద్వా పూర్వ జాతీయ కార్యదర్శి బృందాకరత్ స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల గడిచినా ప్రజాస్వామ్యం కోసం, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం పోరాడాల్సి రావడం శోచనీయమన్నారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న హక్కులకు కూడా ప్రస్తుతం ప్రమాదం ఏర్పడిందని అన్నారు. వివిధ పేర్లతో వ్యాపించిన సంఘ్‌పరివార్ శక్తులు మనువాదాన్ని సమాజంపై బలంగా రుద్దడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఈ కుట్రను ఖచ్చితంగా తిప్పికొట్టాలని, లేని పక్షంలో


ఐద్వా మహాసభలో ప్రజాప్రతినిధులనుద్దేశించి ప్రసంగిస్తున్న బృందాకరత్

- మరిన్ని వార్తలు లోపలిపేజీలో

మహిళల మనుగడే ప్రశ్నార్థకమవుతుందన్నారు. మతోన్మాదులను గద్దె దించడం ద్వారానే సమానత్వ పోరాటం ముందుకు సాగుతుందని అన్నారు. హక్కులతో పాటు భావి తరాలను పరిరక్షించుకోవడం కోసం ఈ కర్తవ్యాన్ని మహిళలు తీసుకోక తప్పదని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల్లో మహిళలు చేసిన పోరాటాలను ఆమె ప్రస్తావించారు. కరోనా సమయంలో దేశ వ్యాప్తంగా మహిళాసంఘం కార్యకర్తలు విస్తృతంగా సేవలందించారని చెబుతూ వారికి అభినందనలు తెలిపారు. మల్లికా సారాబాయి మాట్లాడుతూ సమాజాన్ని మార్చాలంటే మహిళలు పెద్ద సంఖ్యలో రాజకీయాల్లోకి రావాలని అన్నారు. ప్రస్తుతం మనువాదం దేశాన్ని తిరోగమనం వైపు నెడుతోందని, కులం, మతం పేరుతో చీలుస్తోందని చెప్పారు. ఈ కుట్రను తిప్పికొట్టడానికి ఐక్యంగా పోరాడాలని అన్నారు. ప్రస్తుతం దేశంలో ఇష్టమైన తిండి తినడం, ఇష్టమైన బట్ట కట్టడం కూడా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇది సామూహిక పోరాటం : తీస్తా సెతల్వాద్

'హక్కుల కోసం మనం చేస్తున్న పోరాటం వ్యక్తుల పోరాటం కాదు. సామూహిక పోరాటం. ఏ పోరాటమైనా ఐక్యంగా చేస్తేనే విజయవంతమవుతుంది. ఆ దిశలో ఐద్వా అడుగులు పడుతుండటం మంచి పరిణామం' అని ప్రముఖ హక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాద్ అన్నారు. కోటి మందిని సభ్యులుగా కలిగిఉండటం సామాన్య విషయం కాదన్నారు. ' దేశంలో ఎనిమిదేండ్ల నుండి క్రూరమైన పాలన నడుస్తోంది. నయా ఉదారవాద విధానాలు, మతోన్మాదం వల్ల భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డాయి. మన వాళ్ళనే మనకు శత్రువుగా మార్చేస్తున్నారు.' అని వాపోయారు. న్యాయ వ్యవస్థను, చట్టాలను కాపాడుకోవడం కోసం గొంతు విప్పాలని పిలుపునిచ్చారు. తాను హక్కుల కార్యకర్తగానే కాక జర్నలిస్టుగా కూడా పనిచేస్తున్నానని, అయితే,. మీడియా మొత్తం కార్పొరేటీకరణ అవుతూ పాలకుల కొమ్ముకాస్తోందన్నారు. మీడియా తన పాత్ర తాను సరిగ్గా నిర్వహిస్తే ప్రజా ఉద్యమాలకు మరింత బలం వస్తోందని చెప్పారు.

రేపటి వెలుగుల కోసం ఉద్యమించాలి : ఎలైడా గువేరా

ఐద్వా జాతీయ మహాసభ ప్రారంభ కార్యక్రమానికి ప్రత్యేక అతిధిగా హాజరైన చే గువేరా కుమార్తె మానవ హక్కుల కార్యకర్త ఎలైడా గువేరా మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మహిళలు చేస్తున్న పోరాటాలు సంఘటితమవుతున్నాయని చెప్పారు. భావి తరాల కోసం రేపటి మిగతా 7లో

సిఎంకు ఓటమి భయం

- వైసిపిని భూస్థాపితం చేసే వరకూ నిద్రపోను : చంద్రబాబు
- పోలీసుల తీరు నిరసిస్తూ రోడ్డుపై నిరసన

ప్రజాశక్తి- గుడిపల్లి (చిత్తూరు జిల్లా)

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు అన్నారు. ప్రజాస్వామ్యంపై దాడి చేస్తే వైసిపిని భూస్థాపితం చేసే వరకూ నిద్రపోనని తెలిపారు. హద్దులు దాటిన వాళ్లకు తగిన బుద్ధి చెబుతామన్నారు. తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో చంద్రబాబు పర్యటన మూడో రోజూ ఉద్రిక్తతల నడుమే సాగింది. గుడిపల్లిలో శనివారం ఆయన పర్యటించారు. టిడిపి నాయకులు రైల్వే గేటు సమీపంలో భారీ స్వాగత ఏర్పాట్లు చేసి క్రేన్ ద్వారా భారీ గజమాలను చంద్రబాబు మెడలో అలంకరించారు. తన పర్యటనకు అడుగడుగునా ఆటంకం కలిగించిన పోలీసుల తీరును నిరసిస్తూ చంద్రబాబు కొద్దిసేపు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీసుల అరాచకం వెనుక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఉన్నారని విమర్శించారు. పోలీసులకు


పోలీసుల తీరును నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించిన చంద్రబాబు

అసలు మానవత్వం ఉందా? అని ప్రశ్నించారు. తన నియోజకవర్గంలో తనను అడ్డుకోవడానికి సిగ్గనిపించడం లేదా? అని మండిపడ్డారు. మీరు ఎంత ఆపితే ప్రజలు అంతగా తిరగబడతారన్నారు. తనను శారీరకంగానే ఇబ్బంది పెడతారని, ప్రజల కోసం ప్రాణాలైనా ఇచ్చే సంకల్పం తనదని పేర్కొన్నారు. వేలాదిమంది పోలీసులు వచ్చారని, మేమేమైనా టెర్రరిస్టులమా? వైసిపి నేతలు రోడ్డు షోలు, సభలు పెట్టుకోవచ్చా? అని ప్రశ్నించారు. తప్పు చేసిన వాళ్లందరినీ బట్టలు విప్పి నడిరోడ్డుపై తిప్పే రోజు వస్తుందన్నారు. నల్లచట్టాన్ని తీసుకొచ్చి తన నియోజకవర్గంలోనే తిరగకుండా చేశారని, తన ప్రచార రథానికి లైసెన్స్ ఉందని తెలిపారు. వీటన్నింటికీ 2024లో సమాధానం ఉంటుందన్నారు. పోలవరం ప్రాజెక్టును ముంచేశారని, కేవలం రూ.20 కోట్ల హంద్రీనీవా పెండింగ్ పనులు చేయలేకపోతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి, తిరుపతి మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, మాజీ ఎంఎల్‌సి గౌనివారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఢిల్లీ కార్పొరేషన్ సమావేశంలో బిజెపి, ఆప్ బాహాబాహీ

- మేయర్ ఎన్నిక వాయిదా?

న్యూఢిల్లీ : ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసిడి) మేయర్ ఎన్నికలు వాయిదాపడ్డాయి. తొలి సమావేశంలోనే ఆమ్ ఆద్మీ పార్టీ, బిజెపి కౌన్సిలర్లు ఒకరిపై ఒకరు దాడి చేసుకుని, కుర్చీలు విసిరేసుకోవడంతో ఎన్నికలను వాయిదా వేసినట్లు సీనియర్ ఎంసిడి అధికారి తెలిపారు. శుక్రవారం నాటి సమావేశంలో కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేయాల్సి వుంది. సభలో అత్యంత సీనియర్ సభ్యుడిని తాత్కాలిక స్పీకర్‌గా నియమించాల్సి ఉండగా, బిజెపి కౌన్సిలర్ సత్య శర్మను ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ జివికె సక్సేనా నియమించ డంపై ఆప్ సభ్యులు ఆందోళన చేశారు. కౌన్సిలర్ల కంటే ముందుగా ఎల్‌జి సిఫార్సు చేసిన నామినేటెడ్ సభ్యులతో తాత్కాలిక స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి సభ్యుల ఆందోళనతో సమావేశం వాయిదా పడింది. ఇటీవల 250 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ఆప్ 134 స్థానాల్లోనూ, బిజెపి 104 స్థానాల్లోనూ గెలుపొందాయి. నామినేటెడ్ సభ్యుల మద్దతుతో మేయర్ పదవిని దక్కించుకోవాలని బిజెపి ప్రయత్నిస్తోంది.



గ్లోబల్ హెల్త్ సమ్మిట్ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి రజని

టెలీ మెడిసిన్‌లో అగ్రభాగాన రాష్ట్రం

- గ్లోబల్ హెల్త్ సమ్మిట్‌లో మంత్రి రజని

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

టెలీ మెడిసిన్ విభాగంలో దేశంలోనే రాష్ట్రం అగ్రభాగాన ఉందని, ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని దేశంలో మొట్టమొదటి సారిగా రాష్ట్రంలో అమలు చేశామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రి విడదల రజని తెలిపారు. వైద్య రంగంలో నైపుణ్యాభివృద్ధికి గ్లోబల్ హెల్త్ సమ్మిట్ ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజాన్ (ఆపి) ఆధ్వర్యంలో విశాఖలోని నోవాటెల్ హోటల్‌లో మూడు రోజుల పాటు జరగనున్న 16వ గ్లోబల్ హెల్త్ సమ్మిట్‌ను ముఖ్య అతిథిగా హాజరై ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఇటువంటి సమ్మిట్లు శాస్త్రీయ పరిశోధన ద్వారా రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు దోహదం చేస్తాయన్నారు. వైద్యుల సేవా దృక్పథం, అంకితభావం దేశ, ప్రపంచ అభివృద్ధికి కీలకమన్నారు. తమ ప్రభుత్వం ఆరోగ్య రంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. నాడు - నేడు పథకం ద్వారా రూ.16 వేల కోట్లను ఖర్చు చేసి వైద్యాలయాలను అందంగా తీర్చిదిద్దామని తెలిపారు. 10,032 వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లు, 1,142 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 560 పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు విస్తృత ఆరోగ్య సేవలు అందిస్తున్నామన్నారు. 17 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని, 48 వేల పోస్టులను వైద్య రంగంలో భర్తీ చేశామని తెలిపారు. అనంతరం ఆమె సిఎం జగన్మోహన్ రెడ్డి గ్లోబల్ హెల్త్ సమ్మిట్ ప్రారంభ సందర్భంగా పంపించిన సందేశాన్ని చదివి వినిపించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఆపి అధ్యక్షులు డాక్టర్ రవి కొల్లి, రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొన్నారు. ఈ సమ్మిట్‌కు వివిధ దేశాల నుంచి వైద్యులు తరలివచ్చారు.

కొలీజియాన్నే ఖాతరు చేయరా?

- కేంద్రం తీరుపై సుప్రీం కోర్టు ఆగ్రహం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

న్యాయమూర్తుల నియామకం కోసం కొలిజియం పునరుద్ఘాటించిన పేర్లను కేంద్ర ప్రభుత్వం వెనక్కి పంపుతోందని, కొలిజియం ఆమోదించని పేర్లను పరిశీలనకు పంపుతోందని అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. సుప్రీం కోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల నియామకాలను కేంద్ర ప్రభుత్వం జాప్యం చేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ అభయ్ ఎస్ ఓకాలతో కూడిన ధర్మాసనం విచారించింది. తొలి విడతలో పంపిన పేర్లలో కేంద్ర ప్రభుత్వ అభ్యంతరాల తరువాత కొలిజియం పునరుద్ఘాటించిన అభ్యర్థుల పేర్లను కూడా ప్రభుత్వం వెనక్కి పంపుతోందని ధర్మాసనం పేర్కొంది. "22 పేర్లను కేంద్ర ప్రభుత్వం వెనక్కి పంపింది. కొన్ని పునరుద్ఘాటించిన (పేర్లు) వెనక్కి పంపారు. వెనక్కి పంపిన వాటిలో కొన్ని మూడోసారి కూడా పునరుద్ఘాటించబడ్డాయి. కొన్నింటిని కొలిజియం ఆమోదించనప్పటికీ పరిగణించాలని కేంద్రప్రభుత్వం భావిస్తోంది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. "కొలిజియం ఆమోదించిన పేర్లను వెబ్‌సైట్‌లో ఉంచారు. కానీ కేంద్ర ప్రభుత్వం ఆమోదించదు. ఇది కొంత ప్రభావం చూపుతుంది" అని జస్టిస్ ఎఎస్ ఓకా అన్నారు. 'ప్రతిభావంతులైన వ్యక్తులు సమ్మతి ఇవ్వడానికి సంకోచించే వాతావరణాన్ని మనం సృష్టిస్తున్నామా?" అని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ ప్రశ్నించారు. రాజకీయ అంశాలతో సంబంధం లేకుండా న్యాయమూర్తులు కేసులను విచారిస్తారని ధర్మాసనం స్పష్టం చేసింది. "బెంచ్‌లో అత్యుత్తమ సేవలందించిన జస్టిస్ విఆర్ కృష్ణయ్యర్‌ను మేము అభినందిస్తున్నాం. మేం న్యాయమూర్తులు అయినప్పుడు రాజకీయ అనుబంధాలతో సంబంధం లేకుండా విధులు నిర్వర్తిస్తాం. జస్టిస్ కృష్ణయ్యర్ కేరళలో మంత్రిగా ఉన్నారు. ఆయన న్యాయవాదిగా ఉన్నప్పుడు ఆ రాష్ట్రంలో వామపక్ష ప్రభుత్వానికి అనుబంధంగా ఉన్నారు. ఆయన న్యాయమూర్తి అయిన తరువాత రాజకీయాలకు సంబంధం మిగతా 7లో

'జగనన్న' ఇంటికి రూ.5 లక్షలు ఇవ్వాలి

- రెండో వారంలో సచివాలయాల వద్ద నిరసనలు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- టంగుటూరు

జనావాసాలులేని ప్రాంతాల్లో జగనన్న కాలనీలు కేటాయించడంతో జగనన్న కాలనీల పథకం పూర్తిగా విఫలమైందని, ఇది ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే అవమానకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. నిరుపేదల సొంతింటి కలను ప్రభుత్వం నిజంగా నెరవేర్చదలుచుకుంటే హౌసింగ్ బోర్డు ద్వారా ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం జమ్ములపాలెంలోని జగనన్న లేఅవుట్‌ను సిపిఎం నాయకులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. లేఅవుట్‌లో అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు, అసలు ప్రారంభం కాని ప్లాట్లను పరిశీలించారు. లబ్ధిదారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో శ్రీనివాసరావు మాట్లాడారు. జనావాసాలులేని అడవి ప్రాంతాల్లోనే జగనన్న కాలనీలు ఎక్కువగా కేటాయించారని విమర్శించారు. కొన్నిచోట్ల ఈ కాలనీల్లో మౌలిక సదుపాయాలను


జగనన్న లేఅవుట్‌లో అసంపూర్తిగా ఉన్న ఇంటిని పరిశీలిస్తున్న వి.శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు

ప్రభుత్వం కల్పించకపోవడంతో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదని తెలిపారు. స్థానిక వైసిపి నాయకులు అతి తక్కువ ధరకు భూములను కొనుగోలు చేసి జగనన్న కాలనీల కోసం ప్రభుత్వానికి రెట్టింపు ధరకు విక్రయించి కుంభకోణాలకు పాల్పడ్డారని విమర్శించారు. ఆరు నెలల్లో ఇళ్లు కట్టించి నిరుపేదల సొంతింటి కల నెరవేరుస్తామని చెప్పిన ముఖ్యమంత్రికి మూడేళ్లయినా గృహ నిర్మాణదారుల కష్టాలు పట్టడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షలమంది పట్టాలు లేకుండా నివసిస్తున్నారని, వారందరికీ నివాసం ఉంటున్న చోటే వెంటనే పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగనన్న కాలనీ గృహ నిర్మాణాలపై ఈ నెల రెండో వారంలో సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామని, ఈ నెలాఖరుకు రాష్ట్ర వ్యాప్త కార్యక్రమానికి శ్రీకారం చుడతామని చెప్పారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిధుల మళ్లింపుపై హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి

ఎస్‌సి కార్పొరేషన్ నిధుల మళ్లింపు వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎస్‌సి కార్పొరేషన్ నిధులను నవరత్నాలకు ఎలా మళ్లిస్తారని ప్రశ్నించింది. ఎస్‌సి కార్పొరేషన్ నిధుల మళ్లింపు పిటిషన్‌పై శుక్రవారం జరిపిన విచారణ సందర్భంగా హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. స్వయం ఉపాధి కింద బడ్జెట్‌లో కేటాయించిన రూ.7,000 కోట్లలో ఏమీ ఖర్చు చేయలేదా? అని నిలదీసింది. ఎస్‌సి కార్పొరేషన్ ఉద్దేశం, లక్ష్యం, ఆశయం నెరవేరనప్పుడు దాన్ని మూసేయడం మంచిదని వ్యాఖ్యానించింది. బిల్లుల చెల్లింపు వివరాలతో అఫిడవిట్ వేయాలని ఎస్‌సి కార్పొరేషన్ ఎమ్‌డిని ఆదేశించి విచారణను వాయిదా వేసింది.

ఉన్మాది ఘాతుకం

- యువతితో పాటు తల్లి, చెల్లెలుపై దాడి
- తాడేపల్లిగూడెంలో దారుణం

లోపలి పేజీలో..

గ్రూప్-2 పరీక్షలో రెండు పేపర్లే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఎపిపిఎస్‌సి) నిర్వహించే గ్రూపు-2 పరీక్షల విధానంలో రాష్ట్రప్రభుత్వం మార్పులు చేసింది. ప్రస్తుతం స్క్రీనింగ్, ప్రధాన పరీక్ష కలిపి 600 మార్కులకు నిర్వహిస్తున్న విధానాన్ని 450 మార్కుల విధానానికి తీసుకొచ్చింది. మూడు పేపర్లకు నిర్వహిస్తున్న ప్రధాన పరీక్షకు అదనంగా సిలబస్‌ను కలిపి రెండు పేపర్లకే పరిమితం చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి చిరంజీవి చౌదరి శుక్రవారం విడుదల చేశారు. ప్రస్తుతం స్క్రీనింగ్ పరీక్షను ఒక పేపర్‌లో 150 మార్కులకు, ప్రధాన పరీక్షను మూడు పేపర్లలో 450 మార్కులకు నిర్వహిస్తోంది. ప్రధాన పరీక్షలో ఉన్న మూడు పేపర్ల విధానాన్ని రద్దు చేసి రెండు పేపర్ల పరీక్ష తీసుకొచ్చింది. ఒక్కో పేపర్ 150 మార్కుల చొప్పున 300 మార్కులకు పరీక్షను నిర్వహించనుంది. అదేవిధంగా 150 మార్కులకు నిర్వహిస్తున్న స్క్రీనింగ్ టెస్ట్‌లో కొత్తగా సిలబస్‌ను కలిపింది. మెయిన్ పరీక్షలో నిర్వహించే పేపర్-1 జనరల్ స్టడీస్‌ను స్క్రీనింగ్ పరీక్ష సిలబస్‌గా ప్రవేశపెట్టింది. అదేవిధంగా మెంటల్ ఎబిల్టీ సిలబస్‌ను కొత్తగా చేర్చింది. మెయిన్ పరీక్ష పేపర్-2లో ఉన్న ఆంధ్రప్రదేశ్ సోషల్ హిస్టరీ సిలబస్‌ను పేపర్-1లో చేర్చింది. అదనంగా భారత రాజ్యాంగ సాధారణ వీక్షణ సిలబస్‌ను చేర్చింది. పేపర్-2లో భారతదేశం, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థతో పాటు సైన్స్ అండ్ టెక్నాలజీ సిలబస్ నుంచి ప్రశ్నలు ఉంటాయి.

మాజీ ఎమ్మెల్యే పీటర్‌పాల్ కన్నుమూత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు జిల్లా పత్తిపాడు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే చుక్కా పీటర్ పాల్ (84) మృతి చెందారు. వయోభారంతో గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం నగరంలోని శ్రీనివాసరావుతోటలోని తన నివాసంలో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఐదుగురు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. 1972లో కాంగ్రెస్ పార్టీ తరపున పత్తిపాడు నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన రెండో కుమారుడు చంద్రపాల్ పల్నాడు జిల్లా సత్తెనపల్లి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్‌గా ఉన్నారు. అంత్యక్రియలను శనివారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భౌతికకాయాన్ని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ పలువురు కాంగ్రెస్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

చీకటి జీఓపై 10న రాష్ట్రవ్యాప్త నిరసనలు

- సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

రాష్ట్రంలో సభలు, ర్యాలీలు, రోడ్‌షోలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదలచేసిన జీఓకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 10న నిరసనలను చేపడుతున్నట్లు సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిహెచ్ నర్సింగరావు తెలిపారు. శుక్రవారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్యహక్కులను కాలరాసేలా ఈ జీఓను తెచ్చిందని అన్నారు. ప్రజా ఉద్యమాలను ఎక్కడికక్కడే అణిచివేసేందుకే ప్రభుత్వం ఈ జీఓను విడుదల చేసిందన్నారు. ఈ చీకటి జీఓను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అధిక లాభాలు వస్తున్న పరిశ్రమల్లోనూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో వేతనాలపై కోతలు పెడుతున్నా ప్రభుత్వం స్పందించడంలేదని అన్నారు. ఫార్మా, సిమెంట్, ఆక్వా, గ్రానైట్ లాంటి సంస్థలలో ఎక్కువ పనిగంటలు చేయించుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో దాదాపు 50 లక్షల మంది కార్మికులు కనీసవేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ లాంటివాటికి నోచుకోవడంలేదన్నారు. రాష్ట్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం అదానిప్రదేశ్‌గా మారుస్తోందని విమర్శించారు. రాష్ట్రంలోని ఓడరేవులు, విద్యుత్ ఉత్పత్తి సంస్థలను అదానికి కట్టబెడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మార్చిలో చలో అసెంబ్లీ కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కారుచౌకగా అమ్మేందుకు చేస్తున్న కుట్రలను కార్మికవర్గం తిప్పికొట్టాలని కోరారు. రాష్ట్రంలో సిఐటియు మరింత విస్తరించేందుకు ఈ నెల 2, 3, 4 తేదీలలో భీమవరంలో జరిగిన సిఐటియు మహాసభ పిలుపునిచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 476 మండలాల్లో సిఐటియు కమిటీలు పనిచేస్తున్నాయని, రానున్న మూడేళ్లలో మొత్తం 679 మండలాలకు సిఐటియును విస్తరిస్తామని తెలిపారు. పనిప్రదేశాలు, మండల కేంద్రాల్లో ఈ నెల 10న సిఐటియు పతాక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమానపనికి సమానవేతనంను అమలుకావడంలేదని అన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె సుబ్బరావమ్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీలాంటి స్కీమ్‌లకు కేటాయింపులను తగ్గించడం సరైందికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జాతీయవిద్యావిధానాన్ని అమలు చేస్తూ అంగన్‌వాడీలను తగ్గిస్తోందని అన్నారు. అంగన్‌వాడీలను సచివాలయాల పరిధిలోకి తీసుకురావాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి నూర్‌మహ్మద్ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న నర్సింగరావు



రాజమహేంద్రవరంలో నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే జిఒ ఒకటి

ప్రజాశక్తి - యంత్రాంగం

రహదారిపై సభలు, ప్రదర్శనలను నిషేధిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ ఒకటిని రద్దు చేయాలని తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జిల్లాల్లో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసనలు జరిగాయి. జిఒను వెంటనే రద్దు చేయాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని నినదించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిరసన ర్యాలీ చేపట్టారు. శ్యామలాసెంటర్‌లో ధర్నా నిర్వహించి జిఒ ప్రతులను దగ్ధం చేశారు. కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. విశాఖలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి పాల్గొన్నారు. నెల్లూరు జిల్లా కందుకూరులో టిడిపి కార్యాలయం నుంచి అంబ్కేదర్ సెంటర్ వరకు ఆ పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి, జిఒ కాపీలను దగ్ధం చేశారు. ప్రతిపక్ష పార్టీల గొంతు నొక్కడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ జిఒను తీసుకువచ్చిందని పలువురు నాయకులు విమర్శించారు.

సభలు పెట్టుకోవద్దని ఎవరన్నారు ?

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సభలు, సమావేశాలు పెట్టుకోవద్దని ఎక్కడా చెప్పలేదని ప్రజల భద్రతదృష్ట్యా నిబందనల మేరకు అనుమతులు తీసుకొని నిర్వహించుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం జీఓను ఇచ్చిందని రాష్ట్ర ప్రభుత్వసలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. చంద్రబాబు నాయుడును నిబంధనలను బేఖాతారు చేస్తూ ప్రభుత్వంపై దుష్ప్రచారంకు పాల్పడుతూ మూడు రోజులుగా కుప్పంలో పర్యటిస్తున్నారని విమర్శించారు. శుక్రవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్రకార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కందుకూరు, గుంటూరులలో తెలుగుదేశంపార్టీ తప్పిదంవల్లే ప్రాణనష్టం జరిగిందని అన్నారు. ఈ ఘటనలకు చంద్రబాబునాయుడు నైతికబాధ్యత వహించకుండా ఉన్మాది తరహాలో ప్రభుత్వంపై విరుచుకుపడటంలో సహేతుకత ఎక్కడుందని ప్రశ్నించారు. బాద్యతగల ప్రభుత్వంగా రోడ్లపై సభలు వద్దని ప్రత్యామ్నాయం చూసుకోవాలని జీఓ తెచ్చామని అన్నారు. ఆ జీఓలో నిషేదం అనే మాట ఎక్కడా లేదని అన్నారు. ఈ జీఓ తప్పు అనుకుంటే న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని తెలిపారు. కుప్పంలో చంద్రబాబునాయుడి సభలకు ప్రజలు రావడంలేదనే ప్రచారం కోసం హైడ్రామాలు సృష్టిస్తున్నారని విమర్శించారు.

జీఓ1ని ఉపసంహరించం -అంబటి రాంబాబు

రాష్ట్రంలో ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వ తీసువచ్చిన జీఓ నెంబర్ 1ను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపసంహరించుకోమని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. తాడేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. ర్యాలీలు చేయవద్దని, సభలు జరపవద్దని జీఓలో ఎక్కడా లేదన్నారు. అనుమతి తీసుకోవాలని జీఓలు వుందని ఆ మాత్రం దానికే హడావిడి చేయడం తగదని అన్నారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అనుమతి ఇవ్వవచ్చని జీఓలో పొందుపరచడం జరిగిందని అన్నారు. మైదానాల్లో సభలు పెట్టుకుంటే ఎవరూ అడ్డుకోరని అన్నారు. ప్రభుత్వ సలహాదారులు టిడిపి హాయంలో కూడా వున్నారని అది తప్పుకాదని అన్నారు. హైకోర్టు సలహాదారులను పెట్టుకోవద్దని అనలేదని అన్నారు.

రాజకీయాలకు హైకోర్టు వేదిక కాదు

- ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో తెలంగాణ హైకోర్టు వ్యాఖ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రాజకీయాలకు హైకోర్టును వేదికగా చేసుకోవద్దని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ అన్నారు. రాజకీయ అంశాలు బయట చూసుకోవాలని హితవు పలికారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసు దర్యాప్తును సిబిఐకి అప్పగిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును కొట్టివేయాలని రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై సిజె ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్ తుకారాం జి ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. కేసు ఫైల్స్ కోసం అధికారులపై సిబిఐ ఒత్తిడి చేస్తోందని అడ్వకేట్ జనరల్ బిఎస్ ప్రసాద్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ కేసులో ముగ్గురు నిందితులు రామచంద్రభారతి, సింహయాజీ, నందకుమార్ తరుపున మాజీ అడ్వకేట్ జనరల్ సీతారామమూర్తి, సీనియర్ న్యాయవాది ఎల్ రవిచంద్ర వాదనలు వినిపించారు. అప్పీల్‌కు విచారణ అర్హత లేదని, క్రిమినల్ కేసుల్లో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై అభ్యంతరం ఉంటే సుప్రీంకోర్టుకు వెళ్లాలి కాని, హైకోర్టులో ధర్మాసనం విచారణ జరపకూడదన్నారు. దీనికి సంబంధించి గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ప్రస్తావించారు. ముఖ్యమంత్రి మీడియా సమావేశం కేసు దర్యాప్తును ప్రభావితం చేసేలా ఉన్నందున సిబిఐకి అప్పగించాల్సిందేనని, కేసు దర్యాప్తులో ధర్మాసనం జోక్యం చేసుకోవద్దని వాదించారు. కేసు దర్యాప్తును సిబిఐకి ఇవ్వడమే సరైన విధానమని బిజెపి పార్టీ తరుపున హాజరైన సీనియర్ న్యాయవాది దామోదర్ రెడ్డి పేర్కొన్నారు. బిజెపిపై బిఆర్ఎస్, తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేస్తున్నాయని కోర్టు దృష్టికి తెచ్చారు. బిజెపి దాఖలు చేసిన పిటిషన్‌ను సింగిల్ జడ్జి కొట్టివేసినప్పటికీ దానిపై అప్పీల్ ఎందుకు చేశారని ధర్మాసనం ఎజిని ప్రశ్నించింది. బిజెపి, బిఆర్ఎస్‌లకు సంబంధించిన రాజకీయ అంశాలకు హైకోర్టును వేదికగా చేసుకోవద్దని, అదంతా బయట చూసుకోవాలని సూచించింది.

రాష్ట్ర ప్రభుత్వం తరపున వాదనలు వినిపించేందుకు సీనియర్ న్యాయవాది దుష్యంత్ ఢిల్లీలో ఉన్నారని, సోమవారం వరకు సమయం ఇవ్వాలని, ఆన్‌లైన్ విధానంలో విచారణ జరపాలని ఎజి కోర్టును కోరారు. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు వర్చువల్ విధానంలో విచారణ చేపడతామని ధర్మాసనం తెలిపింది. సిబిఐ తరుపున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ప్రవీణ్ వాదనలు వినిపిస్తూ.. కేసుకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని సిఎస్‌కు లేఖ రాసినట్టు కోర్టుకు తెలిపారు. కేసుకు సంబంధించిన పత్రాలు అందగానే ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేయడానికి సిబిఐ సిద్ధంగా ఉందని వెల్లడించారు. ఫైల్స్ ఇవ్వాలని సిబిఐ ఒత్తిడి తెస్తోందని, దీనిపై ఆదేశాలు ఇవ్వాలని ఎజి కోరగా.. సోమవారం వరకు ఒత్తిడి చేయొద్దని సిబిఐని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

ఉన్మాది ఘాతుకం

- యువతితో పాటు తల్లి, చెల్లెలుపై దాడి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం (పశ్చిమగోదావరి)

యువతిపై ఓ ఉన్మాది విచాక్షణారహింతంగా దాడి చేసిన ఘటన పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలులో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. అడ్డుకోబోయిన యువతి తల్లి, చెల్లెలుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. కొండ్రుప్రోలు గ్రామానికి చెందిన యువతిని అదే గ్రామానికి చెందిన రాజులపాటి కల్యాణ్(27) వెంటపడి తనను ప్రేమించాలని వేధించేవాడు. ఈ విషయాన్ని బాధిత యువతి తన తండ్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన కల్యాణ్‌ను హెచ్చరించారు. దీంతో కల్యాణ్ వారి గడ్డివామును తగలబెట్టాడు. మిగిలిన కొంత భాగాన్ని మళ్లీ తగలబెడతాడేమోనని యువతి తండ్రి, తమ్ముడు పొలం వద్దే రాత్రి కాపాలాగా ఉన్నారు. ఈ విషయాన్ని గమనించిన కల్యాణ్ గురువారం అర్ధరాత్రి 12.30 గంటలకు యువతి ఇంటికి వెళ్లి విద్యుత్ కనెక్షన్‌ను తొలగించి, సిసి కెమెరాలను ధ్వంసం చేశాడు. కరెంటు పోవడంతో యువతితోపాటు ఆమె తల్లి, చెల్లెలు బయటకు వచ్చారు. ఇదే అదునుగా భావించిన కల్యాణ్ వారిపై కత్తిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. బాధితులు కేకలు వేయడంతో అక్కడి నుంచి నిందితుడు పారిపోయాడు. గాయపడిన ముగ్గురిని ఏలూరు ప్రభుత్వాస్పత్రికి పోలీసులు తరలించారు. నిందితుడిని పోలీసులు అరెస్టు తీసుకున్నారు. ఉన్మాది దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న వారిని మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ శుక్రవారం పరామర్శించారు. నిందితుడిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని, కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని పోలీసులను ఆదేశించారు.

భవిష్యత్తులో పల్లెలకు పట్టణాలకు వేర్వేరు లైన్లు

- విద్యుత్ శాఖ ఐటీ డైరెక్టర్ శివప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్



భవిష్యత్తులో పల్లెలకు, పట్టణాలకు, నగరాలకు వేరువేరుగా విద్యుత్తు లైన్లు ఉంటాయని ఎపిఎస్‌పిడిసిఎల్, ఎపిఇపిడిసిఎల్ ప్రాజెక్టు, ఐటీ డైరెక్టర్ కె. శివప్రసాద్ రెడ్డి తెలిపారు.

కర్నూలులోని విద్యుత్ భవన్ కౌన్సిల్ హాలులో ఇఇ, డిప్యూటీ డిఇ, ఎఇలతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విద్యుత్తు ప్రమాదం వల్ల ప్రజలు, విద్యుత్తు సిబ్బంది అధికంగా చనిపోతున్నారని, అందుకు కారణాలను తెలుసుకునేందుకు, లోపాలు గుర్తించేందుకు, సలహాలు, సూచన కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌పర్ట్ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందిస్తే వెంటనే స్పందిస్తామని తెలిపారు. ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు లైన్‌మెన్ పెట్రోలింగ్ అప్లికేషన్ (యాప్) ద్వారా వినియోగదారులకు, సిబ్బందికి, సూచనలు, సలహాలు ఇస్తామని తెలిపారు. ప్రమాదాలను నివారించి, నాణ్యమైన విద్యుత్తును వినియోగదారులకు అందించడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఇ. ఎం ఉమాపతి పాల్గొన్నారు.

కక్షలు కార్పణ్యాలు తప్ప సాధించిందేంటి?

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కక్షలు కార్పణ్యాలు తప్ప జగన్ తన పాలనలో సాధించిందేంటని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు సిఎం జగన్‌ను ప్రశ్నించారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే గీతం విద్యాసంస్థలపై ఆరోపణలు చేస్తూ ఆస్తి ధ్వంసాలకు పాల్పడుతున్నారని ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. జగన్ పతనం ప్రారంభమైందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు చీపుర్లతో తరిమి కొట్టడం తథ్యమని తేలిపోయిందని పేర్కొన్నారు. విశాఖలో వేల కోట్ల విలువైన ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్ని కబ్జాచేసిన జగన్, ఇప్పుడు ప్రత్యర్థుల భూముల్ని కూడా స్వాహా చేసేందుకు ఏకంగా అధికారుల్ని వాడుకుంటున్నారని ఆరోపించారు.

నల్ల జిఓ కోసమే తొక్కిసలాట:వర్ల

నల్ల జిఓలు తేవడం కోసమే కందుకూరు, గుంటూరులలో వైసిపి స్లీపర్‌సెల్స్‌తో తొక్కిసలాట కల్పించారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. చంద్రబాబు రోడ్‌షోలకు ఎందుకని తగిన స్థాయిలో బందోబస్తు కల్పించలేదని శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్, టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రోడ్‌షో కార్యక్రమాలు ప్రకటించారని, వీటికి భయపడి నల్లజీవో తెచ్చి అధిరార దుర్వినియోగానికి పాల్పడ్డారని విమర్శించారు.

ప్రజలపై 10 లక్షల కోట్ల అప్పులభారం

సిఎం వైఎస్ జగన్ అప్పుల్లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపారని టిడిపి అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యలరావు విమర్శించారు. మరో రూ.521కోట్ల అప్పు చేస్తే రూ.10లక్షల కోట్లతో ఎపి రికార్డ్ సాధించిందని పేర్కొన్నారు. అప్పుల్లో అగ్రస్థానంలో నిలిచి గిన్నిస్‌బుక్‌లో చేరడం ఖాయమని ఎద్దేవా చేశారు.

ఓటర్ల చేర్పులు, తొలగింపుల జాబితాలను రాజకీయపార్టీలకు ఇవ్వాలి

- అఖిల పక్ష సమావేశంలో డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఓటర్ల తుది జాబితా (స్పెషల్ సమ్మరీ రివిజన్-2023)పై రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి ముకేష్‌కుమార్‌మీనా శుక్రవారం రాజకీయపార్టీలతో సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టిడిపి, సిపిఎం, కాంగ్రెస్, బిజెపి పార్టీల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఇఓ ఓటర్ల తుది జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా డూప్లికేషన్‌గా రెండు ప్రాంతాల్లో ఓటరుగా నమోదైన 10లక్షల ఓట్ల వరకు తొలగించడం జరిగిందని సిఇఓ ముకేష్‌కుమార్ మీనా తెలిపారు. ఓటర్ల జాబితా ప్రతి నవంబరు, జనవరి నెలలో విడుదల చేస్తుంటామన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల చేర్పులు, తొలగింపులకు సంబంధించి ప్రతి నెలా జాబితాను రాజకీయ పార్టీలకు కూడా కాపీని పంపాలని ఆయా పార్టీల ప్రతినిధులు సిఇఓను కోరారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు సురేష్, సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జయరామ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నరహరిశెట్టి నరసింహారావు, బిజెపి నుంచి అడ్వకేట్ హేమంత్ హాజరయ్యారు.



దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

'ఉక్కు ప్రజాగర్జన'ను విజయవంతం చేయండి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం ఈ నెల 30న ఉక్కు నగరంలోని తృష్ణా మైదానంలో నిర్వహించనున్న ఉక్కు ప్రజా గర్జన సభకు లక్షలాదిగా ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 694వ రోజుకు చేరాయి. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.రామకృష్ణ, డి.నర్సింగరావు, సిహెచ్.సన్యాసిరావు, గుమ్మడి నరేంద్ర మాట్లాడారు. దేశ వ్యాప్తంగా నిరుద్యోగం పెరిగిపోతున్న తరుణంలో యువతకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఆ విషయాన్ని విస్మరించి వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటు వ్యక్తులకు అప్పగించేందుకు పూనుకోవడం దారుణమన్నారు. ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ఉద్యోగులు, నిర్వాసితులు, ప్రజలు సుదీర్ఘకాలంగా పోరాటం చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. మొండిగా ముందుకెళ్తే రానున్న కాలంలో బిజెపి ప్రభుత్వానికి దేశ ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.




సదస్సులో మాట్లాడుతున్న భాస్కరయ్య

చాకలి ఐలమ్మ స్ఫూర్తితో పోరాటం

- ఎపి రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రజకుల సమస్యల పరిష్కారానికి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో పోరాటం చేయాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య పిలుపునిచ్చారు. 'రజకుల సమస్యలు- ప్రభుత్వ విధానాలు-పరిష్కార మార్గాలు' అనే అంశంపై ఎపి రజక వృత్తిదాల సంఘం ఆధ్వర్యాన కర్నూలు కార్మికకర్షక భవనంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో భాస్కరయ్య మాట్లాడుతూ.. సమాజంలో చాలా ప్రాంతాల్లో రజకులు కుల వివక్షతను ఎదుర్కొంటున్నారని, వారిపై దాడులు, అత్యాచారాలు నేటికీ కొనసాగుతున్నాయని తెలిపారు. రజకుల భద్రతకు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం మాదిరిగా సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చే సంస్కరణలు ప్రజలకు, వృత్తిదారులకు భారంగా మారుతున్నాయని తెలిపారు. రిజర్వేషన్లు, కులాలు, మతాల పేరుతో ప్రజలను, వృత్తిదారులను మభ్యపెడుతూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. బిసి కులగనన చేపట్టాలని, అర్హులైన రజకులకు ఇళ్ల స్థలాలు కేటాయించి పక్కా ఇల్లు నిర్మించాలని, వృత్తిదారులకు అధునాతనమైన యంత్రాలతో మోడ్రన్ ధోబి ఘాట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 50 యేళ్ల పూర్తయిన రజకులకు పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. అంతకు ముందు సంఘం 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘం నగర నాయకులు సి.ముక్కన్న అధ్యక్షతన సదస్సులో రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, జిల్లా గౌరవ అధ్యక్షులు సి.హనుమంతన్న, తదితరులు పాల్గొన్నారు.



ఒఎన్‌జి క్యాలెండర్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వి శ్రీనివాసరావు

కౌలు చట్టాన్ని సవరించాలి

- కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి శ్రీనివాసరావు డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జగన్ ప్రభుత్వం సవరణ చేసి తీసుకొచ్చిన కౌలు చట్టం ప్రకారం రైతులందరికీ సిసిఆర్‌సి కార్డులివ్వాలని కౌలురైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లాలోని సంఘం కార్యాలయంలో కౌలు రైతుసంఘం జిల్లా కేలండర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పథకాలు అమలు అయ్యేలా పాత చట్టాన్ని సవరించి కొత్తం చట్టం తీసుకొచ్చిందన్నారు. రైతులు ఆమోదించి సంతకం పెడితేనే కౌలు రైతుకు గుర్తింపు కార్డు వస్తుందని ఈ చట్టంలో తెలిపిందన్నారు. ఈ నిబంధనతో కౌలు రైతులకు కార్డులు రావట్లేదని, మరల చట్ట సవరణ చేసి సాగులో ఉన్న కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు బ్యాంకు రుణాలు, సబ్సిడీ ఎరువులు, ఇతర ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందడం లేదన్నారు. గతం కంటే ఇప్పుడు వ్యవసాయం కష్టంగా మారుతుందని, బ్యాంకు రుణాలు రాక బయట వడ్డీలను తీసుకొచ్చి సాగుచేయాల్సి వస్తోందని తెలిపారు. గతేడాది నుంచి ఇప్పటివరకు ప్రకాశం జిల్లాలోనే 40 మంది రైతులు, కౌలు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు ఇప్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా కౌలు రైతులందరూ ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె మాబు, వి బాలకోటయ్య జిల్లా నాయకులు పూనాటి ఆంజనేయులు, కంకణాల ఆంజనేయులు, టి శ్రీకాంత్, పి ఆంజనేయులు, కె ఆంజనేయులు పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు వీలుగా ఈ నెల 10న విజయవాడలోని ఆటోనగర్‌లోని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ ప్రధాన కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనరు అరుణ్‌కుమార్ తెలిపారు. ఫిర్యాదులు చేయాలనుకునే వినియోగదారులు ఇంటిగ్రేటెడ్ కాల్‌సెంటర్ నెంబరు 1967 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆహార , పౌరసరఫరాల శాఖకు సంబంధించిన ప్రజాపంపిణీ వ్యవస్థ, ధాన్యం సేకరణ, గ్యాస్ సిలిండర్, పెట్రోల్ బంకులు, తూనికలు, కొలతలు, బియ్యం కార్డు సేవలకు సంబంధించి ఫిర్యాదులు చేసేందుకు వీలుగా ఈ చేయవచ్చన్నారు. ఫిర్యాదులను రిజిస్టర్ చేయడంతో పాటు ఫిర్యాదు నమోదు సంఖ్యను తెలియజేస్తామని పేర్కొన్నారు. అంతే కాకుండా ఫిర్యాదు ఏదశలో ఉన్నది? ఎవరి వద్ద పెండింగ్‌లో ఉంది?అనే విషయాన్ని కూడా తమకు ఇచ్చిన రిజిస్ట్రేషన్ నెంబరు ద్వారా ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చని కమిషనరు తెలిపారు. 1800 425 0082/1967 (పౌరసరఫరాలశాఖ), 1800 425 3157/ 14445(ఒకే దేశం ఒకే రేషన్ కార్డు), 1800 425 2388/ 155235(రాష్ట్ర ఆహార కమిషన్), 1800 425 4202)తూనికలు , కొలతలశాఖ)కు ఫోన్లు చేయవచ్చన్నారు. ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు అందుబాటులో ఉంటుందని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ కమిషనరు అరుణ్‌కుమార్ పేర్కొన్నారు.

పెరిగిన 'కాఫీ' కొనుగోలు

- అంతర్జాతీయ ధర కంటే ఎక్కువ చెల్లిస్తోన్న జిసిసి
- ఆ సంస్థకే పంట విక్రయానికి గిరిజన రైతుల మొగ్గు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ప్రస్తుత అంతర్జాతీయ మార్కెట్ ధర కంటే కాఫీ రైతులకు గిరిజన సహకార సంస్థ (జిసిసి) ఎక్కువ ధర చెల్లిస్తోంది. దీంతో, ఆ సంస్థ ద్వారా కాఫీ కొనుగోలు పెరుగుతోంది. కాఫీ సీజన్ ఏటా డిసెంబర్ నుంచి మార్చి వరకు ఉంటుంది. గత సీజన్లో 150 టన్నుల కాఫీని కూడా కొనుగోలు చేయలేని జిసిసి ప్రస్తుత సీజన్లో ఒక్క డిసెంబర్ నెలలోనే అంతకంటే ఎక్కువగా కొనుగోలు చేసింది. సీజన్ ముగిసేందుకు మరో మూడు నెలల వరకూ సమయం ఉండడంతో కొనుగోళ్లు భారీగా పెరిగే అవకాశం ఉందని జిసిసి వర్గాలు చెప్తున్నాయి. ఇతర వ్యాపారులు, ఐటిడిఎ కంటే ఎక్కువ ధర ఇస్తోంది. రైతుల ఖాతాకు 24 గంటల్లో సొమ్ము జమచేస్తుండడంతో జిసిసి కొనుగోళ్లలో భారీగా వృద్ధి కన్పిస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏజెన్సీలోని కాఫీ పంట కొనుగోళ్లు, ధర పెంపుపై జిసిసి ఎండి సురేష్‌కుమార్ తీసుకున్న ముందస్తు చర్యలు, ప్రత్యేక శ్రద్ధ ఇందుకు దోహదపడ్డాయి. పాడేరు ఏజెన్సీలోని అనంతగిరి, అరకు, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జికె వీధి, కొయ్యూరు మండలాల్లో 1.80 లక్షల మంది రైతులు దాదాపు రెండు లక్షల ఎకరాల్లో కాఫీ సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వెయ్యి టన్నులకుపైగా కాఫీ కొనుగోలు చేయాలని జిసిసి లక్ష్యంగా పెట్టుకుంది. ఒక్క డిసెంబర్ నెలలోనే 168 టన్నుల కాఫీని గిరిజన రైతుల నుంచి కొనుగోలు చేసింది. అరబిక పార్చ్‌మెంట్ కిలో కాఫీకి అంతర్జాతీయ మార్కెట్లో రూ.255 రేటు పలుకుతుండగా జిసిసి రూ.270 చెల్లిస్తోంది. వ్యాపారుల బారినపడి మోసపోకుండా గిరిజన కాఫీ రైతులను ఆదుకోవడానికి జిసిసి ఎండి చేసిన కృషి ఫలితాలనిస్తోంది. ఈ ఏడాది పార్చ్‌మెంట్ కాఫీ కిలోకు రూ.270, చెర్రీ రూ.135, రొబస్టాకు రూ.60 ధర నిర్ణయించి జిసిసి చెల్లిస్తోంది. ఈ ధరలు ఆకర్షణీయంగా ఉండడంతో జిసిసికి కాఫీ విక్రయించడానికి గిరిజన రైతులు మొగ్గుచూపుతున్నారు. గత నెలాఖరు నాటికి పార్చ్‌మెంట్ కాఫీ 149 టన్నులు, చెర్రీ రకపు కాఫీ 19 టన్నులు కొనుగోలు చేసింది. వీటి విలువ రూ.4.28 కోట్లు ఉంది. అంతర్జాతీయంగా వియత్నాం, బ్రెజిల్ తదితర దేశాల్లో కాఫీ దిగుబడులు తగ్గడం, అంతర్జాతీయ గుర్తింపు కలిగిన పాడేరు ఏజెన్సీలోని కాఫీ పంటకు మంచి గిరాకీ ఉండడంతో జిసిసి కొనుగోళ్లు ప్రయివేటు వ్యాపారుల కంటే ఎక్కువ ధర చెల్లించి కొనుగోలు చేస్తోంది. జిసిసి నిర్ణయించిన ధరకు మించి ప్రయివేటు వ్యాపారులు కొనుగోలు చేయడానికి ముందుకు రాకపోవడంతో రైతులు జిసిసి కొనుగోలు కేంద్రాలకు తెచ్చి కాఫీని విక్రయిస్తున్నారు.



కాఫీ రైతులతో మాట్లాడుతున్న జిసిసి ఎండి సురేష్ కుమార్ (ఫైల్ ఫొటో)

సొసైటీల వారీగా జిసిసి కొన్న కాఫీ వివరాలు

సొసైటి	కాఫీ కొనుగోలు (టన్నుల్లో)
అరకు	41.11
కాఫీపట్నం	2.62
పాడేరు	67.75
పెదబయలు	11.09
ముంచంగిపుట్	10.75
జి.మాడుగుల	13.02
జికెవీధి	14.78
చింతపల్లి	6.31



విద్యుత్ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ(ఎపిఎస్ఇబి) అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్(ఎఇఇ) అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను ట్రాన్స్‌కో జెఎండి ఐ పృథ్వీతేజ్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పృథ్వీతేజ్ మాట్లాడుతూ విద్యుత్ రంగంలో ఎఇఇలు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ఈ రంగంలో వస్తున్న ఆధునీక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు పట్టుదలతో పనిచేయాలని కోరారు. విద్యుత్ రంగం ఆర్థిక స్థితిగతులను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ఎఇఇ అసోసియేషన్ అధ్యక్షులు బి సునీల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెన్‌కో థర్మల్ డైరెక్టర్ జి చంద్రశేఖర్, ట్రాన్స్ ఫైనాన్స్ డైరెక్టర్ టి వీరభద్రారెడ్డి, ఎపిఎస్ఇబి ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిబి శ్రీనివాస్, పి ప్రతాప్ రెడ్డి, ఎఇఇ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్ ప్రతాప్, సహాధ్యక్షులు జి మల్లిఖార్జునరావు, సహాయ కార్యదర్శి ఎ మురళి తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌వైజర్ నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలి

- ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఒంగోలు రీజియన్ పరిధిలోని 137 గ్రేడ్ 2 సూపర్‌వైజర్ పోస్టుల నియామకానికి రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండు చేసింది. ఈ మేరకు స్త్రీ శిశుసంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరెక్టర్‌కు నాయకులు కె.సుబ్బరావమ్మ, జి.బేబిరాణి లేఖ రాశారు. లేఖను మీడియాకు విడుదల చేశారు.

ఒంగోలు రీజియన్ పరిధిలో ప్రకటించిన మెరిట్ లిస్టులో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించడంలో అనేక లోపాలు జరిగాయని తెలిపారు. వివిధ కేటగిరీలకు ఉన్న అర్హతలను బట్టి లిస్టులు తయారు కాలేదని పేర్కొన్నారు. భారత ప్రభుత్వ గైడ్‌లైన్స్‌ను బట్టి ఒంగోలు రీజియన్‌లో మరలా కొత్త లిస్టు ప్రకటించాలని కోరారు. గతంలో గ్రేడ్ 2 సూపర్ వైజర్ పోస్టులు ప్రకటించిన రీజియన్ లిస్టులో ఉన్న వారి వివరాలన్నీ ప్రకటించారనీ, ఒంగోలు రీజియన్లో సూపర్ వైజర్ పోస్టులకు ఎంపికైన వారి వివరాలు మాత్రమే ప్రకటించారని పేర్కొన్నారు. ఇది అనుమానాలకు తావిస్తోందని, అక్కడ కూడా అందరిమార్కులు అందరూ చూసుకునే విధంగా వివరాలు ప్రకటించాలని కోరారు.

ఆర్‌టిసిలో ముఖగుర్తింపు హాజరును రద్దుచేయాలి

- ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసి డిపోలలో ముఖగుర్తింపు ఆధారంతో తీసుకునే హాజరు విధానాన్ని రద్దు చేయాలని ఏపిపిటిడి(ఆర్‌టిసి) స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు సిహెచ్ సుందరయ్య, ఎం అయ్యపరెడ్డి, గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలానిభాషలు శుక్రవారం ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావును విజయవాడలోని ఆర్‌టిసి హెడ్‌క్వార్టర్స్‌లో కలసి వినతి పత్రం అందజేశారు. ఆర్‌టిసి ఉద్యోగులు ఎక్కువగా క్షేత్రస్థాయిలో వుండటంవల్ల ట్రాఫిక్‌జామ్‌లాంటి సమస్యలతో సకాలంలో కార్యాలయంకు రాలేరని వివరించారు. ముఖగుర్తింపుతో 10నిమిషాలు ఆలస్యం అయినా ఉద్యోగులకు హాజరులో సమస్య అవుతుందని తెలిపారు. ఈ ప్రక్రియతో సత్ఫలితాలు కూడా వచ్చే అవకాశం లేదని వివరించారు. భౌతికపరిస్థితులను పరి గణలోకి తీసుకొని ముఖగుర్తింపు చర్యలను ఉపసంహరించుకోవాలని కోరారు.

ఎస్‌పిడిసిఎల్ ఎమ్‌డిపై కోర్టు ధిక్కార కేసు

- హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

ఒక కేసు విచారణకు వ్యక్తిగతంగా హాజరయ్యేందుకు తనకు ఆరోగ్యం సహకరించడం లేదని ఒక అధికారి తప్పుడు సమాచారం ఇచ్చారని మరో అధికారి ద్వారా హైకోర్టుకు తెలిసింది. దీంతో ఆ అధికారిపై కోర్టు ధిక్కార కేసు నమోదుకు జస్టిస్ బి.దేవానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంచం దిగలేనంతగా ఆరోగ్యం క్షీణించిందంటూ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్‌పిడిసిఎల్) ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు హైకోర్టుకు న్యాయవాది ద్వారా తెలియజేశారు. మరో కేసులో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం హైకోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంతోష్‌రావు గురించి జడ్జి ఆరా తీశారు. గురువారం ఏలూరులో జరిగిన మీటింగ్‌లో ఇద్దరం పాల్గొన్నామని విజయానంద్ చెప్పడంతో విషయం వెలుగులోకి వచ్చింది. గురువారమే లాయర్ ద్వారా మంచం కూడా దిగలేనంతగా అనారోగ్యంతో ఉన్నట్లుగా చెప్పారని జడ్జి తెలిపారు. సంతోషరావు వైఖరి కోర్టు ధిక్కారమేనని పేర్కొన్నారు. విచారణ ఈ నెల 20కి వాయిదా వేశారు. మరో కోర్టు ధిక్కార కేసులో సిపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఇఇ) సయ్యద్ అబ్దుల్ కరీంపై కూడా జడ్జి కోర్టు ధిక్కార చర్యలకు ఆదేశాలు ఇచ్చారు. కౌంటర్ వేయాలని ఆదేశించి విచారణను ఫిబ్రవరి 1కి వాయిదా వేశారు. సయ్యద్ అబ్దుల్ కరీంపై శాఖాపర చర్యలు తీసుకుంటామని విజయానంద్ హామీ ఇచ్చారు. కోర్టు ఆదేశాల్ని విధిగా అమలు చేయాలని ఉత్తర్వులు ఇస్తామని సిపిడిసిఎల్ ఛైర్మన్ పద్మా జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ ముగ్గురితోపాటు మరో ఇద్దరు అధికారులు స్వయంగా హాజరు కానక్కర్లేదని జడ్జి ఆదేశించారు. అబ్దుల్ కరీంకు మినహాయింపు ఇవ్వడానికి నిరాకరించారు.

ప్రకాశం జిల్లా, చీమకుర్తికి చెందిన వీఎల్ గణపతి గ్రానైట్స్‌కు సీపీడీసీఎల్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేత చర్యను గతంలో జడ్జి నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. ఆ ఉత్తర్వులను అధికారులు అమలు చేయకపోగా కోర్టు ఉత్తర్వులపై ఫోన్‌లో సీపీడీసీఎల్ ఈఈ అనుచితంగా మాట్లాడారని గ్రానైట్ సంస్థ లాయర్ హైకోర్టుకు వివరించారు. ఫోన్ రికార్డింగ్ వివరాలను విన్న జడ్జి వ్యక్తిగత హాజరుకు ఆదేశాలు ఇచ్చారు. దీనిపై అధికారులు అప్పీళ్లను డివిజన్ బెంచ్ కొట్టేసింది. దీంతో శుక్రవారం జస్టిస్ దేవానంద్ విచారణలో ఒక అధికారి తప్పుడు సమాచారం బట్టబయలు అయ్యింది.

కేసుల వివరాలు ఇవ్వండి..

రాష్ట్రంలో వేర్వేరు పోలీస్ స్టేషన్‌ల్లో ఎంపీ రఘురామకృష్ణంరాజుపై నమోదైన కేసుల వివరాలు ఆయనకు అందజేయాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డిజిపిలను హైకోర్టు ఆదేశించింది.

ఎఫ్ఐఆర్ కాపీలతో పాటు కేసులు నమోదు ఫిర్యాదు ప్రతులను కూడా అందజేయాలని తెలిపింది. ఈ మేరకు శుక్రవారం జస్టిస్ జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమోదు చేసిన వివరాలు ఇవ్వాలంటూ రాజు వేసిన రిట్‌పై విచారణ 19కి వాయిదా వేశారు.

కిడ్నీ వ్యాధికి శాశ్వత పరిష్కారం చూపండి

- కేంద్ర మంత్రి షెకావత్‌కు ఎంపి కేశినేని లేఖ

ప్రజాశక్తి - విజయవాడ

ఎన్‌టిఆర్ జిల్లా ఎ.కొండూరు మండలంలో ప్రబలుతున్న కిడ్నీ వ్యాధికి శాశ్వత పరిష్కారం చూపాలని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని నాని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర షెకావత్‌కు శుక్రవారం లేఖ రాశారు. ఎ.కొండూరు మండలం నోటిఫైడ్ గిరిజన ప్రాంతమని తెలిపారు. ఈ ప్రాంతంలో కిడ్నీ కేసులు బాగా పెరిగాయని, కిడ్నీ వ్యాధితో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని లేఖలో పేర్కొన్నారు. కలుషితమైన భూగర్భ జలాల వినియోగమే వ్యాధి ప్రబలడానికి కారణమని పలు అధ్యయనాల్లో తర్వాత తేలిందన్నారు. 55 శాతం గ్రామాల్లోని నీటి నమూనాలలో సిలికా, సీసం ఎక్కువగా ఉన్నట్లు తేలిందని పేర్కొన్నారు. దాదాపు ప్రతి ఇంట్లో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న రోగులు ఉన్నారని, ప్రస్తుతం 720 మంది ఆ వ్యాధి బాధితులు ఉన్నారని తెలిపారు. వ్యాధికి చికిత్స చేయించుకునేందుకు అనేక కుటుంబాలు సర్వస్వం కోల్పోయాయని వివరించారు. ఈ నేపథ్యంలో జల్ జీవన్ మిషన్ పథకం కింద ఎ.కొండూరు ప్రాంతంలోని నివాస ప్రాంతాలకు రూ.38 కోట్లు కేటాయించాలని, రూ.27 కోట్ల అంచనా వ్యయంతో నీటి పైప్‌లైన్ పొడిగింపు పనులు కూడా చేపట్టారని ఈ లేఖలో కోరారు.

సంపాదకీయం

విదేశీ గుప్పెట్లో ఉన్నత విద్య

నూతన విద్యా విధానం ఎంతటి ప్రమాదకరమైనదో విదేశీ విశ్వవిద్యాలయాలను భారత్‌లోకి ఆహ్వానిస్తూ మోడీ సర్కార్ ఇటీవల విడుదల చేసిన ముసాయిదా పత్రం మరోసారి తేటతెల్లం చేసింది. అంతర్జాతీయంగా ప్రఖ్యాతిగాంచిన విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ విద్యా సంస్థలను ఏర్పాటు చేసుకునేందుకు ఫీజులు, అడ్మిషన్లపై నియంత్రణ ఎత్తివేస్తున్నాం రండహో అంటూ విశ్వవిద్యాలయ గ్రాంట్ల సంఘం (యుజిసి) ముసాయిదా మార్గదర్శకాలను విడుదల చేసింది. ఉన్నత విద్యను విదేశీ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలు వాస్తవానికి 1990ల నుంచే మొదలయ్యాయి. విదేశీ విశ్వవిద్యాలయాలను భారత్‌లోకి ఆహ్వానించేందుకు సంబంధించిన బిల్లు 1995లో పార్లమెంటులో ప్రవేశపెట్టిన తొలిసారే విమర్శలు వెల్లువెత్తడంతో వెనక్కిపోయింది. 2005-06లోనూ ప్రయత్నాలు జరగ్గా కేబినెట్ దశలోనే ఉపసంహరించుకోవాల్సివచ్చింది. ఆ తర్వాత యుపిఎ 2 అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి ప్రయత్నమే జరిగితే వామపక్షాలు తిప్పికొట్టాయి. విదేశీ విశ్వవిద్యాలయాల ప్రవేశాన్ని అప్పట్లో బిజెపికి కూడా వ్యతిరేకించింది. ఇప్పుడు అదే బిజెపి విదేశీ విశ్వవిద్యాలయాలకు ఎర్ర తివాచి పరిచి స్వాగతిస్తుండటం దాని ద్వంద్వప్రమాణాలకు నిదర్శనం. విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియ మొదలుకొని ఫీజులు ప్రతిదీ మీ ఇష్టం మీరు ఎలా చెబితే అలా..అంటూ అపరిమిత స్వేచ్ఛ కల్పిస్తామంటోంది. అంతేకాదు ఇక్కడ ఆర్జించిన మొత్తాన్ని మొత్తం మీరు తీసుకెళ్లిపోవచ్చు అంటూ మోడీ సర్కార్ బంపర్ బోనాంజా ఆఫర్ ప్రకటించింది. ఇది దేశంలోని ఉన్నత విద్యను మొత్తం విదేశీ కార్పొరేట్ శక్తుల గుప్పెట్లో పెట్టడం తప్ప మరొకటి కాదు. అంతర్జాతీయంగా ప్రతిష్టాత్మక సంస్థలనే ఆహ్వానిస్తున్నామని ఇప్పుడు చెబుతున్నా..వాస్తవంలో ఇక్కడి విద్యారంగాన్ని దండుకునేందుకు విదేశీ విద్యా సంస్థలు గద్దల్లా వాలిపోవడం ఖాయం.

శస్త్ర చికిత్సలకు, టెస్ట్‌ట్యూబ్ బేబీలకు, క్లోనింగ్ ఇలా ప్రతిదానికీ మనమే ఆద్యులమని, భారత్ విశ్వగురు అని ఇతిహాసాలను శాస్త్రీయ పరిణామాలుగా పేర్కొంటూ మూఢత్వాన్ని ప్రజల్లోకి చొప్పించే మోడీ సర్కార్..ఇప్పుడు అదే 'విశ్వగురు'కు విదేశీ విశ్వవిద్యాలయాల అవసరమేమొచ్చిందో చెప్పాలి. ఒకే దేశం..ఒకే కార్డు, ఒకే దేశం ఒకే భాష, ఒకే దేశం ఒకే ఎన్నిక అంటూ ఒకవైపు ప్రజాస్వామ్య వ్యవస్థను ఏకీకృత నియంత్రత్వంపై లాక్కెళ్తున్న మోడీ సర్కార్‌కు మరో వైపు లార్డ్ మెకాలే తరహాలో విదేశీ విద్యపై మమకారం పుట్టుకురావడంలో ఆంతర్యమేమిటో!

దేశ నిర్మాణంలో విద్య ఎంతో కీలక పాత్ర వహిస్తుంది. ప్రాథమిక విద్య మొదలుకొని విశ్వవిద్యాలయ చదువు వరకూ మనదేశంలో పరిస్థితులకు అనుగుణంగా సాగాల్సిందే. భారత్ లాంటి దేశాల్లో సాంఘిక శాస్త్రాలే కాకుండా జీవశాస్త్రం, ఇంజనీరింగ్ వంటి సైన్స్ చదువులు సైతం స్థానిక జీవన పరిస్థితులకు అనుగుణంగా ఉండాలని, అప్పుడే ఫలితాలు దక్కుతాయని ప్రఖ్యాత శాస్త్రవేత్త జెడి బెర్నాల్డ్ విద్యా ప్రపంచీకరణ తొలినాళ్లలోనే సెలవిచ్చారు. విదేశీ విశ్వవిద్యాలయాలు భారత పరిస్థితులకు పొసగవని విద్యారంగ నిపుణులు తేల్చిచెబుతున్నారు.

అటువంటి వైవిధ్యమైన పరిస్థితులున్న భారతావనిలో విదేశీ విద్యాసంస్థలకు ఎర్ర తివాచి పరిచి ఎటువంటి నియంత్రణలు లేకుండా ప్రవేశాల ప్రక్రియ, ఫీజులు వాటి ఇష్టానికి వదిలేస్తే దేశంలో ఉన్నత విద్యారంగం విదేశీ శక్తుల పరం చేయడమే అవుతుంది. విద్యా కాషాయీకరణ, కార్పొరేటీకరణ, కేంద్రీకరణ మూడు లక్ష్యాలతో నూతన విద్యా విధానాన్ని మోడీ సర్కార్ బలవంతంగా రుద్దుతోంది. అందులో భాగంగానే ఇప్పుడు తెరపైకి విదేశీ విశ్వవిద్యాలయాలను తీసుకొస్తోంది. ప్రభుత్వ రంగంలోని విశ్వవిద్యాలయాలను బలోపేతం చేసి పరిశోధనలకు, అధ్యయనాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం పూర్తిగా చేతులు దులిపేసుకునేందుకే ఈ 'విదేశీ విశ్వవిద్యాలయాలు' పేరుతో పన్నాగానికి పాల్పడుతోంది. దేశంలోని చాలా సామాజిక తరగతులకు ఉన్నత విద్య ఇప్పటికీ ఎండమావిగానే ఉంటోంది. అణగారిన, ఆదివాసీ తరగతుల్లో ఇప్పుడిప్పుడే తొలి తరం విశ్వవిద్యాలయాల మెట్లు ఎక్కుతోంది. ఈ దశలో విద్యా కార్పొరేటీకరణతో విదేశీ శక్తుల గుప్పిట్లోకి విద్యా వ్యవస్థ వెళ్లిపోతే సామాన్యులకు ఉన్నత విద్య పగటికలగా మిగిలిపోతోంది. ఇప్పటికే విద్యారంగంలో వున్న అసమానతలను మరింత పెంచే ఈ విధానాన్ని, దీనికి మూలమైన నూతన విద్యా విధానాన్ని ప్రజలంతా ఐక్యంగా తిప్పికొట్టాలి.

మహనీయుల మాట



మనం అతిగా ఆలోచిస్తాము.
చాలా తక్కువగా గ్రహిస్తాము.
- చార్లీ చాప్లిన్



పాలస్తీనా ప్రయోజనాలకు భారత్ చెల్లు చీటీ

కామెంట్

పాలస్తీనా భూభాగాలను ఇజ్రాయిల్ చాలా కాలంగా ఆక్రమించుకుంటూ పోతుండడం వల్ల తలెత్తే చట్టపరమైన పర్యవసానాలపై అభిప్రాయాన్ని తెలియచేయాల్సిందిగా అంతర్జాతీయ న్యాయస్థానాన్ని (ఐసిజె) కోరుతూ డిసెంబరు 31, 2022న ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ చేపట్టిన తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ గైర్హాజరైంది. తీర్మానానికి 87 దేశాలు మద్దతు ఇవ్వగా, 26 దేశాలు వ్యతిరేకించాయి. భారత్ సహా 52 దేశాలు గైర్హాజరయ్యాయి.

పవిత్ర నగరమైన జెరూసలేం ప్రతిపత్తిని, స్వభావాన్ని జనాభా కూర్పును మార్చడానికి ఉద్దేశించిన చర్యలతో సహా ఇజ్రాయిల్ ఆక్రమణ, సెటిల్‌మెంట్, కలుపుకోవడం వంటి చర్యల చట్టపరమైన పర్యవసానాల గురించి...అలాగే యూదు దురహంకార ఇజ్రాయిల్ చేపడుతున్న వివక్షాపూరిత చట్టాలు, చర్యల గురించి ఈ తీర్మానం పేర్కొంది.

ఈ తీర్మానానికి ఓటు వేయకుండా వుండడం ద్వారా...పాలస్తీనా ప్రయోజనాలకు, రెండు దేశాల ఏర్పాటు పరిష్కారానికి గట్టిగా మద్దతిస్తూ చిరకాలంగా అనుసరిస్తూ వచ్చిన వైఖరిని నుంచి పక్కకు వైదొలగుతున్నట్టు భారత్ సంకేతాలు ఇచ్చింది. 1967లో యుద్ధం జరిగినప్పటి నుండి వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలేం, గాజా ప్రాంతాల్లో ఇజ్రాయిల్ ఆక్రమణ కొనసాగుతూ వస్తోంది. అప్పటి నుండి, ఈ ఆక్రమణ చర్యలకు అంతం పలకాలని కోరుతూ ఐక్యరాజ్య సమితి పలుసార్లు తీర్మానాలు చేసినప్పటికీ, వెస్ట్ బ్యాంక్‌లో యూదు ఆవాసాల ఏర్పాటును ఇజ్రాయిల్ అదేపనిగా అనుమతిస్తూ వస్తోంది. తూర్పు జెరూసలేంలో పాలస్తీనా ఆవాస ప్రాంతాలను ధ్వంసం చేస్తూ, పూర్తిగా అక్కడ జనాభా పొందికను మార్చాలని చూస్తోంది.

మొత్తంగా జెరూసలేం, వెస్ట్ బ్యాంక్ ప్రాంతాల్లో నివసిస్తున్న పాలస్తీనియన్లను తరిమేయడమో లేదా ఇజ్రాయిలీ యేతర పౌరులుగా వర్ణ వివక్షకు గురి కావాల్సిందేనని ఒత్తిడి తీసుకురావడం ద్వారా ఆ ప్రాంతాలను కూడా తమలో కలిపేసుకోవాలన్నది ఇజ్రాయిల్ పన్నాగంగా ఉన్నది. భూ ఆక్రమణల ద్వారా తూర్పు జెరూసలేంను బహిరంగంగానే కలిపేసుకోవడంతో ఆ నగర యథాతథ పరిస్థితి మారింది. ఇజ్రాయిల్ 'శాశ్వత రాజధాని'గా జెరూసలేం వుంటుందని ప్రకటించింది. వెస్ట్ బ్యాంక్ లోని పాలస్తీనా భూభాగాల్లో 5 లక్షల మంది యూదులు నివాసం ఏర్పరచుకోవడానికి ఇజ్రాయిల్‌లో వరుసగా వచ్చిన ప్రభుత్వాలు అవకాశం కల్పిస్తూ వచ్చాయి.

గాజా స్ట్రిప్‌లో నివసిస్తున్న దాదాపు 20 లక్షల మంది పాలస్తీనియన్లు జైళ్లలో మాదిరి దుర్భర పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారు. వారు తరచుగా వైమానిక బాంబు దాడులకు, దిగ్బంధనాలకు గురవుతూనే వున్నారు. పాలస్తీనా ఎన్‌క్లేవ్‌లతో వెస్ట్ బ్యాంక్‌ను వేరు చేస్తూ నిర్మించిన గోడ వర్ణ వివక్ష వ్యవస్థను స్థాపించింది. గత రెండేళ్లలో, వెస్ట్ బ్యాంక్‌ను కలుపుకునే దిశగా ఇజ్రాయిల్ దేశం సాగుతోంది.



బెంజమిన్ నెతన్యాహు నరేంద్ర మోడీ మహ్మద్ అబ్బాస్

ఈ అంశంపై భారత్ వెనుకడుగు వేయడానికి కారణం ఇజ్రాయిల్‌తో వ్యూహాత్మక సంబంధాలకు ప్రాధాన్యత ఇస్తుండడమే. అందువల్లే పాలస్తీనా ప్రయోజనాల విషయంలో మెతక వైఖరి అనుసరిస్తోంది. ఇజ్రాయిల్‌తో మోడీ ప్రభుత్వానికి పెరుగుతున్న సన్నిహిత సంబంధాలు అందరికీ తెలిసిన విషయమే. గతంలో ప్రధానిగా వున్నపుడు నెతన్యాహు, మోడీకి చాలా సన్నిహితుడు. సైద్ధాంతికంగా వారిద్దరూ సహచరులే. పాలస్తీనియన్లు, అరబ్బుల పట్ల యూదు శతృత్వానికి ఆర్‌ఎస్‌ఎస్-బిజెపిలు అభిమానులు. అమెరికా ప్రణాళిక ప్రకారమే, పశ్చిమాసియా లోని ఐ2యు2 (భారత్, ఇజ్రాయిల్, యుఎఇ, అమెరికా) ఫోరంలో భారత్ చేరింది. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించడానికి ఒక రోజు ముందే నెతన్యాహు ప్రభుత్వం అధికార బాధ్యతలను చేపట్టింది. ఇక్కడ తీర్మానంపై ఓటింగ్‌లో భారత్ గైర్హాజరవడం అంటే నెతన్యాహు ప్రభుత్వం పట్ల సుహృద్భావాన్ని ప్రదర్శించడంగా చూడవచ్చు.

బెంజమిన్ నెతన్యాహు ప్రధానిగా ఇజ్రాయిల్‌లో ఏర్పడిన కొత్త ప్రభుత్వం- వర్ణవివక్షతతో కూడిన యూదు జాతీయ పార్టీలతో, అతి సాంప్రదాయవాద మత గ్రూపులతో ఏర్పడిన పచ్చి మితవాద సంకీర్ణ ప్రభుత్వ వ్యవస్థగా వుంది. "జుడియా, సమారియా (వెస్ట్ బ్యాంక్‌కు బైబిల్ పేర్లు)తో సహా ఇజ్రాయిల్‌లో అన్ని ప్రాంతాల్లో యూదు ఆవాసాలను ఏర్పాటు చేసుకుంటూ పోవాలని" సంకీర్ణ పార్టీల ఒప్పందం పేర్కొంది. "సమయం చూసుకుని, ఇజ్రాయిల్ జాతీయ, అంతర్జాతీయ ప్రయోజనాలను పరిగణన లోకి తీసుకుని" వెస్ట్ బ్యాంక్‌ను కలుపుకునేందుకు కూడా ఈ ఒప్పందం హామీ ఇచ్చింది.

యూదు ఆవాసాలను ఏర్పాటు చేసేందుకు పాలస్తీనా భూభాగాలను, ఆలివ్ తోటలను ఆక్రమించుకోవడంలో, బుల్డోజర్లతో పాలస్తీనియన్ల గృహాలను ధ్వంసం చేయడం వంటి దుర్మార్గమైన చర్యలకు ఈ కిరాతక వలసవాద ప్రభుత్వం పాల్పడుతోంది. ఈ అణచివేత చర్యలను ప్రతిఘటించినా, లేదా నిరసన తెలిపినా ఇజ్రాయిల్ సాయుధ బలగాలు కాల్పులతో అణచివేస్తాయి.. 2022 సంవత్సరంలో వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలేం ప్రాంతాల్లో 171 మంది పాలస్తీనియన్లను ఇజ్రాయిల్ బలగాలు హతమార్చాయని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. వీరిలో 30 మందికి పైగా పిల్లలు వున్నారు. ఇటువంటి హింసకు సంబంధించి అత్యంత అధ్వాన్నమైన సంవత్సరాల్లో 2022 ఒకటిగా వుంది.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

మొత్తంగా 9 వేల మంది గాయపడ్డారు.

కొత్త మితవాద ప్రభుత్వంలో భాగస్వామిగా వున్న సంకీర్ణ పార్టీల్లో ఒకటైన రెలిజియస్ జియోనిస్ట్ పార్టీలో ప్రధానంగా వెస్ట్ బ్యాంక్ సెటిలర్లే వున్నందువల్ల వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనియన్లను మొత్తంగా అణచివేయడానికే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. తీవ్రవాద భావజాలం కలిగిన జ్యూయిష్ పవర్ పార్టీకి చెందిన, జాతీయ భద్రతా వ్యవహారాల మంత్రి ఇత్మార్ బెన్ గివిర్ పాలస్తీనియన్లు, అరబ్బులకు వ్యతిరేకంగా విద్వేష ప్రసంగాలకు పేరొందిన వ్యక్తి. వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిల్ సరిహద్దు పోలీసులను అలాగే పాలస్తీనా ఆవాసాలను ఆయన మంత్రిత్వ శాఖ పర్యవేక్షిస్తుంది.

అందువల్ల, ఆక్రమిత ప్రాంతాల్లో ఇజ్రాయిల్ కొత్త తీవ్రవాద ప్రభుత్వం తన దూకుడు చర్యలను మరింత పెంచేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ తీర్మానం సముచితమైన సమయంలో వచ్చింది.

ఏ దేశంలోనైనా అంతర్గత మానవ హక్కుల విషయాలపై బయటి విచారణకు పిలుపిచ్చినా లేదా తాను అంగీకరించని అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుకు సంబంధించిన అంశాలపై ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి, ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ చేసిన తీర్మానాలకు భారత్ గతంలో ఎన్నడూ మద్దతివ్వలేదు. కానీ, ప్రస్తుత తీర్మానంపై భారత్ ఇలా గైర్హాజరవడాన్ని సమర్థించడానికి ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేం. అన్నింటికంటే ముందు, ఒక సార్వభౌమాధికార దేశం అంతర్గత వ్యవహారాలకు సంబంధం లేని విషయాన్ని... ఆక్రమిత భూభాగానికి సంబంధించిన విషయాన్ని పరిశీలించాల్సిందిగా ఐసిజెను కోరారు. వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలేం రెండూ ఆక్రమిత భూభాగాలేనని భారత్ ఇప్పటికీ భావిస్తూ వున్నది. పైగా, ఆక్రమిత పాలస్తీనా భూభాగంలో గోడ నిర్మాణం వల్ల తలెత్తే చట్టపరమైన పర్యవసానాల గురించి 2004లో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ పట్టుబట్టిన మేరకు ఐసిజె తన అభిప్రాయాన్ని వెల్లడించింది.

ఈ అంశంపై భారత్ వెనుకడుగు వేయడానికి కారణం ఇజ్రాయిల్‌తో వ్యూహాత్మక సంబంధాలకు ప్రాధాన్యత ఇస్తుండడమే. అందువల్లే పాలస్తీనా ప్రయోజనాల విషయంలో మెతక వైఖరి అనుసరిస్తోంది. ఇజ్రాయిల్‌తో మోడీ ప్రభుత్వానికి పెరుగుతున్న సన్నిహిత సంబంధాలు అందరికీ తెలిసిన విషయమే. గతంలో ప్రధానిగా వున్నపుడు నెతన్యాహు, మోడీకి చాలా సన్నిహితుడు. సైద్ధాంతికంగా వారిద్దరూ సహచరులే. పాలస్తీనియన్లు, అరబ్బుల పట్ల యూదు శతృత్వానికి ఆర్‌ఎస్‌ఎస్-బిజెపిలు అభిమానులు. అమెరికా ప్రణాళిక ప్రకారమే, పశ్చిమాసియా లోని ఐ2యు2 (భారత్, ఇజ్రాయిల్, యుఎఇ, అమెరికా) ఫోరంలో భారత్ చేరింది.

ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించడానికి ఒక రోజు ముందే నెతన్యాహు ప్రభుత్వం అధికార బాధ్యతలను చేపట్టింది. ఇక్కడ తీర్మానంపై ఓటింగ్‌లో భారత్ గైర్హాజరవడం అంటే నెతన్యాహు ప్రభుత్వం పట్ల సుహృద్భావాన్ని ప్రదర్శించడంగా చూడవచ్చు.

నిర్వాసితులవడం, వలసవాద ఆక్రమణలు వంటి కష్టాలను పాలస్తీనా ప్రజలు ఏడు దశాబ్దాలకు పైగా అనుభవిస్తూనే వున్నారు. 1948లో ఏడు దశాబ్దాలకు పైగా వారిని వారి మాతృభూమి నుండి బహిష్కరించినప్పటి నుండి లక్షలాదిమంది పాలస్తీనా వెలుపల శరణార్థులుగానే జీవించారు. సైనిక ఆక్రమణ కింద వారిని లొంగ తీసుకున్నారు. మన స్వాతంత్ర్యోద్యమ పోరాట కాలం నుండి, పాలస్తీనా ప్రజల పట్ల భారత్ సంపూర్ణ సానుభూతితో, సంఘీభావంతో వ్యవహరిస్తూనే వచ్చింది. కానీ, ఇప్పుడు బిజెపి పాలకుల ఈ హిందుత్వ దృక్పథం ఈ పరాక్రమవంతులను అణచివేసే వారి పక్షాన భారతదేశాన్ని నడిపిస్తోంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

జనవాక్యం

సభ్యసమాజానికే తలవంపులు

ఢిల్లీలో డిసెంబర్ 31 రాత్రి తప్ప తాగిన నలుగురు యువకులు మితిమీరిన వేగంతో కారు నడుపుతూ అదుపు తప్పి...స్కూటీపై వెళుతున్న ఓ అమ్మాయిని గుద్దడమే కాకుండా ఆ అమ్మాయిని 12 కిలోమీటర్ల మేర ఈడ్చుకెళ్లడం అత్యంత దారుణం. ఆమె మరణానికి కారణమైన ఈ దుర్ఘటన మానవత్వం వున్న ప్రతి ఒక్కరిని కలిచివేయక మానదు. డిసెంబర్ 31 నాడు యువత మద్యం సేవించి కొత్త సంవత్సరం సంబరాలు చేసుకోవడం అత్యంత సహజమైన విషయం. అయినప్పటికీ తాగిన మత్తులో ఇలా రోడ్ల మీద షికార్లు చేస్తూ పలు ప్రమాదాలకు కేంద్రబిందువు, కారణభూతం అవుతుండటం క్షమించరాని నేరం. పిల్లలు చేసే ఇలాంటి జులాయి పనులకు, క్షమించరాని నేరాలకు కన్నవారు కూడా పరోక్షంగా బాధ్యత వహించాలి. ఏదేమైనా ఇలాంటి గుండెల్ని పిండి చేసే ప్రమాదాలు మరోసారి జరుగకుండా ఉండాలంటే కళ్ళు మూసుకుపోయి ఇలా తప్ప తాగి విచక్షణారహితంగా వ్యవహరించిన ఈ యువకులు ఎంతటి వారైనా వారిపై పోలీసులు కేసులు నమోదు చేసి అత్యంత కఠినంగా శిక్షించాలి. అంతేగాకుండా న్యాయస్థానం వారు కూడా ఇలాంటి బాధ్యత లేని యువకులపై కొరడా ఝుళిపించి తీరాలి. నగరాలలో ప్రతి ఏడాది డిసెంబర్ 31 నాడు ఏదైనా సందడి చేసుకోవాలంటే ఇంటిలోనే చేసుకోవడం సర్వదా శ్రేయస్కరం. యువకులు తప్ప తాగి వారి తల్లిదండ్రుల పర్యవేక్షణ కొరవడి క్షణికావేశంతో చేసే ఇలాంటి దుశ్చర్యలు, నేరాలు వారి ఉజ్వల భవిష్యత్తుకు గొడ్డలిపెట్టు వంటివని ఎంత త్వరగా గ్రహిస్తే అంతా మంచిది. లేకపోతే వారి బంగారు భవిష్యత్ అంధకార బంధురం అవ్వడం, జైలు ఊచలు లెక్కబెట్టాల్సి రావడం తథ్యం.

- బుగ్గన మధుసూదనరెడ్డి,
బేతంచెర్ల, కర్నూలు జిల్లా.

వరి రైతుకు ఉరి

భారత దేశంలో 70 శాతం మందికి పైగా రైతులు చిన్న సన్నకారు రైతులే. ఇందులో 80 శాతం మంది రైతులు వరి పంటనే పండిస్తున్నారు. మన దేశంలో తయారైన వరి బియ్యం 60 దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఏడాదికి 2 లక్షల 38 వేల కోట్ల రూపాయల విలువైన వరి బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్నామంటే మన దేశ ఆర్థిక వ్యవస్థకు వరి పంట ఎంత కీలకమైనదో అర్థమవుతున్నది. ఇప్పటికే వాణిజ్య పంటలపై ఆధిపత్యం సాధించిన కార్పొరేట్ శక్తులు దేశంలో ప్రధానమైన ఆహార పంట అయిన "వరి"పై తమ అధిపత్యం సాధించే క్రమంలో వరి పంటపై దుష్ప్రచారానికి పూనుకుంటున్నారు. వరి పండిస్తే నష్టాలు వస్తాయన్న పేరుతో చిన్న సన్నకారు రైతులు తమ పొలాలను వదిలేసి వ్యవసాయం నుండి తరలిపోయేలా చేసి...ఇజ్రాయిల్ తరహా కార్పొరేట్ వ్యవసాయానికి మరలించే కుట్ర ఇందులో దాగి ఉన్నది. దేశంలో వరి పండించే రైతులకు నష్టాలు వచ్చే విధంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులపై ఉన్న తమ ఆధిపత్యాన్ని ఉపయోగించి వాటి ధరలను విపరీతంగా పెంచటం, రైతుల పెట్టుబడుల భారాలను అధికం చేయడం, రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర లేకుండా చేయడం, రైతులు తాము పండించే పంటను అమ్ముకునే మార్కెట్ సౌకర్యం లేకుండా చేయడం ద్వారా రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారు. కార్పొరేట్ల సేవలో పడిన పాలక వర్గాలు వరి పండించే రైతులకు నష్టం చేసేందుకే సిద్ధపడటం దేశానికే సిగ్గుచేటు. ఇదే తరహా విధానాలు కొనసాగితే దేశంలో 70వ దశకం తరహా ఆహార సంక్షోభం ప్రబలి ... కోట్లాది మంది ప్రజల ఆహార భద్రతకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నది.

- బి.వి.రమణ,
పార్వతీపురం.

కవిత్వం

పొలి కేక

సమ సమాజం కోసం
సమాజ సందేశం కోసం
జాగృతి కోసం
మా పోరాటం
మారని మనుషుల్లో
జన చైతన్యం కోసం
మార్పు లేని బ్రతుకుల్లో
నవ వికాసం కోసం
నేటి యువతలో
సామాజిక స్పృహ కోసం
ఈ ఆరాటం మా పోరాటం
పేదోడి గుండె చప్పుడు
ఈ పొలి కేక.

- ఎల్. ప్రఫుల్ల చంద్ర,
సెల్: 6300546700

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

జనాభా నియంత్రణ వివాదం - బిజెపి రాజకీయం

విశ్లేషణ

ఎమ్వీయస్

గత డిసెంబరు పార్లమెంటు సమావేశాల్లో ఇద్దరు బిజెపి ఎం.పి.లు - రవి కిషన్, నిశికాంత్ దూబే - లోక్‌సభలో జనాభా నియంత్రణపై ప్రైవేట్ మెంబర్ బిల్లు ను ప్రవేశపెట్టారు. అధికార పార్టీకి చెందిన ఎంపీలు అయివుండి ప్రైవేటు మెంబర్ బిల్లు ప్రవేశపెట్టడం, అందునా, అదేదో ఒక ప్రత్యేక ప్రాంతానికో, ప్రత్యేక పరిమిత తరగతికో చెందిన అంశం మీద కాకుండా యావత్ దేశానికీ సంబంధించిన విషయం మీద ప్రైవేటు మెంబర్ బిల్లు పెట్టడం అంటే దాని వెనుక దాగి వున్న బిజెపి ఎజెండా ఏమిటో ఊహించుకోవచ్చు. వివాదాస్పద అంశం మీద ముందు వ్యక్తులుగా చిచ్చు రేపడం, ఆ తర్వాత దాని పర్యవసానాలు తమకు లాభదాయకంగా ఉంటాయన్నది ధృవపడితే అప్పుడు అధికారికంగా ఆ ఎజెండాను ముందుకు తేవడం బిజెపికి పరిపాటి అయిపోయింది. ఒకవేళ వివాదం బెడిసికొడితే, మాకేమీ సంబంధం లేదు, అది ఆ సభ్యుడి వ్యక్తిగత అభిప్రాయం అని చెప్పి తప్పించుకోవడం కూడా బిజెపి ఎత్తుగడలో భాగమే.

సదరు బిల్లులో తక్షణమే జనాభా నియంత్రణకు చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందంటూ ఆ ఇద్దరు ఎంపీలూ ప్రతిపాదించారు.

ఈ బిల్లు లోక్‌సభలో పెట్టక ముందు ఇంకో ఆరు నెలల్లో యు.పి అసెంబ్లీకి ఎన్నికలు రాబోతున్నాయనగా యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం "ఉత్తరప్రదేశ్ జనాభా (నియంత్రణ, స్థిరీకరణ, మరియు సంక్షేమం) బిల్లు, 2021ని అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. అందులో ఉన్న ప్రతిపాదనల్లో ఆచరణాత్మకమైనవి తక్కువగా, రాజకీయంగా వివాదాస్పదం అయ్యేవి ఎక్కువగా ఉన్నాయి. ఆ తర్వాత జనాభా నియంత్రణ పక్షోత్సవం సందర్భంగా మాట్లాడుతూ, యోగి ఆదిత్యనాథ్ వెలిబుచ్చిన అభిప్రాయాలు మరింత స్పష్టంగా హిందూత్వ ఎజెండా ఏమిటో సూచిస్తున్నాయి. "ఏదో ఒకానొక మతానికి చెందిన ప్రజల జనాభా తక్కిన తరగతుల ప్రజానీకం కన్నా ఎక్కువగా పెరిగిపోయి, ఇక్కడి మూలవాసుల (అంటే హిందువులు అని అనుకోవాలి) జనాభాను మాత్రమే స్థిరీకరించడం అనేది ఏ విధంగానూ అనుమతించబోము" అని ఆదిత్యనాథ్ ప్రకటించారు. ఇప్పటికే ఉత్తర భారతంలో హిందీ ప్రాంతంలో ముస్లింల జనాభా హిందువులతో పోల్చితే ఎక్కువగా పెరిగిపోతోందన్న పొరపాటు భావన బలంగా ప్రచారంలో ఉంది. దానిని మరింత రెచ్చగొట్టి ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందడమే బిజెపి వ్యూహం. యు.పి ఎన్నికలముందు అక్కడ అసెంబ్లీలో రేపిన వివాదాన్ని ఇప్పుడు తాజాగా లోక్‌సభలో రేపుతున్నారు.



ఆ తర్వాత జనాభా నియంత్రణ పక్షోత్సవం సందర్భంగా మాట్లాడుతూ, యోగి ఆదిత్యనాథ్ వెలిబుచ్చిన అభిప్రాయాలు మరింత స్పష్టంగా హిందూత్వ ఎజెండా ఏమిటో సూచిస్తున్నాయి. "ఏదో ఒకానొక మతానికి చెందిన ప్రజల జనాభా తక్కిన తరగతుల ప్రజానీకం కన్నా ఎక్కువగా పెరిగిపోయి, ఇక్కడి మూలవాసుల (అంటే హిందువులు అని అనుకోవాలి) జనాభాను మాత్రమే స్థిరీకరించడం అనేది ఏ విధంగానూ అనుమతించబోము" అని ఆదిత్యనాథ్ ప్రకటించారు. ఇప్పటికే ఉత్తర భారతంలో హిందీ ప్రాంతంలో ముస్లింల జనాభా హిందువులతో పోల్చితే ఎక్కువగా పెరిగిపోతోందన్న పొరపాటు భావన బలంగా ప్రచారంలో ఉంది. దానిని మరింత రెచ్చగొట్టి ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందడమే బిజెపి వ్యూహం. యు.పి ఎన్నికల ముందు అక్కడ అసెంబ్లీలో రేపిన వివాదాన్ని ఇప్పుడు తాజాగా లోక్‌సభలో రేపుతున్నారు.

ఇంతకూ జాతీయ సర్వే వెల్లడిస్తున్నది ఏమిటి?

1992-93 నాటికి ముస్లిం లకు, హిందువులకు మధ్య సంతానోత్పత్తి రేటు (దీనినే ఫెర్టిలిటీ రేటు అంటారు)లో తేడా 1.1 ఉండేది. అంటే ఆనాటికి ముస్లిం జనాభా హిందువుల జనాభా కన్నా 1.1 శాతం చొప్పున అధికంగా పెరుగుతూ వుండేది. తాజాగా 2019-21 లో చేసిన జాతీయ కుటుంబ సంక్షేమ సర్వే ప్రకారం ఈ తేడా 0.35 కి తగ్గిపోయింది. అంటే గడిచిన ముప్ఫై సంవత్సరాల కాలంలో ముస్లింలలోనే జనాభా నియంత్రణ పథకాల ఫలితాలు ఎక్కువ ఫలితాలను ఇచ్చాయి.

ఉత్తరప్రదేశ్ లో చూస్తే అక్కడ ముస్లిం జనాభా 20 శాతం ఉంది. ఆ రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 1981 నాటికి 5.8 శాతంగా ఉండేది కాస్తా 2011 నాటికి 2.7 కి తగ్గిపోయింది. అదే అస్సాంలో ముస్లిం జనాభా 33 శాతం. అక్కడ ఇప్పుడు సంతానోత్పత్తి రేటు 1.9 శాతం ఉంది. జమ్ము-కాశ్మీర్ లో ముస్లిం జనాభా చాలా ఎక్కువ. అక్కడ1981లో 4.5 శాతంగా ఉండిన సంతానోత్పత్తి రేటు 2011 నాటికి 1.4 శాతానికి పడిపోయింది. ఇది దేశం మొత్తం మీద సగటున ఉన్న సంతానోత్పత్తి రేటు 2 శాతం కన్నా తక్కువగానే ఉంది. ఈ వివరాలను బట్టి హిందువులకన్నా ముస్లింలు కుటుంబ నియంత్రణ పద్ధతులను మెరుగ్గా పాటిస్తున్నారు అని స్పష్టంగా చెప్పవచ్చు.

జాతీయ సర్వే ఫలితాలను చూస్తే జనాభా నియంత్రణ మనదేశంలో సరైన దిశలోనే కొనసాగుతోందని చెప్పవచ్చు. 1951 నాటికి 5.9 శాతంగా ఉన్న సంతానోత్పత్తి రేటు ఇప్పుడు రెండు శాతానికి పరిమితం అవడం బట్టి ఈ విషయం బోధపడుతోంది. అటువంటప్పుడు ఇవే విధానాలను కొనసాగిస్తే సరిపోతుంది. కాని అదేదో తీవ్రమైన తక్షణ సమస్య అయినట్టు బిజెపి చిత్రీకరించడం చూస్తే ఆ పార్టీ అసలు ఎజెండా జనాభా నియంత్రణ ఎంతమాత్రమూ కానేకాదని కనపడుతోంది. ముస్లింలకు, హిందువులకు మధ్య సంతానోత్పత్తి రేటులో తేడా తగ్గడం, ముస్లింలలో జనాభా నియంత్రణ పద్ధతులను మెరుగ్గా పాటించడం, ముస్లిం జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాలలో సంతానోత్పత్తి పెరుగుదల రేటు తక్కిన రాష్ట్రాలకన్నా సాపేక్షంగా తక్కువగా ఉండడం వాస్తవాలు అయినప్పుడు వాటన్నింటినీ కప్పిపుచ్చి హిందువుల జనాభా తగ్గిపోతోందంటూ విద్వేషాలను రెచ్చగొట్టడం హిందూత్వ మతోన్మాద రాజకీయ ఎజెండాలో భాగమే.

నిజానికి జరగాల్సినది ఏమిటి?

ఐక్యరాజ్యసమితి గణాంకాలు చూస్తే చాలా దేశాల్లో వయో వృద్ధుల శాతం జనాభాలో పెరుగుతూ, యువత శాతం తగ్గుతూ వుంది. ఈ ధోరణి రాబోయే సంవత్సరాల్లో కూడా కొనసాగనుందని ఐరాస అంచనా. ఈ ధోరణి తొలుత జపాన్, స్కాండినేవియన్ దేశాలు, తదితర సంపన్న దేశాల్లో మొదలైంది. ఇప్పుడు అది అభివృద్ధి చెందుతున్న దక్షిణాసియా దేశాల్లో సైతం కనిపిస్తోంది. అందులో ఇండియా కూడా ఉంది. అటువంటప్పుడు బలవంతంగా జనాభా నియంత్రణ చర్యలు ప్రవేశపెట్టడం ప్రతికూల ఫలితాలనిస్తుంది. యు.పి ప్రభుత్వం ఇద్దరు కన్నా సంతానం ఎక్కువ ఉంటే ఆ దంపతులలో ఎవరికీ ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అర్హత ఉండదని తన ప్రతిపాదిత చట్టంలో పేర్కొంది. ఇది బలవంతంగా జనాభా నియంత్రణ అమలు చేయడం కిందే వస్తుంది. ఇటువంటి అనాలోచిత చర్యలు ఎంతమాత్రమూ పనికిరావు.

ప్రపంచంలో అధికంగా ప్రసూతి మరణాలు, నవజాత శిశువుల మరణాలు సంభవిస్తున్న దేశాల్లో భారతదేశం కూడా ఒకటి. వివిధ రకాల అంగవైకల్యాలతో జన్మిస్తున్నవారి సంఖ్య అధికంగా ఉన్న దేశాలలో కూడా భారతదేశం ఉంది. ఇక ఆకలి సూచికలో కూడా మన దేశం స్థానం దిగజారుతూనే వుంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ వైద్య, కుటుంబ సంక్షేమ వ్యవస్థలను మరింత బలోపేతం చేయడం తక్షణ ప్రాధాన్యతగా ఉండాలి. ఆ పని చేయడానికి ఈ బిజెపి ప్రభుత్వం ముందుకు రాదు. పైగా వైద్యాన్ని మరింత ప్రైవేటుపరం చేస్తోంది. దాని ఫలితంగా పేద ప్రజానీకం సరైన వైద్యం పొందలేకపోతున్నారు. లేదా చేయించుకున్న వైద్యానికి ఫలితంగా అప్పులపాలవుతున్నారు. దేశంలో జరుగుతున్న రైతాంగ ఆత్మహత్యల్లో గణనీయ భాగం వైద్యానికి చేసిన అప్పులను తీర్చలేకపోయినందు వలన జరిగినవే. ఈ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకుంటూ, ప్రజల్లో రగిలే అసంతృప్తిని విద్వేష రాజకీయాల వైపు మళ్ళించడమే బిజెపి వ్యూహం. ఇది మోడీ ప్రభుత్వం ఆడుతున్న కపట నాటకంలో మరో అంకం.

★

ఆయిల్ ఫామ్ రైతులకు లబ్ధి

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతులకు లబ్ధి చేకూర్చే విధంగా ఆయిల్ ఫామ్ ధరలను నిర్ణయిస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సచివాలయం రెండో బ్లాక్‌లో ఆయిల్ ఫామ్ ఎఫ్ఎఫ్‌బి, ప్రైసింగ్ ఫార్ములా ఖరారు కమిటీ సమావేశం మంత్రి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ పాదయాత్రలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆయిల్ ఫామ్ రైతులకు ఇచ్చిన హామీలన్నింటిని అమల్జేశామన్నారు. ఆయిల్ ఫామ్ ధరలు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పూర్తిగా రూపుమాపుతానని ఇచ్చిన హామీకి అనుగుణంగా ఆంధ్రాఆయిల్ ఫామ్ రైతులకు రూ.84 కోట్ల మేర వ్యత్యాస ధరను చెల్లించడం జరిగిందన్నారు. అదే విధంగా ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో శాతం ఎక్కడ ఎక్కువగా ఉంటూ ఆ శాతాన్నే ఆంధ్రాలో కూడా అమలు పరుచుతామని ఇచ్చిన హామీని కూడా అమలు పరచడం జరుగుతోందని మంత్రి తెలిపారు. 2022 నవంబరు1 నుంచి 2023 అక్టోబరు 31 ముగిసేవు వరకు కూడా రైతులకు లబ్ధి చేకూర్చే విధంగా ఆయిల్ ఫామ్ ఎఫ్ఎఫ్‌బి ప్రైసింగ్ ఫార్ములాను ఖరారు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆయిల్‌ఫామ్ డెవలపర్స్‌అండ్ ప్రాసెసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, ఉద్యాన వన శాఖ కమిషనరు డా.ఎస్ఎస్ శ్రీధర్, ఎపి ఆయిల్ ఫెడ్ విసి ఎంబి బాబురావు, రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షులు బొబ్బా వీరరాఘవరావు, జనరల్ సెక్రటరీ వి.రంగారావు, జాతీయ ఆయిల్ ఫామ్ రైతుల సంక్షేమ సంఘంజనరల్ సెక్రటరీ క్రాంతికుమార్ పాల్గొన్నారు.



గీతం సమీపంలోని ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు పెడుతున్న అధికారులు

'గీతం' పరిసరాల్లో ప్రభుత్వ భూమికి కంచె


వైద్య కళాశాల భవనాలను కూలగొడతారన్న ప్రచారంతో ఉత్కంఠ

ప్రజాశక్తి - మధురవాడ (విశాఖపట్నం)

విశాఖలోని గీతం వర్సిటీ వైద్య కళాశాల పరిసరాల్లో గతంలో గుర్తించిన ప్రభుత్వ భూమి చుట్టూ జివిఎంసి, రెవెన్యూ అధికారులు శుక్రవారం కంచెను ఏర్పాటు చేశారు. కంచె పనులను వేకువజామున భారీ పోలీసు బందోబస్తుతో చేపట్టడంతో తొలుత తీవ్ర ఉత్కంఠ నెలకొంది. గీతం వైద్య కళాశాల భవనాలను కూలుస్తారనే ప్రచారంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న హైటెన్షన్ నెలకొంది. ఎండాడ, రుషికొండవైపు వెళ్లే మార్గాల్లో పోలీసులు బారికేడ్లు పెట్టి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మరోవైపు టిడిపి నాయకులు గీతం వర్సిటీ వద్దకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆ పార్టీకి చెందిన కొంత మంది నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేయడంతో ఉద్రిక్త నెలకొంది. గతంలో స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమిలో కంచె ఏర్పాటు చేస్తున్నట్లు భీమిలి ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి పేర్కొనడంతో ఉత్కంఠకు తెరపడింది. ఆ తరువాత కంచె ఏర్పాటు పనులు సజావుగా సాగాయి. ఇది 'ప్రభుత్వ భూమి' అంటూ అధికారులు పలుచోట్ల బోర్డులు పెట్టారు. కళాశాలను ఆనుకుని ఉన్న 14 ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలోనే స్వాధీనం చేసుకున్నామని, ఇప్పుడు కంచె మాత్రమే ఏర్పాటు చేశామని ఆర్‌డిఒ తెలిపారు. ఈ పరిణామాలపై టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి స్పందిస్తూ ఇంత హడావుడిగా, వందలాది మంది పోలీసు బందోబస్తు నడుమ కంచె వేయాల్సిన అవసరం ఏమొచ్చిందని, ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

పట్టాదారు పాస్ పుస్తకాల్లో తప్పులు దొర్లనీయొద్దు

డిజిటల్ సిగ్నేచర్ ఆలస్యం పట్ల సిసిఎల్ఎ చురకలు?



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పాస్ పుస్తకాల్లో తప్పులు వస్తే రైతులు ఇబ్బందులు పడతారని సిసిఎల్ఎ సాయి ప్రసాద్ అధికారులతో పేర్కొన్నారు. భూముల రీ-సర్వే అనంతరం భూయజమానులకు ఇచ్చే హక్కుల పత్రం (పట్టాదారు పాసు పుస్తకం)లో ఎటువంటి తప్పులు దొర్లకుండా చూడాల్సిందిగా విజయవాడలో శుక్రవారం జరిగిన 9 జిల్లాల రెవెన్యూ డివిజనల్ సదస్సులో సంబంధిత అధికారులకు ఆయన మార్గనిర్దేశం చేసినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... రీ సర్వే జరిగిన గ్రామాలకు సంబంధించి డిజిటల్ సిగ్నేచర్ అనేక జిల్లాల్లో పెండింగ్ ఉండటం పట్ల జాయింట్ కలెక్టర్లపై సిసిఎల్ఎ అసహనం వ్యక్తం చేశారు. పెండింగ్ సిగ్నేచర్ పూర్తి కాక పోతే రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో వేరే గ్రామాలకు చెందిన హక్కుల పత్రాలు ప్రింటింగ్‌కు ఇవ్వడానికి అవకాశం లేదని కూడా ఆయన స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్నట్లు 29 గ్రామాలకు చెందిన డిజిటల్ సిగ్నేచర్ వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఫారం 8 ని జారీ చేసేందుకు జనరేట్ చేసేందుకు ఒక్క రోజు సరిపోతుందని, నోటీసు ఇచ్చిన తర్వాత 15 రోజులు సమయం ఉంటుందని, అనంతరం ఎవరి పేరు రికార్డుల్లో ఎక్కుతోందో తెలుస్తుం దన్నారు. నెల నుంచి వర్తించి తెస్తున్నప్పటికీ ఎందుకు ఫారం జనరేట్ చేయడంలేదని ఆయన అధికారులను ప్రశ్నించారు.

ఆర్‌డిఒలకు పని ఏముంది?

విఆర్‌ఒ, విలేజ్ సర్వేయర్లు తప్పులు చేస్తుంటే మీరు ఎందుకు సూపర్‌వైజింగ్ ఎందుకు చేయడం లేదని జాయింట్ కలెక్టర్లను కూడా సిసిఎల్ఎ ప్రశ్నించినట్లు తెలిసింది. ఆర్‌డిఒలు ప్రతి రోజు రివ్యూ చేయాలి? ఆర్‌డిఒలకు ప్రత్యేకంగా పని ఏముంది? ప్రతి రోజు విఆర్‌ఒ లతో ఎందుకు సమీక్ష చేయడం లేదని నిలదీసినట్లుగా సమాచారం. పెండింగ్ ఎక్కువగా ఉన్న వీఆర్‌ఓ, విలేజ్ సర్వేయర్లను కలెక్టర్ కార్యాలయానికి పిలిపించి పనిచేయించండి అంటూ ఆయన ఆదేశాలు జారీ చేశారు.

డ్రయ్యర్లకు విద్యుత్తు రాయితీ

రైసు మిల్లుల్లో ప్రత్యేక మీటర్లు

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వచ్చే ఖరీఫ్ నాటికి మిల్లర్లు అందరూ డ్రయ్యర్లు ఏర్పాటు చేసుకోవాలని, డ్రయ్యర్లకు విద్యుత్తు వినియోగం విషయంలో సిఎం రాయితీ కల్పించేందుకు విద్యుత్తు శాఖ అధికారులతో సమావేశం సందర్భంగా అంగీకరించినట్లు రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పేర్కొన్నారు. సీజన్‌లో రైసు మిల్లుల్లో ప్రత్యేక మీటర్లు పెట్టుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. విజయవాడ ఆటోనగర్‌లోని పౌరసరఫరాల సంస్ద ప్రధాన కార్యాలయంలో శుక్రవారం అన్ని జిల్లాల రైసు మిల్లుల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కూడా దేశ వ్యాప్తంగా ఈ ప్రక్రియను చేపట్టాలని నిర్ణయించిందని తెలిపారు. ప్రకృతి విపత్తులు సంభవించి పంటపొలాల్లో ధాన్యం తడిసినప్పుడు రైతులు పలు రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి ధాన్యానికి సరైన ధర రాక నష్టపోతున్నారని మంత్రి వివరించారు. మిల్లర్లు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని డ్రయ్యర్ల కొనుగోలు చేయాలన్నారు. ఎండి వీరపాండియన్ మాట్లాడుతూ రాష్ట్రంలో 1600 రైసు మిల్లుల్లో 1053 డ్రయ్యర్లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. వచ్చే సెప్టెంబరులోగా డ్రయ్యర్లు కొనుగోలుకు గడువు ఇస్తున్నామన్నారు. ఇందుకోసం రూ.330కోట్లు మిల్లర్లకు సర్దుభాటు చేశామన్నారు, ఇప్పటికిప్పుడు రూ,100 కోట్లు విడుదల చేయనున్నట్లు తెలిపారు. మిల్లర్లకు ప్రభుత్వం నుంచి ఇవ్వాల్సిన బకాయిలన్నీ ఇస్తామని ఎండి పేర్కొన్నారు.

ఆశాజనకంగా మిర్చి ధరలు



- మార్కెట్‌కు కొత్త సరుకు
- గరిష్ట ధర రూ.37 వేలు నమోదు
- విదేశీల నుంచి కూడా ఆర్డర్లు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి గుంటూరు మిర్చి యార్డుకు కొత్త సరుకు వస్తోంది. గత వారం రోజులుగా సగటున రోజుకు 40 వేల బస్తాలు వస్తున్నాయి. గత నెల రోజులుగా రాయలసీమ జిల్లాల నుంచి సరుకు ఎక్కువగా వస్తోంది. గత వారం రోజుల నుంచి గుంటూరు, పల్నాడు, ప్రకాశం, ఎన్‌టిఆర్ జిల్లాల నుంచి కొత్త సరుకు రావడం ప్రారంభమైంది. కోల్డ్ స్టోరేజీల్లో ఉన్న గత సీజన్‌కు చెందిన మిర్చి నిల్వలు రోజూ యార్డుకు పది వేల టిక్కిలు, కొత్త సరుకు 30 వేల టిక్కిలు వస్తున్నాయి. మిర్చి యార్డులో గత వారం రోజులు లభించిన సగటు ధరలు నాన్ ఎసి కామన్ వెరయిటీ కనిష్ట ధర క్వింటాలు రూ.10 వేలు, గరిష్ట ధర రూ.27 వేలు ఉంది. బాడిగ రకం కనిష్ట సగటు ధర రూ.10 వేలు, గరిష్ట సగటు ధర రూ.26,800 పలికింది. మేలురకమైన నెంబరు 5 వైరటీ క్వింటాలు రూ.30 వేలు, బాడిగ 355 రకం రూ.37 వేలు, 334 రకం రూ.28 వేలు గరిష్టంగా లభించింది. నాన్ ఎసి స్పెషల్ వెరైటీ తేజ కనిష్ట ధర రూ.9,500 వస్తుండగా, గరిష్ట ధర రూ.27 వేలు వచ్చింది. తేజ రకం కనిష్టం రూ.9500, గరిష్ట ధర రూ.26,500, దేవదారు డీలక్సు గరిష్ట ధర రూ. 26 వేలు పలికింది. గత నెల ద్వితీయ పక్షంలో ధరలు స్వల్పంగా తగ్గగా ఈ వారం నుంచి ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. విదేశాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. వీటితోపాటు ఇతర రాష్ట్రాల నుంచి ఇంటి అవసరాల కోసం ఆర్డర్లు రావడం వల్ల ధరలు మళ్లీ పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. గత వారం కన్నా ఈ వారం మొత్తం అన్ని రకాలకూ క్వింటాలుకు వెయ్యి నుంచి రూ. 2 వేల వరకు పెరిగాయి. తేజ, బాడిగ, కొత్తవి 2043 రకం ధరలు భారీగా పెరుగుతున్నాయి. 2043 రకం కొంత సరుకు గరిష్టంగా రూ.37 వేల వరకు పలికింది. యార్డుకు వస్తున్న మిర్చి నాణ్యత బాగుందని, అందువల్ల ధరలు కూడా బాగా వచ్చాయని వ్యాపారులు తెలిపారు. ఇటీవల నిలిచిపోయిన ఆర్డర్లకు మళ్లీ ఆయా దేశాల నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ప్రధానంగా బంగ్లాదేశ్ నుంచి మళ్లీ ఆర్డర్లు ప్రారంభమయ్యాయి. సింగపూర్, మలేషియా, థాయిలాండ్, శ్రీలంక నుంచి ఆర్డర్లు వచ్చాయని వ్యాపారులు చెబుతున్నారు. కర్ణాటక, మహారాష్ట్రలో ఆశించినంతగా మిర్చి ఉత్పత్తి రావడం లేదు. దీంతో, గుంటూరు మిర్చి కోసం పలు రాష్ట్రాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. కేరళ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ నుంచి కూడా ఆర్డర్లు వచ్చాయని వ్యాపారులు తెలిపారు.

గోదావరిలో దూకి ఇరిగేషన్ డిఇఇ ఆత్మహత్య



ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

గోదావరి నదిలో దూకి ఇరిగేషన్ డిఇఇ ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం యంచ వద్ద శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రాజారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పోతంగల్ గ్రామానికి చెందిన రమణారావు (46) జలవనరుల శాఖ డిఇఇగా విధులు నిర్వహిస్తున్నారు. వ్యక్తిగత కారణాలతో గత ఫిబ్రవరి నెల నుంచి సెలవులపై ఉన్న ఆయన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. కారులో స్వగ్రామానికి బుధవారం వచ్చారు. తిరిగి మోటార్ బైక్‌పై హైదరాబాద్ వెళ తున్నానని చెప్పి వెళ్లారు. హైదరాబాద్‌కు చేరుకోకపోవడంతో బంధువులకు ఫోన్ చేసినా సమాచారం తెలియలేదు. దీంతో, రామణారావు అన్న మధుకర్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యంచలోని గోదావరి వద్ద మోటార్ బైక్ కనిపించడంతో గజ ఈతగాళ్లతో గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం మృతదేహం లభించింది. స్వగ్రామం పోతంగల్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. జడ్‌పి చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, రామ్ కిషన్‌రావు, అనిల్‌రావు హాజరయ్యారు. రమణారావుకు భార్య, కూతురు ఉన్నారు. మృతికి కారణాలు తెలియరాలేదు.

రూ.3,200 కోట్లకు చేరిన ఓ.డి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ఖజానా ఓవర్‌డ్రాఫ్ట్‌లోనే కొనసాగుతోంది. ఇటీవల కాలంలో ఎప్పుడూ లేనివిధంగా అత్యధిక వినియోగం నమోదైంది. ఈ త్రైమాసికంలో తొలి రోజు నుంచే ఓడి లోకి వెళ్లిన ఖజానా ప్రస్తుతం 3,200 కోట్ల వరకు చేరుకుంది. ఇది వరుసగా నాలుగో రోజు కాగా, ఈ నెల్లో మూడో రోజు కావడం గమనార్హం. రెండు రోజుల క్రితం వివిధ రూపాల్లో ఖజానాకు చేరిన నిధులు ఓవర్‌డ్రాఫ్ట్ కింద రిజర్వ్‌బ్యాంకు జమ చేసుకోగా, తప్పనిసరి పరిస్థితుల్లో మళ్లీ ఓవర్‌డ్రాఫ్ట్‌కు వెళ్లాల్సి వచ్చిందని అధికారులు చెబుతున్నారు.

ప్రయివేటుకు భారీగా మాంగనీస్

- భారీ ఎత్తున కట్టబెట్టేందుకు రంగం సిద్ధం
- పర్యావరణ పరిరక్షణ గాలికి
- ఆందోళనలో ప్రజానీకం

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి


విజయనగరం జిల్లాలో నిక్షిప్తమై ఉన్న మాంగనీస్ గనులను కారుచౌకగా ప్రయివేటు సంస్థలకు భారీ ఎత్తున కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైంది. ఈ గనులను ఉపయోగించుకుని ప్రభుత్వ రంగంలో పరిశ్రమ ఏర్పాటు చేయాలన్న డిమాండ్లను లెక్కచేయలేదు. పర్యావరణ ఇబ్బందులు తలెత్తుతాయన్న ప్రజల ఆందోళనలు కూడా పట్టించుకోవడం లేదు. విజయనగరం జిల్లా గరివిడి, చీపురుపల్లి, మెరకముడిదాం, నెల్లిమర్ల, రాజాం, తెర్లాం మండలాలు మాంగనీస్ గనులకు పెట్టింది పేరు. ఇక్కడి భూగర్భంలో నిక్షిప్తమై ఉన్న ఈ ఖనిజానికి ప్రపంచ స్థాయిలో మంచి డిమాండ్ ఉంది. 30 బ్లాకుల్లో మంగనీస్ తవ్వకాలను గతంలోనే అనుమతులు ఉండేవి. ప్రస్తుతం వీటిలో కొన్నింటిలో మాత్రమే తవ్వకాలు జరుగుతున్నాయి. ఇనుము, కాపర్ వంటి రకరకాల లోహాలను కరిగించడంతోపాటు వివిధ రకాల తయారీకి మాంగనీస్ ఎంతో దోహదపడుతోంది. ఈ ప్రాంతంలోని మాంగనీస్ అత్యంత నాణ్యతగా ఉండడంతో సెయిల్, గెయిల్ వంటి ప్రభుత్వరంగ స్టీల్‌ప్లాంటులకు కేటాయించాలన్న ఉద్దేశంతో సుమారు రెండు దశాబ్దాల క్రితం ఇక్కడి మాంగనీస్ గనులను కొత్తగా లీజుకు ఇవ్వకుండా నిలిపివేశారు. రెండోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం సహజ వనరుల లీజు పద్ధతిని పెట్టుబడిదారులకు మరింత సులభతరం చేసి ఓపెన్ బిడ్ రూపంలో కేటాయిస్తోంది. ఈ క్రమంలో ఎపి ఎంఎంసి (ఆంధ్రప్రదేశ్ మైనర్ మినరల్ కనస్ట్రక్షన్) 1966 నిబంధనలను సరళతరం చేసి 2022 మార్చి 14న ఎపి ఎంఎంఆర్‌ను విడుదల చేసింది. ఇందులో భాగంగా జిఒ నెంబర్ 30, 14లను తీసుకొచ్చింది. విజయనగరం జిల్లాలో వివిధ మండలాల్లోని మాంగనీస్ గనులను భారీ స్థాయిలో వివిధ ప్రయివేటు సంస్థలకు కట్టబెట్టింది. 56 లక్షల మెట్రిక్ టన్నుల మాంగనీస్ నిల్వలు ఉన్న గరివిడి మండలం దేవాడ బ్లాక్‌ను మహాలక్ష్మి మినరల్స్ అనే ప్రయివేట్ కంపెనీ, జిల్లాలోని సుమారు 19 మాంగనీస్ బ్లాకులను ఆర్‌బిఎస్ఎస్‌డి-2, మోర్ ఎల్లాయిస్ వంటి కంపెనీలు దక్కించుకున్నట్టు సమాచారం. గరివిడి మండలం దేవాడ బ్లాక్‌లో తవ్వకాలకు గతేడాది నవంబర్ 22న, కొండపాలెం బ్లాక్‌లో తవ్వకాలకు గత నెల 21న అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. జిల్లా అత్యంత వెనుకబడి ఉన్నందున స్టీల్, ఫెర్రో ఎల్లాయిస్ వంటి పరిశ్రమలను ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేయాలని, వాటికి స్థానికంగా ఉన్న మాంగనీస్ గనులను కేటాయించాలని ఈ గ్రామాల్లోని ప్రజలు, కార్మికులు డిమాండ్ చేశారు. నివాసాలకు కేవలం 500 మీటర్ల దూరంలో తవ్వకాలు చేపడితే కాలుష్య సమస్య ఎదుర్కోవాల్సి వస్తుందని, అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుందని అధికారులు చెప్పినప్పటికీ ఆచరణలో అటువంటి చర్యలేవీ కనిపించడం లేదు. తవ్వకాలకు అనుమతులు చకచకా ఇచ్చేస్తున్నారు. దీంతో, ప్రజల్లో ఆందోళన మొదలైంది. మాంగనీస్ గనులు ప్రయివేటుపరం కావడంతో ఉపాధి మార్గాలు కనిపించడం లేదు.

మాంగనీస్ నిక్షిప్తమై ఉన్న గ్రామాలు ఇవే

- గరివిడి మండలం దేవాడ, కొండపాలెం, కోనూరు, దువ్వాం
- చీపురుపల్లి మండలం కర్లాం
- మెరకముడిదాం మండలం కొత్త కర్లాం
- నెల్లిమర్ల మండలం గరికిపేట, తంగుడుబిల్లి
- తెర్లాం మండలం గదబవలస
- రాజాం మండలం దార చీపురుపల్లి



మాంగనీస్ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయాలి



అత్యంత విలువైన, నాణ్యమైన మాంగనీస్ గనులు నిక్షిప్తమై ఉన్న చీపురుపల్లి నియోజకవర్గంలో స్టీల్, ఫెర్రోఎల్లాయిస్ తదితర మాంగనీస్ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. తద్వారా విజయనగరం జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంది. వలసలు నివారించవచ్చు. ఇక్కడి విలువైన గనులను ప్రయివేటు సంస్థలకు అప్పగించడం వల్ల ఈ ప్రాంతం మరింత దుర్భిక్ష పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

-అంబల్ల గౌరినాయుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

సాగు భూములకు పట్టాలివ్వాలని గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి-మక్కువ (పార్వతీపురం మన్యం జిల్లా)

సాగు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యాన పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ తహశీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులు శుక్రవారం ధర్నా చేశారు. తప్పుల తడకలుగా ఉన్న భూ సర్వేను సరి చేయాలని డిమాండ్ చేశారు. తొలుత స్థానిక మెయిన్ రోడ్డు నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నానుద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, ఉపాధ్యక్షులు చింతల తవిటినాయుడు మాట్లాడారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర భూ సర్వే తప్పులు తడకగా తయారైందని విమర్శించారు. భూములు ఉన్నవారికి లేనట్లు, లేనివారికి ఉన్నట్లుగా ఈ సర్వే చూపిస్తోందని అన్నారు. మండలంలోని ఎ.వెంకంపేట, మోకవలస, అనసభద్ర, బంటుమక్కువ రెవెన్యూలో పరిధిలోని మోసూరువలస, మోకవలస, లోతుగడ్డ, రేగుమానువలస, నిమ్మలపాడు, మడవలస, అనసభద్ర, మెట్టవలస, విజయరామపురం గ్రామాల్లో గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనసభద్ర సర్వే నెంబర్ ఒకటిలో సుమారు 800 ఎకరాల భూములకు ఇప్పటి వరకు సమగ్ర సర్వే నిర్వహించలేదని తెలిపారు. పోడు, బంజరు, కొండ పోరంబోకు భూములకు పట్టాలు లేకపోవడం వలన అన్యాక్రాంతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి వెంటనే పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి అందజేశారు.

మతోన్మాదం దేశానికి ప్రమాదకరం

- దేశ లౌకికవాద పరిరక్షణ కు నడుం బిగించాలి
- అన్నే వెంకటేశ్వరరావు వర్ధంతి సభలో ఎమ్మెల్సీ కెఎస్‌లక్ష్మణరావు



సభలో మాట్లాడుతున్న కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి - ఏలూరు

మతతత్వం-మతోన్మాదం దేశానికి ప్రమాదకరమని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు అన్నారు. లౌకికవాద పరిరక్షణ కోసం యువత, అభ్యుదయవాదులు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఏలూరు పవర్‌పేటలోని ఉద్దరాజురామం భవనంలో స్వాతంత్ర్య సమరయోధులు, భూపోరాట నాయకులు అన్నే వెంకటేశ్వరరావు 20వ వర్ధంతి సభను శుక్రవారం నిర్వహించారు. తొలుత అన్నే వెంకటేశ్వరరావు చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహరావు అధ్యక్షతన జరిగిన సభలో కెఎస్.లక్ష్మణరావు 'లౌకికవాదం-నేటి సవాళ్లు' అనే అంశంపై స్మారకోపన్యాసం చేశారు. భారత రాజ్యాంగం భిన్నత్వంలో ఏకత్వం సాధించి దేశ ప్రజలను ఐక్యంగా ఉంచిందన్నారు. మతం వ్యక్తిగతమని, భారత రాజ్యాంగం ప్రజలకు మత స్వేచ్ఛను ఇచ్చిందని గుర్తు చేశారు. రాజ్యాంగ మూల సూత్రాలకు విఘాతం కలిగిస్తూ మతోన్మాదులు మతాన్ని రాజకీయాల్లోకి లాగారని విమర్శించారు. దేశ లౌకికవాద పరిరక్షణ కోసం మతోన్మాద చర్యలకు వ్యతిరేకంగా మతసామరస్యం కోసం అందరూ పోరాడాలని కోరారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మాట్లాడుతూ దేశంలో కార్పొరేట్ విధానాల పేరుతో దేశ సంపదను కొల్లగొడుతున్నారని విమర్శించారు. విద్యా ఉపాధి అవకాశాల కోసం ఉద్యమించాలన్నారు. అనంతరం అన్నే విజ్ఞాన కేంద్రం వార్షికోత్సవం సందర్భంగా వివిధ కళాశాలల్లో నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హేలాపురి బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

తహశీల్దార్ సస్పెన్షన్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

భూ రికార్డులు మార్చిన నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం తహశీల్దార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. బుచ్చిరెడ్డిపాలెం మండలం మినగల్లు గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి పొలాన్ని (20ఎకరాలు) రీ- సర్వేలో అదే గ్రామానికి చెందిన వైసిపి సర్పంచ్ భర్త రాము పేరుపై మార్పు చేశారు. తన భూమి రికార్డులు మార్పు చేశారని, అధికారుల చుట్టు కాళ్లరిగేలా సుబ్బారెడ్డి తిరిగారు. ఇటీవల స్పందనలో జెసికి ఫిర్యాదు చేశారు. వెంటనే ఆయన విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఆర్‌డిఓ విచారణ చేపట్టి నివేదికను జెసికి అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా తహశీల్దార్ భూములను మార్పు చేశారని నిర్ధారణ కావడంతో ఆమెను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.



మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

చెత్త పన్ను రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - అనంతపురం కార్పొరేషన్

చెత్త పన్ను వసూళ్ల ఉత్తర్వులను రద్దు చేయాలని అనంతపురం కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ ఛాంబర్ ఎదుట సిపిఎం నాయకులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర్ కమిటీ సభ్యులు వలీ, ప్రకాష్ రెడ్డి, ముస్కిన్ మాట్లాడారు. మున్సిపాల్టీల్లో చెత్త పన్ను వసూలు చేయాలంటూ నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే వివిధ పన్నుల భారాలతో సతమతం అవుతున్న ప్రజలపై కొత్తగా చెత్త పన్ను విధించడం సరికాదన్నారు. చెత్త పన్ను వసూళ్లను ఉపసంహరిస్తూ స్టాండింగ్ కమిటీలో నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారులతో మేయర్ మహ్మద్ వసీం, కమిషనర్ భాగ్యలక్ష్మి మాట్లాడారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వారు హామీ ఇచ్చారు. దీంతో సిపిఎం నాయకులు ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ నాయకులు మసూద్, వెంకటేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత బియ్యంతో సరి..
సబ్సిడీ బియ్యానికి కత్తెర

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

రేషన్ కార్డుదారులకు ఈ నెల ఉచిత బియ్యం మాత్రమే అందే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రతి నెలా ఎండియు (మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్లు) ద్వారా పేదలకు పంపిణీ చేయాల్సిన సబ్సిడీ బియ్యం (కేజీ రూ.1) దక్కే అవకాశాలు లేవు. ఉచిత బియ్యం పంపిణీలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న వైఖరే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పిఎంజికెఎవై) కింద మరో ఏడాది పాటు ఉచితంగా బియ్యాన్ని అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. బియ్యం పంపిణీని పునరుద్ధరించినా సరఫరా విధానంలో మాత్రం మార్పు చేయలేదు. గతంలో మాదిరిగానే జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్ఎఫ్ఎస్ఎ) కింద ఉన్న కార్డుదారులకు అందించే బియ్యానికే కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. నాన్ ఎన్ఎఫ్ఎస్ఎ కార్డుదార్లులకు బియ్యం ఇచ్చేందుకు నిరాకరించింది. నాన్ ఎన్ఎఫ్ఎస్ఎ కార్డుదారులకు ఉచిత బియ్యం అందించేందుకు సబ్సిడీ ఇవ్వాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పలుమార్లు కేంద్రాన్ని కోరారు. గతంలో పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పర్యటనకు వచ్చిన ప్రధాని మోడీకి సైతం వినతిపత్రం అందించారు. సబ్సిడీ ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించలేదు. కేంద్రం సబ్సిడీ ఇవ్వకపోయినా గతేడాది అక్టోబరు నుంచి డిసెంబర్ వరకు నాన్ ఎన్ఎఫ్ఎస్ఎ కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగానే బియ్యం అందించింది. పేదలకు మరో ఏడాది ఉచితంగా బియ్యం అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంతో, ఆ సబ్సిడీని భరించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడడం లేదు. సబ్సిడీపై రూపాయికి కేజీ చొప్పున అందిస్తున్న బియ్యంలోనే దాన్ని సర్దుబాటు చేస్తోంది. ఎన్ఎఫ్ఎస్ఎ కార్డుదారులకు, నాన్ ఎన్ఎఫ్ఎస్ఎ లబ్ధిదారులకు ఉచితంగా బియ్యం అందిస్తోంది. ఈ క్రమంలో ఎన్ఎఫ్ఎస్ఎ కార్డుదారులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బియ్యాన్ని పూర్తిగా కోల్పోతున్నారు.

రాష్ట్రంలో ఎన్ఎఫ్ఎస్ఎ, నాన్ ఎన్ఎఫ్ఎస్ఎ కార్డులు మొత్తం 1,45,43,997 ఉన్నాయి. వీటిలో ఎన్ఎఫ్ఎస్ఎ కేటగిరీలోని 90,27,636 కార్డులకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం ఉచితంగా బియ్యం అందిస్తోంది. నాన్ ఎన్ఎఫ్ఎస్ఎ కేటగిరిలోని 55,16,361 కార్డులకు అందించే బియ్యానికి సబ్సిడీ ఇవ్వడం లేదు. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎండియు ఆపరేటర్ల ద్వారా ఇంటింటికీ రేషన్ పేరుతో ఒక్కో లబ్ధిదారునికి ఐదు కేజీల బియ్యం, కార్డుకు అర కేజీ పంచదార, కేజీ కందిపప్పు అందిస్తోంది. బియ్యానికి కేజీ ఒక్కంటికీ రూపాయి చొప్పున, పంచదారకు రూ.17, కందిపప్పుకు రూ.67 వసూలు చేస్తోంది. ప్రస్తుతం బియ్యాన్ని ఉచితంగా ఇస్తూ కందిపప్పు, పంచదారకు మాత్రం డబ్బులు వసూలు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఎన్ఎఫ్ఎస్ఎ లబ్ధిదారులకు మాత్రమే ప్రతి నెలా 15 నుంచి 30వ తేదీ వరకు రేషన్ దుకాణాల ద్వారా ఒక్కో వ్యక్తికి ఐదేసి కేజీల బియ్యాన్ని ఉచితంగా అందిస్తోంది. ఈ నెల ఒకటో తేదీ నుంచే ఉచిత బియ్యాన్ని అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయాల్సిన బియ్యం స్థానంలో వాటినే సరఫరా చేస్తోంది. నాన్ ఎన్ఎఫ్ఎస్ఎ కార్డుదారులకూ ఉచితంగానే ఇస్తోంది. కేజీ రూపాయి చొప్పున ప్రతి వ్యక్తికీ రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని మాత్రం ఇవ్వడం లేదు. దీంతో, ఎన్ఎఫ్ఎస్ఎ కార్డుదారులు సబ్సిడీ బియ్యాన్ని కోల్పోతున్నారు. వీరిలో ముఖ్యంగా నిరుపేదలైన 7,24,214 మంది అంత్యోదయ కార్డుదారులు 35 కేజీల చొప్పున నష్టపోనున్నారు.

భూమి దక్కే వరకు పోరు

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి-బల్లికురవ (బాపట్ల జిల్లా)

అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములు తిరిగి దళితులకు దక్కే వరకు ఉద్యమాన్ని కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు అన్నారు. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కూకట్లపల్లి గ్రామంలో అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను తిరిగి తమకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎండిఓ కార్యాలయం ఎదుట దళితులు శుక్రవారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలను దడాల సుబ్బారావు ప్రారంభించి మాట్లాడుతూ.. కూకట్లపల్లి గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 500, 501, 502, 290, 291, 292లోని అటవీ భూములను 1980లో ప్రభుత్వం డి నోటిఫై చేసి ఆర్థికంగా వెనుకబడిన పేదలు, దళితులతోపాటు మాజీ సైనికులకు సుమారు 300 మందికి 150 ఎకరాల భూమిని పంచారని తెలిపారు. ఆ భూమిని అగ్రవర్ణ పెత్తందారులు ఆక్రమించుకొని వారి అధీనంలో ఉంచుకుంటే ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమని విమర్శించారు. పేదలకు భూమి దక్కేవరకు సాగే పోరాటంలో తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దారు సీతారత్నంతో చర్చించారు.



రిలే దీక్షలు జరుగుతున్న దృశ్యం

తహశీల్దారు మాట్లాడుతూ ఉన్నతాధికారుల నుంచి తగిన ఆదేశాలు వచ్చాయని, పని ఒత్తిడితో సమస్య పరిష్కారంలో జోక్యం చేసుకోలేకపోయామని తెలిపారు.

వీలైనంత త్వరగా ఆక్రమితదారులకు నోటీసులు ఇస్తామని, అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారులు ఇచ్చిన హామీని నిలబెట్టుకునే వరకు రిలే దీక్షలను కొనసాగించాలని కూకట్లపల్లి గ్రామస్తులకు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయని వినోద్ బాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మోంద్రు ఆంజనేయులు, సిఐటియు నేతలు మాట్లాడుతూ దళితుల న్యాయమైన ఈ భూపోరాటానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, అవసరమైతే ప్రత్యక్ష పోరాటంలో పాల్గొంటామని తెలిపారు.



వరి రైతుల కోసం 'మెంటార్'

క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ వెల్లడి

హైదరాబాద్ : ఆగ్రోకెమికల్ కంపెనీ క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ వరి రైతుల కోసం నూతన ఫంగిసైడ్ 'మెంటార్'ను విడుదల చేసినట్లు ప్రకటించింది. వరిలో కనిపించే తెగుళ్ల (ఆకు మడత) వంటి వాటిని నియంత్రించడంతో పాటుగా వరి పంటకు అదనపు రక్షణ సైతం అందించి అధిక దిగుబడిని సైతం అందిస్తుందని ఆ కంపెనీ తెలిపింది. వరిలో సాధారణంగా కనిపించే తెగుళ్ల నియంత్రణకు ఇది తోడ్పడటంతో పాటుగా రైతులకు అత్యంత ప్రయోజనకారిగా నిలువనుందని క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (స్ట్రాటజిక్ మార్కెటింగ్) సిఎస్ శుక్లా పేర్కొన్నారు.

రూపాయి అత్యంత పేలవ కరెన్సీ

గతేడాది ఆసియాలోనే అత్యధిక పతనం

మరింత పడిపోవచ్చు



న్యూఢిల్లీ : గతేడాది 2022లో ఆసియాలోనే అత్యంత పేలవ ప్రదర్శన కనబర్చిన కరెన్సీల్లో రూపాయి అగ్రస్థానంలో ఉందని ఓ ప్రయివేటు బ్యాంక్ టాప్ ఎగ్జిక్యూటివ్ అన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కరెంట్ ఎకౌంట్ లోటు పెరగనుందని.. దీంతో రూపాయి విలువ మరింత ఒత్తిడికి గురి కానుందని యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ ట్రెజరీ, హోల్‌సేల్ బ్యాంకింగ్, మార్కెట్స్ గ్రూపు ఎగ్జిక్యూటివ్ నీరజ్ గంభీర్ విశ్లేషించారు. బ్లూమ్‌బర్గ్ టివికి ఇచ్చిన ఇంటర్వ్యూలో గంభీర్ మాట్లాడుతూ.. "2022-23 ఆర్థిక సంవత్సరంలో విదేశీ నిధుల రాక మెరుగ్గా లేదు. గతేడాది రూపాయి విలువ 10 శాతం మేర పడిపోయింది. ఫెడరల్ రిజర్వ్ మానిటరీ పాలసీలో వడ్డీ రేట్ల పెంపునతో డాలర్ విలువ పెరిగడంతో భారత విదేశీ ఫైనాన్స్ క్షీణిస్తుంది. విదేశీ మారకం రిజర్వుల పెంపునకు ఆర్‌బిఐ చర్యలు తీసుకునే ప్రయత్నాలు చేస్తుంది. గతేడాది రూపాయి విలువ పడిపోతుంటే.. దేశీయ కరెన్సీని నిలబెట్టడానికి ఆర్‌బిఐ భారీ మొత్తంలో విదేశీ కరెన్సీని వ్యయం చేసింది." అని అన్నారు. వచ్చే ఏప్రిల్ 1 నాటికి డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 2-3 శాతం విలువ పడిపోవచ్చని ఆయన అంచనా వేశారు. శుక్రవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ 82.57 వద్ద నమోదయ్యింది. ఆర్‌బిఐ కీలక వడ్డీ రేట్లను మరో 25-50 బేసిస్ పాయింట్లు పెంచే అవకాశం ఉందని గంభీర్ పేర్కొన్నారు. వచ్చే కొన్ని మాసాల్లో పదేళ్ల కాలపరిమితి బాండ్లపై వడ్డీ రేటు 7.25 శాతం నుంచి 7.5 శాతం మధ్య ఉండొచ్చన్నారు.

వాణిజ్యలోటు, కరెంటు ఖాతా లోటు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో భారత్ కరెన్సీ అంతకంతకూ క్షీణిస్తూ వచ్చిందని ఇటీవల ఫారిన్ కరెన్సీ ఎక్స్చేంజ్ (ఫారెక్స్) ఓ రిపోర్టులో పేర్కొంది. దీంతో 2022 సంవత్సరంలో రూపాయి ఆసియాలోకెల్లా అత్యంత చెత్త కరెన్సీగా మిగిలిపోయిందని తెలిపింది. గరిష్ట వడ్డీ రేట్లు, అధిక ద్రవ్యోల్బణంతో అమెరికా డాలర్ బలపడినప్పటికీ, ఆసియా దేశాల్లో ఏ కరెన్సీ తగ్గనంత తీవ్రంగా రూపాయి 11.3 శాతం మేర పతనమయ్యిందని తెలిపింది. 2021 చివరి ట్రేడింగ్ రోజున డాలరు మారకంతో పోల్చితే రూపాయి విలువ 74.33 వద్దనుండగా.. 2022 చివరి రోజున 82.72కు పడిపోయిందని గుర్తు చేసింది.

రూపాయితో వాణిజ్యం : ఆర్‌బిఐ గవర్నర్

ఇతర దేశాలతో వాణిజ్యానికి రూపాయితో చెల్లింపుల విషయమై ప్రభుత్వం, ఆర్‌బిఐ ప్రయత్నిస్తుందని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్నారు. ఇందుకోసం దక్షిణాసియా దేశాలతో సంప్రదింపులు జరుగుతున్నాయన్నారు. శుక్రవారం అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) సదస్సులో శక్తికాంత మాట్లాడుతూ..

దక్షిణాసియాలో ప్రాంతీయ వాణిజ్యం కారణంగా వృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగు కానున్నాయన్నారు. ఉమ్మడి లక్ష్యాలు, సవాళ్లను ఎదుర్కొనేందుకు కేంద్ర బ్యాంక్‌ల స్థాయిలో పరస్పర సహకారం అందించుకోనున్నట్లు తెలిపారు. అదే విధంగా రూపాయి డిజిటల్ కరెన్సీ అంశంలోనూ ఆచితూచి అడుగులు వేస్తున్నామన్నారు.

మెనూ ఛార్జీలు పెంచాలి


- ఎపి మధ్యహ్న భోజన పథకం కార్మికుల యూనియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మధ్యాహ్న భోజనంలో రాగిమాల్ట్ ఫిబ్రవరి ఒకటి నుండి అమలు చేయాలని ఆదేశించిన సిఎం దానికయ్యే ఖర్చుకు సంబంధించి మెనూ ఛార్జీలను పెంచాలని ఎపి మధ్యహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ డిమాండు చేసింది. ఈ మేరకు యూనియన్ గౌరవాధ్యక్షులు కె.స్వరూపరాణి, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వరలక్ష్మి, దయా రమాదేవి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. మోనూ ఛార్జీలు పెంచకుండా అర్భాటంగా మెనూలో మార్పులు చేర్పులు చేయడం వల్ల మధ్యాహ్న భోజన పథకం కార్మికుల మీద భారం పడుతుందని తెలిపారు. ఒకపక్క పెరుగుతున్న అధిక ధరలతో మధ్యాహ్న భోజన కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ధరలు పెంచడంతోపాటు కార్మికుల వేతనాలూ పెంచాలని కోరారు.

స్టార్టప్‌లకు బ్రిటానియా మారీ గోల్డ్ మద్దతు

మహిళా ఔత్సాహికవేత్తలకు రూ.10 లక్షలు



న్యూఢిల్లీ : బ్రిటానియా మారి గోల్డ్ మై స్టార్టప్ సీజన్ 4.0ని ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇందులో పాల్గొనే ప్రతి ఒక్కరికీ డిజిటల్ వ్యాపార నైపుణ్యాన్ని అందించేందుకు గూగుల్ సహకారాన్ని అందిస్తోందని పేర్కొంది. దీనికి ఎంపికైన పది మంది గహిణులు తమ వ్యాపార దక్షతకు అనుగుణంగా వ్యాపారాలను ప్రారంభించేందుకు రూ.10 లక్షల ఆర్థిక సహకారాన్ని అందించనున్నట్లు తెలిపింది. గూగుల్ భాగస్వామ్యంతో ఉమెన్ విల్ కార్యక్రమం ద్వారా మహిళలు పారిశ్రామికవేత్తలుగా మారాలన్న ఆకాంక్ష ఉన్న వారికోసం దీన్ని ప్రత్యేకంగా డిజైన్ చేశామని బ్రిటానియా ఇండస్ట్రీస్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అమిత్ దోషి పేర్కొన్నారు. దీనికి ఎంపికయిన వారు ప్రత్యేకంగా డిజైన్ చేసిన డిజిటల్ బిజినెస్ నైపుణ్యాల వనరులను పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు.

మారుతీ గ్రాండ్ విటారాలో సిఎన్‌జి వెర్షన్

ధర రూ.12.85 లక్షలు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి తన మిడ్ సైజ్ ఎస్‌యువి గ్రాండ్ విటారాలో ఎస్-సిఎన్‌జి వర్షన్‌ను విడుదల చేసినట్లు శుక్రవారం ప్రకటించింది. డెల్టా, జీటా వేరియంట్లలో లభించే వీటి ఎక్స్‌షోరూం ధరలను వరుసగా రూ.12.85 లక్షలు, రూ.18.84 లక్షలుగా నిర్ణయించింది. 1.5 లీటర్ ఇంజిన్ కలిగిన ఈ ఎస్‌యువి 6,000 ఆర్‌పిఎం వద్ద 99 బిహెచ్‌పి శక్తిని కలిగి ఉంటుందని ఆ కంపెనీ తెలిపింది.

ఐద్వా మహాసభలో 'ఆంధ్రుల హక్కు'!

- మారుమ్రోగిన విశాఖ ఉక్కు పరిరక్షణ నినాదాలు

తిరువనంతపురం : ఐద్వా 13వ జాతీయ మహాసభ ప్రారంభ కార్యక్రమంలో 'ఆంధ్రుల హక్కు.. విశాఖ ఉక్కు' నినాదం మారుమ్రోగింది. గతంలో ఐద్వా జాతీయ మహాసభలు జరిగిన 12 ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన జ్యోతులు గురువారం రాత్రే మల్లు స్వరాజ్య నగర్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. వాటిని శుక్రవారం నేతలకు అందించారు. ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు గతంలో ఐద్వా జాతీయ మహాసభ జరిగిన విశాఖపట్నంనుండి తీసుకువచ్చిన 'విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ వ్యతిరేక పోరాట జ్యోతి'ని నేతలకు అందజేశారు. 'విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నాం' అన్న బ్యానర్‌ను ప్రదర్శించారు. 695 రోజులుగా సాగుతున్న కార్మికుల పోరాటాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులతోపాటు, వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన వారు కూడా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్మికుల పోరాటానికి మద్దతు ప్రకటించారు.

పోరాట యోధులకు ఘన సన్మానం

వివిధ రాష్ట్రాల్లో సమానత్వ సాధన, మహిళా హక్కుల పరిరక్షణ కోసం అవిశ్రాంత పోరాటం చేస్తున్న యోధులను మహాసభ ఘనంగా సన్మానించింది. ఆ పోరాటాలను మరింత ముందుకు తీసుకుపోవడానికి కృషి చేస్తామని ప్రతినబూనింది. 2020లో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం చేసిన సుదీర్ఘ పోరాటంలో మహిళా రైతులను ఏకం చేయడానికి కృషిచేసిన హర్యానాకు చెందిన షీలా సహానాను మహాసభ సన్మానించింది. దోభీలను ఏకం చేసి వారి హక్కులకోసం పోరాటం చేసిన ఒడిషాకు చెందిన సంయుక్తను, మత ఛాందసుల అభ్యంతరాలను తోసిరాజని మైనార్టీ కుటుంబంలో పుట్టి నృత్య ప్రదర్శనలు చేస్తున్న కేరళకు చెందిన మన్సియాను, అంగన్‌వాడీ హక్కుల కోసం హర్యానాలో బిజెపి ప్రభుత్వాన్ని ఎదిరించి పోరాడుతున్న కమ్లేష్‌ను, తృణమూల్ కాంగ్రెస్, మావోయిస్టుల దాడులను తిప్పికొట్టి మహిళా హక్కుల కోసం బెంగాల్‌లో పోరాడుతున్న పుల్లరా మెండల్‌ను, పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి తన భర్తను చంపివేయడంతో న్యాయంకోసం అలుపెరగని పోరాటం చేస్తున్న రేవతిని మహాసభలో సన్మానించారు.



విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ వ్యతిరేక పోరాట జ్యోతి'ని నేతలకు అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు

కాశ్మీర్ నుండి మొదటిసారి

కాశ్మీర్ నుండి మొట్టమొదటిసారిగా ఐద్వా మహాసభకు ప్రతినిధులు హాజరయ్యారు. ఈ విషయాన్ని తన ప్రసంగంలో జాతీయ కార్యదర్శి మరియం దావలే తెలిపారు. ఈ మూడేళ్ల కాలంలో ఐద్వా దేశవ్యాప్తంగా 40వేల స్థానిక కమిటీలు, 700 జిల్లా కమిటీలు, 26 రాష్ట్ర మహాసభలు జరుపుకుందని చెప్పారు. కోటి మంది ప్రస్తుతం మహిళా సంఘంలో సభ్యులుగా ఉన్నారన్నారు.

వీరి తరపున 850 మంది ప్రతినిధులు హాజరయ్యారు. గత మహాసభ నుండి ఈ మహాసభ వరకు మరణించిన వారికి సంతాపం తెలుపుతూ అధ్యక్షులు మాలినీ భట్టాచార్య ప్రవేశపెట్టిన తీర్మానం ప్రవేశపెట్టారు. ప్రతినిధులు లేచి నిలబడి మౌనం పాటించి నివాళులర్పించారు.

ఆకట్టుకున్న స్వాగతగీతం

ప్రారంభ సభకు ముందు కేరళ రాష్ట్ర సంగీత శాఖ కళాకారులు పాడిన "ఎర్రపూలతో మహిళా శక్తికి స్వాగతం' అంటూ సాగిన స్వాగత గీతం ఆకట్టుకుంది.



ఐద్వా పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఆ సంఘం అధ్యక్షులు మాలిని భట్టాచార్య

సమైక్యపోరుతోనే సమానత్వం

(మొదటి పేజీ తరువాయి)

వెలుగుల కోసం వీటిని మరింత బలోపేతం చేయాలని అన్నారు. సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా క్యూబా ఎన్నో పోరా టాలు చేసిందని, ఇంకా చేస్తూనే ఉందని చెప్పారు. తమ దేశంలో నిర్ణయాధికారాల్లో మహి ళల పాత్రను పెంచడానికి ఎంతగానో కృషి చేస్తున్నట్లు తెలిపారను. . ప్రస్తుతం క్యూబా పార్లమెంటులో 52శాతం, రాష్ట్ర కౌన్సిల్స్ లో 53 శాతం మంది మహిళలు వున్నారని చెప్పారు. అలాగే 4 రాష్ట్రాలకు గవర్నర్లుగా, 12 మంది వైస్ గవర్నర్లుగా, 88 మంది అధ్యక్షులుగా, 58 మంది మేయర్లుగా మహిళలు ఉన్నట్లు తెలిపారు.

57 లక్షల సభ్యత్వం..

కేరళలో 57 లక్షల మంది ఐద్వాలో సభ్యులుగా చేరారని, ఇది దేశంలోనే రికార్డని మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు శ్రీమతి అన్నారు. ప్రస్తుతం మహాసభ జరుపుకుంటున్న తిరువనంతపురంలో ఎస్ఎఫ్ఐ మొట్టమొదటి జాతీయ మహాసభ 1970లో జరిగిందని చెప్పారు. ఈ ప్రాంతానికి చారిత్రాత్మకంగా కూడా ఎంతో గుర్తింపు ఉందన్నారు. ఎల్‌డిఎఫ్ పాలనలో మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేస్తున్నారని, అందువల్లే రెండవసారి కూడా ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సీనియర్ నాయకులు సుభాషిణి అలి, కేరళ మాజీ వైద్యశాఖ మంత్రి కె.కె.శైలజ, జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి, జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు వాసుకీ, సుధాసుందరరామన్, మల్లు లక్ష్మి, డి.రమాదేవి, ఐద్వా కేరళ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సుసాన్ కోడీ, సి.ఎస్.సుజాత పాల్గొన్నారు.





సభలో మాట్లాడుతున్న కేరళ కళామండలి డీమ్డ్ యూనివర్సిటీ ఛాన్సలర్, ప్రముఖ నృత్యకారిణి మల్లికా సారాబాయి, మాట్లాడుతున్న మరియం దావలే



మహాసభ వేదికపై ఎలైడా గువేరా, బృందాకరత్, తీస్తా సెతల్వాద్ తదితరులు

నేటి నుంచి బీహార్‌లో కులాల జనగణన

పాట్నా : బీహార్‌లో శనివారం నుంచి కులాల ఆధారిత సర్వే మొదటి దశ ప్రారంభం కానుంది. ఈ నెల 21వరకు ఈ దశ కొనసాగుతుంది. మొదటి దశలో రాష్ట్రంలోని మొత్తం కుటుంబాల సంఖ్య లెక్కించి, నమోదు చేస్తారు. రెండో దశలో కుటుంబాల్లో నివసించే వ్యక్తులు, వారి కులాలు, ఉప కులాలు, సామాజిక, ఆర్థిక పరిస్థితులు వంటి సమాచారాన్ని సేకరిస్తారు. ఏప్రిల్ 1 నుంచి 30వరకు రెండో దశ కొనసాగుతుంది. మొత్తంగా సర్వే మే 31తో ముగుస్తుంది. ప్రస్తుతం కొనసాగుతున్న తన సమాధాన్ యాత్రలో భాగంగా శుక్రవారం మీడియాతో ముఖ్యమంత్రి నితీష్ కుమార్ మాట్లాడుతూ, ఈ సర్వేతో రాష్ట్రంలో కులాలు, కమ్యూనిటీలపై సవివరమైన రికార్డు వుంటుందని చెప్పారు. వారి అభివృద్ధికి ఇది సహాయపడుతుందన్నారు. రాష్ట్రంలో కులాల వారీగా సర్వే జరగాలన్న అఖిలపక్షం డిమాండ్‌ను గతేడాది జూన్ 2న రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది.

ఎట్టకేలకు సిద్ధిఖి కప్పన్ సహ నిందితుడు విడుదల

లక్నో : కేరళ జర్నలిస్టు సిద్ధిఖి కప్పన్‌తో పాటూ అరెస్టయిన టాక్సీ డ్రైవర్ మహ్మద్ ఆలం 27మాసాల జైలు నిర్బంధం తరువాత గురువారం విడుదలయ్యారు. రాంపూర్‌కి చెందిన మహ్మద్ ఆలం (33)కు గతేడాది ఆగస్టులో, అక్టోబరులో రెండు కేసుల్లో బెయిల్ లభించింది. 2020 అక్టోబరు 5న యుపి పోలీసులు అరెస్టు చేసిన నలుగురిలో జర్నలిస్టు కప్పన్, ఆలంతోపాటు మరో ఇద్దరు పిఎఫ్ఐ సభ్యులు వున్నారు. వారిపై ఐటి చట్టంలోని పలు సెక్షన్ల కింద, దేశద్రోహ అభియోగాలపై, యుఎపిఎ కింద కేసులు నమోదయ్యాయి. సామూహిక అత్యాచారం అనంతరం మరణించిన దళిత మహిళ కేసుపై వార్తా కథనం ఇచ్చేందుకు హత్రాస్ వెళుతున్న కప్పన్‌తోపాటు టాక్సీ నడుపుతున్న ఆలం అరెస్టయ్యారు. అధికారుల అలసత్వం కారణంగా ఆలం రెండు నెలలు అదనంగా జైల్లో వుండాల్సి వచ్చిందని ఆయన తరపు న్యాయవాది మీడియాకు తెలిపారు. కావాలనే తన క్లయింట్‌ను ఎక్కువ కాలం జైల్లో వుంచేందుకు ఉద్దేశపూర్వకంగానే పూచీకత్తుల వెరిఫికేషన్ క్రమాన్ని జాప్యం చేశారని, ఎట్టకేలకు న్యాయం గెలిచిందని వ్యాఖ్యానించారు.

అగ్నిపథ్‌పై రాహుల్ ఆగ్రహం

పానిపట్ : అగ్నిపథ్ పథకం పేరుతో సైన్యంలో చేరాలనుకుంటున్న నిరుద్యోగులకు అన్యాయం చేసిన బిజెపి నాయకుల దేశభక్తిని అర్థం చేసుకోవాలని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రజలను కోరారు. మొదట అగ్నిపథ్ పథకాన్ని తనకు అర్థమయ్యేలా చెప్పాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఉత్తర ప్రదేశ్ నుంచి హర్యానాలో గురువారం సాయంత్రం ప్రవేశించిన రాహుల్‌గాంధీ జోడోయాత్ర శుక్రవారం పానిపట్ చేరుకుంది. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రెండు భారతదేశాలున్నాయని, ఒక దానిలో రైతులు, కార్మికులు, చిన్న దుకాణ దారులు, నిరుద్యోగులు తదితరులున్నారని చెప్పారు. దేశ సంపద అంతా కలిగిన 200 నుంచి 300 మందితో రెండో భారతదేశం ఉందని అన్నారు. పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి కేంద్ర ప్రభుత్వ విధానాలు కాదని, చిన్న, మధ్యతరగతి వ్యాపారులందరినీ నాశనం చేసేందుకు తీసుకొచ్చిన ఆయుధాలని చెప్పారు. 21వ శతాబ్దంలో నిరుద్యోగంలో హర్యానా ఛాంపియన్ అని, 38 శాతం నిరుద్యోగ రేటు ఉందని విమర్శించారు.



కులాంతర వివాహం చేసుకున్న జంటను సత్కరిస్తున్న టిఎన్‌యుఇఎఫ్ నాయకులు కె.రాధాకృష్ణన్

ఎస్‌సి, ఎస్‌టిలపై అత్యాచారాలను అరికట్టండి

- టిఎన్‌యుఇఎఫ్ డిమాండ్

చెన్నై : నేటికీ ఎస్‌సి, ఎస్‌టిలపై సాగుతున్న అత్యాచారాలు, అంటరానితనం, కుల దురహంకార హత్యలు, పాకీపని వంటి వాటిని అంతమొందించేందుకు తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని తమిళనాడు అస్పృశ్యతా నివారణా సమాఖ్య (టిఎన్‌యుఇఎఫ్) డిమాండ్ చేసింది. జనవరి 4, 5 తేదీల్లో చెన్నైలో టిఎన్‌యుఇఎఫ్ నాల్గవ రాష్ట్ర మహాసభ జరిగింది. సామాజికంగా అణగారిన వర్గాల కుటుంబాల్లోని వారు మరణించిన తర్వాత కూడా వివక్షకు గురవుతున్నారని, గౌరవప్రదంగా ఖననం నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ మహాసభ తీర్మానాన్ని ఆమోదించింది. ఉన్నత విద్యా సంస్థల్లో రిజర్వేషన్లను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మహాసభ డిమాండ్ చేసింది. కుల సంఘాల వ్యతిరేకతను లెక్కచేయకుండా కులాంతర వివాహాలు చేసుకున్న వందలాది జంటలను మహాసభ సత్కరించింది.

మహిళా శ్రమశక్తికి చెన్నై అనుకూలం

- ఉత్తరాదికంటే దక్షిణాది నగరాలే మెరుగు



న్యూఢిల్లీ : మహిళా శ్రామిక శక్తికి అనుకూలమైన నగరాల్లో చెన్నై తొలిస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానంలో పుణె, బెంగళూరు, హైదరాబాద్, ముంబయి నిలిచినట్లు ఓ అధ్యయనంలో తేలింది. మొత్తం మీద ఉత్తరాది నగరాల కన్నా దక్షిణాది నగరాలు మెరుగ్గా ఉన్నాయని ఆ సర్వే పేర్కొంది. భారత్‌లో పదిలక్షలకు పైగా జనాభా కలిగిన ప్రధాన నగరాలపై 'అవతార్' సంస్థ ఈ సర్వే చేపట్టింది. ఈ జాబితాలో దేశ రాజధాని ఢిల్లీ 14వ స్థానంలో ఉంది. జీవన సౌలభ్యం, భద్రత, మహిళల ప్రాతినిధ్యరేటు, మహిళా సాధికారత కార్యక్రమాలు అనే అంశాల ఆధారంగా అవతార్ ఈ సర్వే చేపట్టింది. వివిధ సంస్థలు, యాజమాన్యాలు మహిళలకు ఎంతవరకు సౌలభ్యతను అందిస్తున్నాయనే అంశంపైనా సర్వే నిర్వహించారు.

లక్ష కన్నా తక్కువ జనాభా కలిగిన చిన్న నగరాల్లో తమిళనాడులోని ఐదు నగరాలైన తిరుచిరా పల్లి, వెల్లోర్, ఈరోడ్, సేలం, తిరుప్పూర్ అత్యున్నత స్థానంలో నిలిచాయి. టాప్ 25 రాజధానుల్లో పది మాత్రమే అనుకూలమైన నగరాలుగా స్థానం సంపాదించాయి. సాధారణంగా రాష్ట్ర రాజధానులపై ప్రభుత్వాలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, పర్యావరణపరంగా, అభివృద్ధి పరంగా ప్రత్యేక శ్రద్ధను చూపుతాయని.. అలాంటి రాజధానుల్లో మహిళలకు భద్రత కల్పించడంలో ఎదురవుతున్న సమస్యలపై దృష్టి సారించాలని నివేదిక పేర్కొంది.

గే వివాహాలపై పిటిషన్లన్నీ సుప్రీంకు బదిలీ

న్యూఢిల్లీ : గే వివాహాలకు చట్టపరమైన గుర్తింపునకు సంబంధించి వివిధ హైకోర్టుల్లో పెండింగ్‌లో వున్న పిటిషన్లన్నింటినీ కలిపివేసి, సుప్రీంకోర్టుకు బదిలీ చేశారు. స్వలింగ వివాహంపై దాఖలైన పిటిషన్లకు ఫిబ్రవరి 15లోగా సమాధానం ఇవ్వాల్సిందిగా కేంద్రాన్ని సుప్రీంకోర్టు కోరింది. మార్చికల్లా అన్ని పిటిషన్లను లిస్ట్ చేయాల్సిందిగా ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ జె.బి.పార్ధివాలాలతో కూడిన బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఏ పిటిషనర్‌నూ వదిలిపెట్టడానికి లేదని, అన్ని పిటిషన్ల వివరాలను కొత్తగా రూపొందించే జాబితాలో పొందుపరిచేలా చూడాలని కేంద్రం తరపు న్యాయవాదిని బెంచ్ కోరింది. ఈ అంశంపై అధికారిక ప్రకటన కోసం సుప్రీంకే అన్ని కేసులు బదిలీ కావాలని కోరుకున్నామని పలువురు పిటిషనర్ల తరపు న్యాయవాదులు బెంచ్‌కు తెలిపారు. కేంద్రం కూడా తన స్పందనను సుప్రీంకు తెలియజేయాలని చెప్పారు. ప్రత్యేక వివాహ చట్టం కింద స్వలింగ వివాహాన్ని చట్టబద్ధం చేసేందుకు అనుమతించాలని కోరుతున్న పిటిషన్లపై ప్రభుత్వ స్పందనను ఉన్నత న్యాయస్థానం గతేడాది నవంబరు 25న కోరింది. ఇదిలావుండగా, గతేడాది డిసెంబరు 6న ఢిల్లీ హైకోర్టులో పలు పిటిషన్లపై జరుగుతున్న విచారణను ఈ ఏడాది ఏప్రిల్ 24కి వాయిదా వేశారు.

కంఝువాలా కేసులో మరొకరి అరెస్టు

న్యూఢిల్లీ : ఈ నెల 1న తెల్లవారుజామున సుల్తాన్‌పురి వద్ద బైకుపై వెళ్తున్న 20 ఏళ్ల యువతిని కారుతో ఢీకొట్టి 12 కిలోమీటర్ల మేర ఈడ్చుకెళ్లిన ఘటనలో ఆరో నిందితుడిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పటికే ఐదుగురు నిందితులను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో పోలీసులకు తప్పుడు సమాచారమిచ్చిన అశుతోష్‌ని శుక్రవారం అరెస్టు చేశామని, తదుపరి విచారణ కొనసాగుతోందని స్పెషల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్) సాగర్ ప్రీత్ హుడా తెలిపారు. ఈ కేసులో ఇంతకుముందు అరెస్టయిన ఐదుగురు నిందితులు అశుతోష్ వద్ద కారు తీసుకున్నారు. ఈ ఘటనలో నిందితులను రక్షించేందుకు ప్రయత్నించిన మరో ఇద్దరిని వెతుకుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలోని నిందితులు దీపక్ ఖన్నా (26), అమిత్ ఖన్నా (25), క్రిషన్ (27), మిథున్ (26), మనోజ్ మిట్టల్‌లను పోలీసులు అరెస్టు చేశారు. సిసి టివి ఫుటేజీ, కాల్ రికార్డులను పరిశీలించిన తర్వాత మరో ఇద్దరు నిందితులు.. ఐదుగురు నిందితులను కాపాడే ప్రయత్నంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ ఇద్దరు నిందితులు అశుతోష్, అంకుష్ ఖన్నాగా పోలీసులు గుర్తించారు. అంకుష్.. నిందితుడు అమిత్‌ఖన్నాకు సోదరుడు. ఈ ఘటనలో కారు నడిపిన అమిత్‌ఖన్నాకు డ్రైవింగ్ లైసెన్స్ లేదు. కారు ప్రమాదం తర్వాత అమిత్ సోదరుడు.. అంకుష్‌కి సమాచారమివ్వగా.. ఆ నేరాన్ని దీపక్ అనే గ్రామీణ సేవా డ్రైవర్‌పై మోపినట్లు పోలీసులు చెప్పారు.

ఢిల్లీలో 4 డిగ్రీల ఉష్ణోగ్రత

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీని చలి వణికిస్తోంది. శుక్రవారం 4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు ఢిల్లీ ప్రాథమిక వాతావరణ కేంద్రం వెల్లడించింది. అలాగే నైరుతి ఢిల్లీలోని ఆయనగర్‌లో 1.8 డిగ్రీల కనిష్ఠ ష్ణోగ్రత నమోదైందని, తీవ్రమైన చలిగాలులు వీచాయని భారత వాతావరణశాఖ వెల్లడించింది. ఇక దేశంలోని మిగతా ప్రాంతాలైన డల్హౌసి 8.7, ధర్మశాల 5.4, సిమ్లా 6.2, డెహ్రాడూన్ 4.4, ముస్సోరి 6.4, నైనిటాల్ 6.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. వీటిన్నింటికంటే కనిష్ఠ ఉష్ణోగ్రత ఢిల్లీలోనే నమోదైనట్లు ఐఎండి పేర్కొంది. వాయువ్య భారతాన్ని దట్టమైన పొగమంచు కప్పేయడంతో రైళ్లు, విమాన రాకపోకలకు అంతరాయమేర్పడింది. ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తీవ్రమైన చలి వాతావరణ పరిస్థితుల కారణంగా ఢిల్లీకి రావాల్సిన 30 విమానాలు, 26 రైళ్లు ఆలస్యంగా చేరుకున్నాయని అధికారులు వెల్లడించారు.

తైవాన్ జలసంధి మీదుగా అమెరికా యుద్ధ నౌక !

- చైనా ఆగ్రహం

వాషింగ్టన్ : చైనా, తైవాన్ మధ్య మరింత ఉద్రిక్తతలు పెంచేందుకు ప్రయత్నిస్తున్న అమెరికా తాజాగా మరోసారి అందుకు తెగబడింది. తైవాన్ జలసంధి మీదుగా అమెరికా యుద్ధ నౌక గురువారం ప్రయాణించింది. ఇది రొటీన్ కార్యక్రమంగా అమెరికా మిలటరీ పేర్కొనగా, చైనా ఈ చర్య పట్ల ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవలి సంవత్సరాల్లో అమెరికా యుద్ధ నౌకలే కాదు, మిత్ర దేశాలైన బ్రిటన్, కెనడా వంటి దేశాల యుద్ధ నౌకలు కూడా తైవాన్ జలసంధి మీదుగా ప్రయాణిస్తూ, చైనాను రెచ్చగొడుతున్నాయి. అర్లేగ్ బుర్కె తరగతికి చెందిన గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్ చుంగ్-హూన్ తైవాన్ జలసంధిలో ప్రయాణించిందని అమెరికా మిలటరీ ఒక ప్రకటనలో తెలియజేసింది. దీనిపై వాషింగ్టన్‌లోని చైనా ఎంబసీ ప్రతినిధి లియూ పెంగ్యూ ఒక ప్రకటన చేశారు. ఈ చర్యను చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తోందని చెప్పారు. ఇటువంటి రెచ్చగొట్టే చర్యలను, ఉద్రిక్తతల పెంపును, తైవాన్ జలసంధి వ్యాప్తంగా శాంతి సుస్థిరతకు విఘాతం కలిగించడాన్ని తక్షణమే ఆపాల్సిందిగా అమెరికాను కోరారు. నౌకల స్వేచ్ఛా రాకపోకల పేరుతో అమెరికా యుద్ధ నౌక తరచుగా ఇటువంటి చర్యలకు దిగుతోందని, ఈ ప్రాంతాన్ని స్వేచ్ఛగా, పారదర్శకంగా వుంచడమంటే ఇది కాదని ఆ ప్రకటన పేర్కొంది. చైనా అప్రమత్తతను కొనసాగిస్తుందని, ఏ సమయంలోనైనా బెదిరింపులు, రెచ్చగొట్టే చర్యలకు దీటుగా స్పందించడానికి సిద్ధంగా వుందని పెంగ్యూ పేర్కొన్నారు. చైనా జాతీయ సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించుకుంటామని చెప్పారు.

800 మంది రష్యా సైనికుల మృతి

- ఉక్రెయిన్ సైన్యం ప్రకటన

కీవ్ : ఉక్రెయిన్ సైన్యం బుధవారం జరిపిన దాడిలో 800మంది రష్యన్ సైనికులు మరణించినట్లు ఉక్రెయిన్ పేర్కొంది. ఎక్కువమంది తూర్పు డాంటెస్క్ ప్రాంతంలో జరిగిన పోరులోనే మరణించారని గురువారం ఉక్రెయిన్ మిలట్రీ తెలిపింది. రష్యన్ సైనికులతోపాటు ఒక విమానాన్ని, హెలికాప్టర్‌ను, మూడు ట్యాంకులను ధ్వంసం చేశామని పేర్కొంది. రష్యా జరుపుతున్న దాడుల్లో తమవైపు చాలామంది సామాన్య పౌరులు కూడా మరణించారని కీవ్ తెలిపింది. రష్యా ఈ వార్తలను ఖండించింది. ఉక్రెయిన్ కావాలనుకుంటున్న ట్యాంకులకు బదులుగా సాయుధ వాహనాలను సరఫరా చేస్తామని మిత్రపక్షాలైన పశ్చిమ దేశాలు హామీ ఇచ్చాయి.

అమల్లో రష్యా కాల్పుల విరమణ : దాడులు జరిగాయన్న ఉక్రెయిన్

36గంటల పాటు కాల్పుల విరమణను ప్రకటిస్తున్నామని రష్యా అధ్యక్షుడు గురువారం పుతిన్ ప్రకటించినప్పటికీ శుక్రవారం తూర్పు ఉక్రెయిన్‌లోని బకమట్ నగరంలో బాంబుల మోత కొనసాగుతూనే వుందని మీడియా వార్తలు తెలిపాయి. ఈ నెల 7వ తేదీన ఆర్థడాక్స్ క్రిస్మస్ సందర్భంగా 36గంటల పాటు కాల్పులను నిలిపివేయాలని పుతిన్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు ఈ నెల 8 తెల్లవారు జాము వరకు అమల్లో వుంటాయి. కాల్పుల విరమణ అని ప్రకటించినా మాస్కో బలగాలు ఖెర్సాన్, క్రామాటార్స్క్ నగరాలపై దాడి చేశాయని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు.

రహదారుల భద్రతపై పర్యవేక్షణకు
రెండు వారాల్లోగా నిబంధనలు

- భద్రతా కమిటీకి సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ : అన్ని రాష్ట్రాల్లోనూ రహదారుల భద్రతను ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా పర్యవేక్షించేందుకు, అమలు చేసేందుకు రాష్ట్రాల వారీగా మార్గదర్శకాలను రూపొందించేందుకు ఒక ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాలని, ఇందుకోసం రెండు వారాల్లోగా కేంద్ర రోడ్డు రవాణా కార్యదర్శిని కలవాల్సిందిగా రహదారుల భద్రతపై వేసిన కమిటీని సుప్రీం కోర్టు శుక్రవారం ఆదేశించింది. ఈ కమిటీకి సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎ.ఎం.సాప్రే నాయకత్వం వహిస్తున్నారు. భారతదేశంలో రహదారులపై జరిగే ప్రమాదాలకు వాహన వేగమే ప్రధాన కారణమని సుప్రీం కోర్టు భావిస్తోంది. మోటారు వాహనాల చట్టం, 1988లోని సెక్షన్ 136ఎ (ఎలక్ట్రానిక్ పర్యవేక్షణ, రహదారుల భద్రత అమలు)ను అమలు చేసేందుకు అత్యవసరంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుందని ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ పేర్కొంది. జాతీయ, రాష్ట్ర రహదారులపై, దేశవ్యాప్తంగా నగరాలు, పట్టణాల్లో రహదారులపై ప్రమాదకరంగా వాహనాలు నడిపే డ్రైవర్లపై నిఘా వుంచేందుకు గానూ 2019లో ఈ చట్టంలో ఈ నిబంధనను ప్రవేశపెట్టారు. సెక్షన్ 136ఎలోని సబ్ సెక్షన్ 2 కింద ప్రభుత్వం ఇప్పటికే నిబంధనలు రూపొందించిందని కేంద్రం తరపు అదనపు సొలిసిటర్ జనరల్ మాధవి దివాన్ తెలిపారు. మితిమీరిన వేగం అమాయకుల ప్రాణాలను తీస్తోందని పిటిషనర్ రాజశేఖరన్ తరపు న్యాయవాది కెవి జైన్ పేర్కొన్నారు.

శిక్షణ విమానం కూలి పైలెట్ మృతి

భోపాల్ : మధ్యప్రదేశ్‌లోని రేవా జిల్లాలో శిక్షణ విమానం కూలిపోవడంతో, పైలెట్ మరణించినట్లు శుక్రవారం అధికారులు తెలిపారు. మరో ట్రైనీ పైలెట్ గాయపడినట్లు వెల్లడించారు. రాజధాని భోపాల్‌కు 400 కిలోమీటర్ల దూరంలో గురువారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. శిక్షణ సమయంలో యుద్ధవిమానం ఆలయ గోపురం, చెట్టుని ఢీకొట్టడంతో కూలిపోయిందని చొరహట్టా ఇన్‌ఛార్జ్ తెలిపారు. ఈ ప్రమాదంలో కెప్టెన్ విశాల్ యాదవ్ (30) మరణించగా, ట్రైనీ పైలెట్ అన్షుల్ యాదవ్ గాయపడ్డారని చెప్పారు.

కొలీజియాన్నే ఖాతరు చేయరా?

(మొదటి పేజీ తరువాయి)

లేకుండా వ్యవహరించారు" అని జస్టిస్ కౌల్ గుర్తు చేశారు. కొలిజియం వ్యవస్థకు వ్యతిరేకంగా కొంతమంది న్యాయమూర్తుల అభిప్రాయాలను ఉటంకిస్తూ, కొలిజియం ప్రతిపాదించిన పేర్లను ఆమోదించకుండా ఆలస్యం చేయడానికి ప్రభుత్వం ఒకసాకుగా చూపుతుందని అన్నారు. "ప్రతి వ్యవస్థకు దాని సొంత లోపాలు ఉంటాయి. ప్రస్తుత చట్టాన్ని అనుసరించాలి. కొత్త వ్యవస్థను తీసుకురావాలనుకుంటే, చట్టసభలను ఎవరూ అడ్డుకోలేరని' పేర్కొన్నారు.

మూడు రోజుల్లో 44 మంది న్యాయమూర్తుల నియామకానికి ఆమోదం : అటార్నీ జనరల్

మూడు రోజుల్లో 44 మంది న్యాయమూర్తుల నియామకానికి ఆమోదం ఇస్తామని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి మాట్లాడుతూ సుప్రీంకోర్టు నిర్ణయించిన గడువుకు అనుగుణంగా న్యాయస్థానాల్లో నియామకాల సిఫార్సులను ఆమోదించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. హైకోర్టులకు సంబంధించి కొలిజియం చేసిన 104 సిఫార్సులలో 44ని ప్రాసెస్ చేసి రెండు మూడు రోజుల్లో సుప్రీంకోర్టుకు పంపే అవకాశం ఉందని తెలిపారు. రాజస్థాన్ హైకోర్టులో, కేంద్ర ప్రభుత్వం వద్ద 10 కొలిజియం సిఫార్సులు పెండింగ్‌లో ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. ఈ అంశాన్ని పరిశీలిస్తున్నందున వాయిదా వేయాలని అటార్నీ జనరల్ అభ్యర్థించారని పేర్కొంటూ తదుపరి విచారణను ఫిబ్రవరి 3కి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. 2021లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం హైకోర్టులు న్యాయమంత్రిత్వశాఖకు పంపిన పేర్లను ప్రభుత్వం పరిశీలించి, తుది ఆమోదం కోసం సుప్రీంకోర్టు కొలిజియానికి పంపించేందుకు 18 వారాల గరిష్ఠ గడువు ఇచ్చింది.

ప్రముఖ శాస్త్రవేత్త లూయీ పాశ్చర్

పిల్లలూ, వ్యాధులకు కారణమైన సూక్ష్మక్రిములని కనుగొన్న శాస్త్రవేత్త లూయీ పాశ్చర్ గురించి ఈ రోజు తెలుసుకుందామా!



పాశ్చర్ 1822 డిసెంబరు 27న ఫ్రాన్స్‌లో డోల్ గ్రామంలో జన్మించాడు. నెపోలియన్ సైన్యంలో పనిచేసిన తండ్రి జీన్ పాశ్చర్ తోలు వ్యాపారం చేసి జీవించేవారు. పాశ్చర్ బాల్యంలో పాఠశాలకు వెళ్ళకుండా ఇంటి దగ్గరే ఉండి చదువుకునేవారు. చిత్రలేఖనంలో మంచి ప్రతిభ కనపరిచేవాడు. తల్లిదండ్రులతో పాటు ఇరుగు పొరుగు వారివి, స్నేహితులవి బొమ్మలు పెయింట్ చేశాడు. చాలా చిత్రాలు ఇప్పటికీ పాశ్చర్ మ్యూజియంలో భద్రపరచబడ్డాయి. గణితం, భౌతిక, రసాయనిక శాస్త్రాలంటే ఇష్టమున్న పాశ్చర్ ఆ పుస్తకాలను నిత్యం అధ్యయనం చేసేవారు. పదహారేళ్ల వయసులో కాలేజీ చదువు కోసం పారిస్‌కు వెళ్లి, డాక్టరేట్ పూర్తిచేసి 1848లో స్ట్రాస్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అమ్మాయి మేరీ లారెంట్‌ను పెళ్ళిచేసుకున్నారు. వీరికి అయిదుగురు పిల్లలు. టైఫాయిడ్ వల్ల ఇద్దరు, మశూచి వల్ల ఒక పిల్లని పోగొట్టుకొన్నారు.

పాశ్చర్ అధ్యాపకులుగా కొనసాగుతూనే తన పరిశోధనలు చేశారు. అంగారక పదార్థాలు ధ్రువిత కాంతిని ఏ విధంగా విచలనం చెందిస్తాయో అధ్యయనం చేసి 'స్టీరియో కెమిస్ట్రీ' అనే కొత్త రసాయన శాస్త్రాన్ని రూపొందించారు. తర్వాత తన పరిశోధనలను పులియడం (ఫెర్మెంటేషన్) వంటి అంశాలపై కొనసాగించి సూక్ష్మక్రిములపై పరిశోధనలు చేసి, కొత్త సిద్ధాంతాలను రూపొందించాడు. కోళ్ళకు వచ్చే కలరా వంటి పారుడు వ్యాధిపై పరిశోధన జరిపి వ్యాధికారకాలైన సూక్ష్మజీవులను బలహీనపరిచేలా మందు కనుగొన్నారు. పిచ్చికుక్క కాటు వల్ల వచ్చే రేబీస్ వ్యాధికి మందు కనిపెట్టడం లూయిస్ పాశ్చర్ సాధించిన శాస్త్ర విజయాలలో ప్రధానాంశం. 1870 దశాబ్దంలో టీకా పద్ధతులను పశువులలో వచ్చే ఆంత్రాక్స్ వ్యాధి మీద ప్రయోగించాడు. ఈ విధంగా కొన్ని ప్రాణాంతక వ్యాధులకు సూక్ష్మక్రిములు కారణాలన్న విషయాన్ని నిరూపించాడు. రెండు సార్లు గుండెపోటు, పక్షవాతం వచ్చినా జీవితాంతం పరిశోధన చేసి మానవాళికి వెలకట్టలేని సేవ చేసిన పాశ్చర్ 1895 సెప్టెంబరు 28న మరణించారు.

ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి పక్కనే వాటి పేర్లూ ఉన్నాయి. అయితే, స్పెల్లింగ్‌లో కొన్ని అక్షరాలు లేవు. వాటిని నింపండి.

D_g
Dr_g_n
D_lp_in
De_k
De_r
D_um
D_ck
D_a_y

నేను గీసిన బొమ్మ



- టి. స్వప్న,
7వ తరగతి,
ఇంగ్లీష్ మీడియం జడ్పీహెచ్‌ఎస్,
హవేలీ, ఘనాపూర్, మెదక్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఉన్నత భావాలు గల కుటుంబంలో పుట్టిపెరిగింది ఆమె. తాత అమ్మమ్మల గారాలపట్టిగా బాల్యంలో ఎన్నో మధురస్మృతులు విజయవాడతో పెనవేసుకున్నాయి. అమ్మా నాన్నల ఈ కలల బంగారం ఎంతో ఓర్పు.. నేర్పు పుణికిపుచ్చుకున్న ఉన్నత వ్యక్తిత్వం సంతరించుకొంది. వైద్య పరికరాల నాణ్యతా విశ్లేషణలో రెగ్యులేటరీ రిపోర్టింగ్ రైటింగ్‌లో విశేష ప్రతిభ కనబరుస్తున్న ఆమె పేరు డాక్టర్ కొండపల్లి సాహితి. హైద్రాబాద్‌లో ఉంటున్నా.. విజయవాడ ప్రజాశక్తితో తమ అనుబంధాన్ని ఎప్పుడూ నెమరువేసుకునే సాహితి ఆ పత్రిక మొట్టమొదటి ప్రెస్ మిషను నిర్వాహకులు లంకా జోగారావు మనవరాలు. 'కన్నమ్మ అని ముద్దుగా పిలుచుకునే ఎంతోమంది బాబాయిలు, మామయ్యలు, అత్తయ్యలు ప్రజాశక్తిలో నాకు ఇప్పటికీ ఉన్నారు. ఎంత ఉన్నత స్థానానికి వెళ్లినా జోగారావు మనవరాలిగా గుర్తింపు పొందటమే నాకు చాలా గర్వంగా ఉంటుంది' అంటున్న సాహితి ఇటీవల 'లీడర్ ఫోరం లీడర్' నుండి ఉమెన్ లీడర్ అవార్డు ఇన్ లీడర్‌షిప్ అందుకున్న సందర్భంగా జీవనతో ఎన్నో విషయాలు ముచ్చటించారు.

వైద్య రచనలో ధీశాలి మన సాహితి..



వినత, పావన్‌ల ముద్దుబిడ్డైన సాహితి ఆరు నెలల వయసు నుంచే అమ్మమ్మ, తాతయ్యల దగ్గర పెరిగారు. పటమట నిర్మల హైస్కూల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. చెన్నయ్ ఎస్‌ఆర్‌ఎం కాలేజీలో బిడిఎస్ చదివారు. కొంతకాలం దంతవైద్యులుగా పనిచేసిన ఆమెకు మామయ్య వరుస అయ్యే డాక్టర్ మిత్ర పుచ్చలపల్లి, హెచ్‌ఎంఆర్‌ఐలో క్లినికల్ రీసెర్చ్ బోధించే డైరెక్ట్ రిపోర్టింగ్ మేనేజర్ డాక్టర్ దయాకర్‌ల ప్రోద్బలంతో క్లినికల్ రీసెర్చ్ వైపు అడుగులు వేశారు. అలా 2010లో లండన్ క్రేనీఫీల్డ్ యూనివర్శిటీ నుంచి క్లినికల్ రీసెర్చ్‌లో పీజీ పూర్తిచేశారు. భారత్‌లో మెడికల్ రైటింగ్ (వైద్య రచన) ప్రారంభమైన తొలిరోజుల నుంచే సాహితి విజయప్రస్థానం మొదలైంది.



మెడికల్ రైటింగ్ గురించి మాట్లాడుతూ.. 'ఈ విధానం కొత్తదేమీ కాదు. ఎప్పటినుంచో వుంది. ఏదేని వైద్య ఉపకరణం మార్కెట్లోకి అడుగు పెట్టాలంటే మెడికల్ రైటర్ల ప్రమేయం కచ్చితంగా కావాలి. వైద్యవిధానంలో ఔషధాలు, పరికరాలు ఎంతో కీలకంగా ఉంటాయి. మెడికల్ రైటర్స్ ఆయా వైద్య పరికరాల వైద్యపరమైన మూల్యాంకనం, విశ్లేషణాత్మక నివేదికలను రెగ్యులేటరీ అథారిటీలకు అందిస్తారు. అయితే ఈ అథారిటీలు ప్రతి ఏడాది కొత్త మార్గదర్శకాలను రూపొందిస్తుంటాయి. దీంతో మేం కూడా ఎప్పటికప్పుడు కొత్త అధ్యయనాలు చేయాల్సివస్తుంది' అని చెబుతున్నారు. తన కెరీర్ ఆరంభం నుంచి ఇప్పటివరకు ఆబట్, అబయోమెడ్, బ్రాన్, బాక్స్‌టర్ వంటి 42 ప్రముఖ కంపెనీలకు మెడికల్ రైటర్‌గా వ్యవహరించారు. తన విధుల విస్తృతి గురించి ఇంకొంచెం వివరంగా ఇలా చెబుతున్నారు..

'కంపెనీలు మాకు అందించే డేటా ఆధారంగా మా రైటింగ్స్ మొదలవుతాయి. ముందుగా మార్కెట్లో అప్పటికే వాడుకలో ఉన్న ఉత్పత్తులతో సరిపోల్చుతూ వాటికంటే ఇది ఎంత ఉత్తమమైనదో.. సురక్షితమైనదో అన్న దిశగా నివేదికలు తయారుచేస్తాం. దాదాపు వందకు పైగా 250 పేజీల వరకు నివేదికలు సమర్పించాల్సి వస్తుంది. నిర్ణీత సమయంలో పూర్తి చేసిన ఈ నివేదికలను ఆయా కంపెనీలు రెగ్యులేటరీ అథారిటీకి పంపించి అనుమతి పొందుతాయి. ఇలా మేము కార్డియో వ్యాస్కులర్, న్యూరోవ్యాస్కులర్, స్కిన్, డెంటల్... తదితర విభాగాలకు చెందిన ఉత్పత్తులు, ఔషధాలకు సంబంధించిన నివేదికలు తయారుచేస్తాం. రెగ్యులేటరీ అథారిటీ గురించి



వివరిస్తూ... 'వైద్యపరంగా ఏదేనీ ఔషధం, పరికరం మార్కెట్లోకి విడుదల కావాలంటే ఎఫ్‌డిఎ లాంటి నోటిఫైడ్ బాడీ అనుమతి పొందాలి. ఆ అనుమతి పొందేందుకు ఆయా కంపెనీలు మెడికల్ రైటర్స్‌ను సంప్రదిస్తారు. ప్రారంభంలో రైటింగ్ స్టైల్‌ను అలవరుచుకోడానికీ, రెగ్యులేటరీ అథారిటీ మార్గదర్శకాలను అర్థం చేసుకోడానికి కొంత శ్రమ పడ్డాను. కొన్ని సందర్భాల్లో కంపెనీలు సమర్పించే నివేదికల పట్ల రెగ్యులేటరీ అథారిటీ అభ్యంతరాలను, అనుమానాలను వ్యక్తం చేస్తుంది. అలాంటప్పుడు అథారిటీని ఒప్పించేలా ఇంకొంత నాణ్యమైన సమాచారాన్ని అందించాలి' అంటున్న సాహితి ప్రస్తుతం క్రైటీరియన్ ఎడ్జ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. అమెరికా, స్విట్జర్లాండ్, టర్కీ, ఆస్ట్రేలియా... ఇలా ప్రపంచవ్యాప్తంగా 42 నుంచి 50 మంది వ్యక్తుల బృందానికి నాయకత్వం వహిస్తున్నారు.

మెడికల్ రైటర్‌గా కెరీర్‌లో మొదట చాలా ఒత్తిడికి గురయ్యాను అంటున్న సాహితి గ్లోబల్ హాస్పిటల్‌లో జూనియర్ డ్యూటీ డాక్టర్‌గా పనిచేశారు. ఆ తరువాత హెల్త్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో మెడికల్ అడ్వైజర్‌గా విధులు నిర్వర్తించారు. నాణ్యమైన వైద్య సలహాలు అందించే ఈ విభాగంలో దాదాపు 450 మందికి శిక్షణ ఇచ్చిన నైపుణ్యం ఆమెది.


పుస్తకాలు చదవడమంటే ఇష్టమని చెప్పే సాహితి నిరుపేద పిల్లలకు విద్య అందించేందుకు ముందుంటానంటున్నారు. తనను తాను అన్వేషించుకోవడమే ఉత్తమ మార్గమని భావిస్తానంటారు. సంఘర్షణలు ఆమెకు కొత్త కాదు. వాటిని చూసి బెదిరిపోకుండా ముందుకడుగేయడమే ఆమె లక్షణం. అనివార్య కారణాలతో వివాహబంధం నుంచి విడిపోయిన తనను కుటుంబం, స్నేహితులు ఎంతో ఆదరించారని చెబుతారు. అమ్మా, నాన్న ఈ విషయంలో ఇచ్చిన మద్దతు తనను ఎంతో ఆత్మస్థైర్యంతో నిలబడేలా చేసిందంటారు. వారు నడిచిన మార్గం, వారి సహచరులు, స్నేహితులు ఎల్లప్పుడూ తనని కనిపెట్టుకుని ఉండేవారని చెబుతారు. ఆడపిల్ల ఉన్నత స్థానాలకు ఎగబాకాలంటే ముందుగా కుటుంబం ప్రోత్సాహం కావాలంటారు. ఆడపిల్లకు పెళ్లి చేస్తే పనైపోయిందనుకోకుండా తన మంచీ,చెడు కనిపెట్టుకునే తల్లిదండ్రులు ఉన్న ఆడపిల్లలు తనలా ఉన్నతశిఖరాలు అధిరోహించగలరని ఒకింత గర్వంగా చెబుతున్నారు.

ఆరోగ్య సంరక్షణలో కీలక భూమిక పోషించే ఈ రంగంలో లక్ష్యాలను సాధించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్న సాహితి మార్పుకు నాయకత్వం వహించడం, ఉత్తమ ఫలితాలు అందించేలా బృందాలను నడిపించడంలో ఎప్పుడూ ముందుంటారు. ఆమె శక్తివంతమైన ఈ ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం.

- జ్యోతిర్మయి

రంగవల్లి

మా చిరునామా
రంగవల్లి
ప్రజాశక్తి దినపత్రిక ,
ప్రజాశక్తి భవనం
అరవింద హైస్కూలు దగ్గర,
అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా.
మెయిల్ ఐడి : jeevana-pageps@gmail.com
వాట్సాప్ : 83329 25496



16 చుక్కలు
4 వరుసలు
4 వచ్చేవరకు
(సరి చుక్క)




గుడిపాటి నాగ లలిత,
విజయవాడ.

21 చుక్కలు
11 వచ్చేవరకు
(మధ్య చుక్క)



జల్లి కృషిక,
రెడ్డికుంట,
రెడ్డిగూడెం,
కృష్ణాజిల్లా.



చరిత్రలో నిలిచే సినిమా 'వీర సింహారెడ్డి'



'వీర సింహారెడ్డి' ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో మాట్లాడుతున్న బాలకృష్ణ

- అట్టహాసంగా ప్రీ రిలీజ్ ఫంక్షన్
- భారీగా తరలివచ్చిన అభిమానులు

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్


ఎమోషనల్ బ్యాక్‌డ్రాప్‌తో ఫ్యాక్షన్‌కు కొత్త భాష్యం చెబుతూ చరిత్రలో నిలిచిపోయే సినిమాగా 'వీర సింహారెడ్డి' నిలుస్తుందని ప్రముఖ హీరో నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన 'వీర సింహారెడ్డి' ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఒంగోలులోని అర్జున్ ఇన్‌ఫ్రాలో శుక్రవారం రాత్రి అట్టహాసంగా జరిగింది. ఈ ఫంక్షన్‌కు ఉభయ రాష్ట్రాలు, చెన్నై, బెంగళూరు, అమెరికా వంటి దేశాల నుంచి బాలయ్య అభిమానులు తరలిరావడంతో పండగ వాతావరణం నెలకొంది. జై బాలయ్య నినాదాలతో ప్రాంగణమంతా మారుమోగింది. ఈ ఫంక్షన్‌కు వ్యాఖ్యతగా ప్రముఖ యాంకర్ సుమ వ్యవహరించారు. వీర సింహారెడ్డి ట్రైలర్‌ను ప్రముఖ దర్శకులు బి.గోపాల్ ఆవిష్కరించి మాట్లాడుతూ ఎం.నిడమానూరు తమ స్వగ్రామమని, తాను ఎన్‌టిఆర్ వీరాభిమానని తెలిపారు. వీరసింహారెడ్డి సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ సినిమాలో పాత్రలకు ఎంపిక చేసిన నటులు, నటీమణులు అద్భుత నైపుణ్యాన్ని కనిపించారన్నారు. కర్ణాటక రాష్ట్రంలో హీరోగా ఉచ్చ స్థితిలో ఉన్న దునియా విజయ్ ఈ సినిమాలో ప్రతినాయకునిగా తన నటనతో ప్రేక్షకులను మెప్పిస్తారని పేర్కొన్నారు. హీరోయిన్ శ్రుతి హాసన్ తనదైన నటనతో ప్రేక్షకులను రంజింపజేస్తుందన్నారు. మరో హీరోయిన్, మలయాళ అమ్మాయి హని రోజ్ తన తొలి చిత్రంలోనే అద్భుత నటనను కనపరిచిందని పేర్కొన్నారు. ఈ చిత్రం అద్భుత విజయాన్ని అందుకుంటుందనడంలో ఎలాంటి సందేహమూ లేదన్నారు. హీరోయిన్ శ్రుతి హాసన్ మాట్లాడుతూ సినిమాలో హీరో బాలకృష్ణ ఇచ్చిన ప్రోత్సాహం మరువలేనిదని తెలిపారు. డైరెక్టర్ మలినేని గోపిచంద్ మాట్లాడుతూ హీరో బాలకృష్ణ ఇమేజ్, అభిమానులకు అంచనాలకు అనుగుణంగా సినిమా ఉంటుందన్నారు. నిర్మాతలు నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మాటల రచయిత సాయి మాధవ్ బుర్రా, ఫైట్ మాస్టర్ రామ్ లక్ష్మణ్, సింగర్ మనో, నటులు అజయ్ ఘోష్, సప్తగిరి, హీరోయిన్ హని రోజ్, ప్రత్యేక గీతం చేసిన చంద్రిక రవి ప్రసంగించారు. చంద్రిక రవి చేసిన 'మా బావ మనోభావాలు దెబ్బతిన్నాయ్' ప్రత్యేక గీతం ఆకట్టుకుంది. సినిమాలో సుగుణ సుందరి, మా బావ మనోభావాలు దెబ్బతిన్నాయ్ పాటలను గాయకులు, గాయనీలు ఆలపించి అలరించారు. సినిమాలోని పాటలకు ఉదయ్ మాస్టర్, రామ్ మాస్టర్ బృందాలు చేసిన నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

స్టార్ టెక్నీషియన్ సునీల్ మృతి



సినీ పరిశ్రమలో మరో విషాదం నెలకొంది. కేరళకు చెందిన ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్, ప్రొడక్షన్ డిజైనర్ సునీల్ బాబు(50) మరణించాడు. మూడు రోజుల క్రితం కాలు వాపు రావడంతో ఎర్నాకులంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన సునీల్‌బాబుకు ఆకస్మాత్తుగా గుండెపోటు రావడంతో గురువారం రాత్రి మరణించారు. ఈయన మరణం పట్ల దక్షిణాది సినీ పరిశ్రమ సంతాపం ప్రకటించింది. ఆయనకు భార్య, ఒక కూతురు ఉన్నారు. ఆర్ట్ డైరెక్టర్ సాబు సిరిల్ దగ్గర అసిస్టెంట్‌గా సునీల్ బాబు సినిమా రంగంలోకి ప్రవేశించారు. పలు సినిమాలకు ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేసి గుర్తింపు సంపాదించారు. గతేడాది రిలీజైన 'సీతారామం' సినిమాకూ పనిచేశారు. సంక్రాంతికి రిలీజ్ కానున్న 'వారసుడు' సినిమాకు కూడా సునీల్ ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేశాడు. ఇదే ఆయన చివరి చిత్రం.

'ఉమాపతి' అప్‌డేట్



చైల్డ్ ఆర్టిస్టుగా కెరీర్ ప్రారంభించిన అవికాగోర్ తెలుగులో చాలా సినిమాల్లో నటించారు. ఆమె హీరోయిన్‌గా నటిస్తోన్న చిత్రం 'ఉమాపతి'. అనురాగ్ హీరోగా నటిస్తున్నాడు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ షేర్ చేశారు మేకర్స్. ఈ చిత్రంలో బుట్ట ఫస్ట్ సాంగ్ లిరికల్ వీడియోను జనవరి 7న లాంచ్ చేయనున్నట్టు తెలియజేశారు. దీనికి సంబంధించిన స్పెషల్ పోస్టర్ కూడా విడుదల చేశారు. లంగావోణి లుక్‌లో ఉన్న అవికాగోర్ హీరోతో కలిసి పచ్చని పంట పొలాల మధ్య నడుస్తున్నారు. పాట ఎలా ఉండబోతుందో హింట్ ఇస్తూ పోస్టర్ విడుదల చేశారు. యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సత్య ద్వారపూడి డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ చిత్రాన్ని కృషి క్రియేషన్స్ అవికా స్క్రీన్ క్రియేషన్స్ బ్యానర్లపై కే కోటేశ్వర్ రావు నిర్మిస్తున్నారు.

జనవరి 20 'ఏటిఎం'

దిల్ రాజు వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా నిర్మిస్తున్న ప్రాజెక్ట్ పేరు 'ఏటిఎం'. హీస్ట్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ వెబ్‌సిరీస్‌ను దర్శకుడు చంద్రమోహన్ జీ5 ఓటీటీ ప్లాట్‌ఫాంలో రూపొందిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న సిరీస్‌ను రిలీజ్‌కు సిద్ధమయ్యింది. ఈ నేపథ్యంలో జనవరి 20న ప్రీమియం చేస్తున్నట్లు మేకర్స్ ఓ వీడియో విడుదల చేశారు.

'డ్రైవర్ జమున' మేకింగ్ వీడియో



ఐశ్వర్య రాజేశ్ టైటిల్ రోల్ నటించిన చిత్రం 'డ్రైవర్ జమున' ఈ చిత్రం తెలుగు, తమిళంతో పాటు వివిధ భాషల్లో డిసెంబర్ 30న విడుదలైంది. ఐశ్వర్య రాజేశ్ క్యాబ్ డ్రైవర్‌గా ప్రయాణం కొనసాగిస్తున్న సమయంలో జరిగిన సంఘటనల నేపథ్యం లో సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో సాగే ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా మేకర్స్ చిత్రం మేకింగ్ వీడియోను లాంచ్ చేశారు. ఈ సినిమా కోసం ఐశ్వర్య రాజేశ్ ఎలా కష్టపడిందో ఈ వీడియోలో అర్థమవుతుంది.

సిరీస్ కొట్టేదెవరో..!

భారత్, శ్రీలంక చివరి టి20 నేడు



రాత్రి 7.00గం॥ల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

రాజ్‌కోట్: భారత్-శ్రీలంక జట్ల మధ్య జరుగుతున్న మూడు టి20ల సిరీస్ హోరాహోరీగా సాగుతుంది. తొలి టి20లో టీమిండియా 2 పరుగుల తేడాతో గెలిస్తే.. రెండో టి20లో శ్రీలంక జట్టు 16పరుగుల తేడాతో టీమిండియాపై విజయం సాధించింది. దీంతో ఇరుజట్ల మధ్య శనివారం జరిగిన మూడో, ఆఖరి టి20లో గెలుపు ఇరుజట్లను ఊరిస్తోంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు టైటిల్‌ను గెలుపొందనుండగా.. భారత బ్యాటర్స్ సమిష్టిగా రాణించాల్సిన అవసరమెంతైనా ఉంది. భారత యువ బౌలర్ శివమ్ మావి అరంగేట్రం మ్యాచ్‌లో రాణించినా.. రెండో మ్యాచ్‌లో చేతులెత్తేశాడు. హర్షల్ పటేల్, అర్షదీప్ సింగ్ ఆశించినస్థాయిలో రాణించ లేకపోతున్నారు. పూణే వేదికగా జరిగే రెండో టి20లో శ్రీలంక జట్టు 200కు పైగా పరుగులు చేసి భారత్‌పై ఒత్తిడి పెంచింది. ఈ పిచ్ కూడా బ్యాటర్లకు స్వర్గధామం కాబట్టి బ్యాటర్లు, బౌలర్లు సమిష్టిగా రాణించాల్సిన అవసరం ఉంది. ఓపెనర్లు నిరాశపరుస్తుండడం టీమిండియాను కలవరపరుస్తోంది. సీనియర్ల విశ్రాంతితో యువ క్రికెటర్లపైనే టీమిండియా అభిమానులు గంపెడాశలు పెట్టుకున్నారు.

జట్లు..

ఇండియా: హార్దిక్(కెప్టెన్), ఇషాన్(వికెట్ కీపర్లు), సూర్యకుమార్(వైస్ కెప్టెన్), గైక్వాడ్, శుభ్‌మన్, దీపక్ హుడా, త్రిపాఠి, చాహల్, అక్షర్, అర్షదీప్/హర్షల్, ఉమ్రన్, శివమ్ మావి

శ్రీలంక: శనక(కెప్టెన్), నిస్సంక, ఫెర్నాండో, కుశాల్ మెండీస్, రాజపక్సె, అసలంక, ధనుంజయ, హసరంగ(వైస్ కెప్టెన్), తీక్షణ/కరుణరత్నే, మధుశనక, రజిత.

సెప్టెంబరులో ఆసియా కప్

ఒకే గ్రూప్‌లో భారత్, పాకిస్తాన్

ముంబయి: అక్టోబర్‌లో ఐసిసి వన్డే ప్రపంచకప్‌కు ముందు ఆసియా కప్ టోర్నమెంట్ జరిపేందుకు ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఏసిఏ) నిర్ణయించింది. ఈసారి పాకిస్తాన్ వేదికగా ఆసియా కప్ జరగాల్సి ఉండగా ఏసీఏ వేదికను ఇంకా ప్రకటించలేదు. భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలే ఇందుకు ప్రధాన కారణం. వన్డే ఫార్మాట్‌లో ఈ ఏడాది ఆసియా కప్ టోర్నీలో ఆరు జట్లు తలపడతాయని ఆసియా క్రికెట్ కౌన్సిల్ వెల్లడించింది. భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్‌తో పాటు మరో క్వాలిఫయర్ జట్టు తలపడుతుంది. భారత్, పాకిస్థాన్ ఈసారి ఒకే గ్రూపులో ఉన్నాయి. అయితే ఆసియా క్రికెట్ కౌన్సిల్ రెండేళ్ల క్యాలెండర్‌ను జై షా ప్రకటించడాన్ని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు తప్పుబట్టింది. ఏకపక్షంగా ప్రకటించారంటూ ఆరోపించింది.

టెస్ట్ సిరీస్ డ్రా

సర్ఫరాజ్ సెంచరీ, చివర్లో నసీమ్ షా మెరుపులు



కరాచీ: పాకిస్తాన్-న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన రెండో, చివరి టెస్ట్ డ్రా అయ్యింది. 319పరుగుల లక్ష్యంతో ఐదోరోజు ఆటను కొనసాగించిన పాకిస్తాన్ జట్టును మాజీ వికెట్ కీపర్ సర్ఫరాజ్ అహ్మద్ సెంచరీకి తోడు చివర్లో యువ పేసర్ నసీమ్ షా అద్భుత బ్యాటింగ్‌తో అలరించాడు. పాకిస్తాన్ 287 పరుగులకు 9వికెట్లు కోల్పోయిన దశలో నసీమ్ షా న్యూజిలాండ్ బౌలర్లకు అడ్డుగోడగా నిలిచి వికెట్ పడకుండా ఆడాడు. వికెట్ల చుట్టూ ఫీల్డర్లు పొంచి ఉన్నా.. వారి పైనుంచి బంతులను కొట్టాడు. 4ఓవర్లలో 15పరుగులు చేస్తే పాక్ గెలుస్తుందనుకున్న దశలో అంపైర్లు వెలుతురు లేమితో మ్యాచ్‌ను నిలిపివేశారు. ఆ సమమయానికి పాక్ జట్టు 9వికెట్లు కోల్పోయి 304పరుగులు చేసింది. తొలుత పాకిస్తాన్ 80పరుగులకే 5వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో సీనియర్ వికెట్ కీపర్ సర్ఫరాజ్(118) అద్భుత సెంచరీతో ఆదుకున్నాడు. 6వ వికెట్‌కు సర్ఫరాజ్ ఖాన్ షకీల్‌తో కలిసి 123పరుగులు, అఘా సల్మాన్‌తో కలిసి 7వ వికెట్‌కు 70 పరుగులు చేశాడు. చివర్లో నసీమ్ షా(15 నాటౌట్), అబ్రార్ (7) కలిసి 21బంతుల్లో 17పరుగులు జతచేసి న్యూజిలాండ్ విజయానికి కళ్లెం వేశారు. దీంతో రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ 0-0తో డ్రా కాగా.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ సర్ఫరాజ్ అహ్మద్‌కు దక్కింది. మూడు వన్డేల సిరీస్ 9నుంచి ప్రారంభం కానుంది.



టీమిండియా క్రికెటర్ విరాట్ కోహ్లి, అనుష్క శర్మ న్యూఢిల్లీలోని బృందావన్ ఆశ్రమాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనుష్క కూతురు వామికను ఒడిలో కూర్చోబెట్టుకోగా.. వామిక కాస్తా ముందుకు తిరగడంతో అక్కడ ఉన్న జనం ఫొటో క్లిక్ మనిపించారు.

ఆంధ్ర ఘన విజయం



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలోని చింతల వలస పివిజి రాజు క్రికెట్ మైదానంలో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-బిలో ఆంధ్రప్రదేశ్ జట్టు ఘన విజయం సాధించింది. 401పరుగుల లక్ష్య ఛేదనలో భాగంగా హైదరాబాద్ ఓవర్‌నైట్ స్కోర్ 2 వికెట్ల నష్టానికి 75 పరుగులతో శుక్రవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన 246పరుగులకు ఆలౌటైంది. దీంతో ఆంధ్రప్రదేశ్ జట్టు 154 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర జట్టు 135 పరుగులు, హైదరాబాద్ జట్టు 197 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో ఆంధ్ర జట్టు 462 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ హైదరాబాద్ 246 పరుగులకే ఆలౌటైంది. ఆంధ్ర బౌలర్లలో కెవి శశికాంత్ ఐదు వికెట్లు, సుదర్శన్ మూడు వికెట్లు సాధించి ఆంధ్ర జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68